www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



కలుషిత నీరు తాగి 50 మందికి అస్వస్థత

ఇద్దరి మృతి.. కలుషిత నీటివల్లేనంటున్న స్థానికులు
ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
కడుపు నొప్పి, వృద్ధాప్యంతోనే మరణాలు: వైద్యాధికారులు
సంగారెడ్డి జిల్లా సంజీవన్‌రావుపేటలో ఘటన 12

సోమవారం | 14-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 179

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి ఉ. 6.42, ద్వాదశి తె. 3.42 వరకు, నక్షత్రం: శతభిషం రా. 12.43 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ.9.24-10.52, దుర్ముహూర్తం: మ.12.24-1.10, మ.2.43-3.30; అమృతఘడియలు: రా.6.09-7.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.50

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1 రాజకీయం పక్కనపెట్టి అలయ్‌బలయ్‌కు..




హరియాణా గవర్నర్ దత్తాత్రేయ నిర్వహించిన అలయ్‌బలయ్‌లో గొంగడి, చేతికర్రతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మేఘాలయ గవర్నర్లు

1 రద్దీని దాటుకుంటూ నగరానికి..



దసరాను స్వగ్రామాల్లో సరదాగా గడిపిన హైదరాబాదీలు తిరుగు ప్రయాణమవడంతో యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద వాహనాల రద్దీ

1 నిప్పులు చిమ్ముతూ నేలపైకి..



స్పేస్ ఎక్స్ చరిత్ర సృష్టించింది. 'స్టార్‌షిప్' మెగా రాకెట్‌ను ప్రయోగించిన కొద్ది సేపటికి దాని బూస్టర్ వి జయవంతంగా తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. ఇలా జరగడం ఇదే తొలిసారి.



ప్రైవేటులో ఆయుష్మాన్ భారత్ అందని ద్రాక్షే

ఆరోగ్యశ్రీనే అందుబాటులో.. గత సర్కారు నుంచీ ఇంతే
ఇతర రాష్ట్రాల ప్రజలకు మాత్రం పథకం వర్తింపు
ఆరోగ్యశ్రీలో లేని కొన్ని చికిత్సలు ఆయుష్మాన్‌లో..
స్థానికులకూ వర్తింపజేస్తే ఎంతోమందికి ప్రయోజనం
వృద్ధులకు కేంద్రం ప్రకటించిన ఆరోగ్య బీమాపైనా అనిశ్చితి

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఆయుష్మాన్ భారత్)ను తెలంగాణ వాసులకు కాకుండా ఇతర రాష్ట్రాల వారికి మాత్రమే అమలు చేస్తున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. దీనివల్ల, ఆయుష్మాన్ భారత్‌కు అన్ని అర్హతలు ఉండి కూడా.. దానిని ఉపయోగించుకోలేకుండా తెలంగాణవాసులు ఉన్నారు. ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉన్నప్పటికీ.. దానిలో కవర్‌కాని చికిత్సలు కొన్ని ఆయుష్మాన్‌భారత్‌లో ఉంటున్నాయి. వీటి కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే.. రాష్ట్ర ప్రజలకు అది అందుబాటులో ఉండటం లేదు. వాస్తవానికి, కేంద్రం ఆయుష్మాన్ భారత్‌ను ప్రవేశపెట్టిన తర్వాత నాటి బీఆర్ఎస్ సర్కారు మనదగ్గర దీన్ని తొలుత అమలు చేయలేదు. దీనిపై విమర్శలు రావడంతో 2021 మే నుంచి అమలు చేసేందుకు అంగీకరించింది. అయితే ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితం చేసింది. ఈ స్కీమ్ కింద నమోదు చేసుకోవటానికి కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ప్రయత్నించినా కూడా నాటి రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ

మిగతా 12వ పేజీలో...


వృద్ధులకు ఆయుష్మాన్‌లో మరింత మేలు

అల్జీమర్స్ చికిత్స చేర్పు
మానసిక సమస్యలూ..
కేంద్రం యోచన 2

స్కిల్ వర్సిటీ.. కొలువు గ్యారెంటీ

కోర్సు పూర్తిచేసిన ప్రతి విద్యార్థికీ ఉపాధి

100% ఉద్యోగాల కోసం కంపెనీలతో ఒప్పందాలు
ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ షురూ.. 29 వరకు చాన్స్
ఈ ఏడాది మూడు రంగాల్లో నాలుగు కోర్సులు
2 తాత్కాలిక ప్రాంగణాల్లో నవంబరు 4 నుంచి తరగతులు
శిక్షణకు తొలి బ్యాచ్‌లో 2 వేల మంది ఎంపిక



ఇవీ రంగాలు..

ఔషధ-ఆరోగ్య సంరక్షణ, రవాణా, సరుకు నిల్వ (లాజిస్టిక్స్) రంగాల్లో నాలుగు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనుంది.

ఇవీ కోర్సులు..

వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్, ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సలెన్స్, ఫార్మా అసోసియేట్ ప్రోగ్రాం సర్టిఫికేషన్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ.. ఇందులో కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్కిల్ యూనివర్సిటీలో నైపుణ్యం పెంచుకుంటే కొలువు గ్యారెంటీ అన్న భరోసా కల్పించనుంది. యువతలో నైపుణ్యాలు పెంచి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్కిల్ వర్సిటీలో తరగతులు ప్రారంభం కానున్నాయి. కోర్సుల్లో ప్రవేశాలకు అర్హతలు, ఫీజు, వ్యవధి వంటి వివరాలను వర్సిటీ తాజాగా విడుదల చేసింది. ఇప్పటికే సంబంధిత రంగాల్లోని దిగ్గజ పరిశ్రమలతో ఒప్పందాలు కూడా పూర్తి చేసుకుంది. ఇక 17 రంగాల్లో ఏటా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వర్సిటీలో ఈ ఏడాది తొలి బ్యాచ్‌లో 2 వేల మందిని ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 4 నుంచి ప్రారంభం కానున్న తొలి బ్యాచ్ తరగతులకు సంబంధించిన ప్రవేశాల దరఖాస్తు ప్రక్రియ అధికారిక వెబ్‌సైట్ (yisu.in) ద్వారా ప్రారంభమైంది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, సైబరాబాద్ ఇజ్జత్‌నగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లోని రెండు తాత్కాలిక ప్రాంగణాల్లో తరగతులు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం నర్సింగ్. రాష్ట్రవ్యాప్తంగా 112 నర్సింగ్ కాలేజీల్లో 6500 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ అనేక ఆస్పత్రుల్లో కేరళ, ఇతర రాష్ట్రాల నర్సులకే

మిగతా 13వ పేజీలో...



పుంజుకుంటున్న ట్రంప్!

కమలా హ్యారిస్ శిబిరంలో కలవరం
పోరు రసవత్తరం.. తేడా 2 శాతమే
అమెరికా అధ్యక్ష ఎన్నికలపై తాజా సర్వేల్లో వెల్లడి
కీలక 'స్వింగ్' రాష్ట్రాల్లో మాజీ అధ్యక్షుడి ముందంజ
హ్యారిస్‌ను భయపెడుతున్న హరికేన్లు, యుద్ధం
ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడంపై అరబ్ ఓటర్లలో ఆగ్రహం
ట్రంప్ ఆర్థిక విధానాలపై ఆర్థికవేత్తల ఆందోళన
దిగుమతి సుంకాల పెంపు యోచనపై ధ్వజం

అమెరికా అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. పాలక డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిని, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ నడుమ హోరాహోరీ పోరు నెలకొనడం ఖాయంగా కనిపిస్తోంది. పలు సర్వే సంస్థలు నిన్నమొన్నటి వరకు హ్యారిస్ విజయం ఖాయమని అంచనా వేశాయి. తాజాగా ట్రంప్ బాగా పుంజుకుంటున్నట్లు పేర్కొన్నాయి. గత పది రోజుల్లో తాము నిర్వహించిన సర్వేల సగటు చూస్తే దేశవ్యాప్తంగా హ్యారిస్ ఆధిక్యం నాలుగు శాతం నుంచి రెండు శాతానికి

మిగతా 2వ పేజీలో...



అమెరికా ప్రచారంలో తెలుగు బ్యానర్లు

సంస్కృతి-సన్మానం దేశానికి ఆధారమంటూ డల్లాస్‌లో ఫ్లెక్సీ
కమలకు రెహమాన్ మద్దతు.. అదరగొట్టిన వీడియో 2

రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఉన్నట్టేనా?

నాలుగు నెలల క్రితం ఏర్పడిన ట్రైబ్యునల్
ఇంతవరకు నోటిఫై చేస్తూ రాని ప్రకటన
సిబ్బంది కేటాయింపులూ చేయని సర్కారు
విచారణలు ప్రారంభించలేని పరిస్థితి
40కి పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) వివిధ ప్రాజెక్టుల విషయంలో తీసుకునే నిర్ణయాలను సవాలు చేసేందుకు అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసినా.. దాని కార్యాచరణ మాత్రం ప్రారంభం కావడంలేదు. ట్రైబ్యునల్ ఏర్పాటై నాలుగు నెలల గడుస్తున్నా సిబ్బంది కొరత వల్ల పని ప్రారంభించలేదు. దీంతో రెరా విధించిన జరిమానాలపై అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించిన వారికి పరిష్కారం దొరకడంలేదు. సాధారణంగా రెరా తీసుకున్న నిర్ణయాల్లో రుసుముల గురించి గానీ, లేదా ప్రాజెక్టుల ప్రకటనలు, ప్రీ లాంచింగ్ అమ్మకాలు, రెరా రిజిస్ట్రేషన్ లేకుండా విక్రయాలు తదితర అంశాలపై అభ్యంతరాలున్న వారు అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తుంటారు. ఈ అవసరమైన

మిగతా 12వ పేజీలో...



పట్నం మహేందర్ రెడ్డి చీఫ్ విప్ ఎలా?

ఆయన మా పార్టీకి చెందిన ఎమ్మెల్సీ
రేవంత్ పాలనలో రాజ్యాంగం ఖూనీ
ఏ పార్టీవారికి విప్ జారీ చేస్తారు?
చైర్మన్ బులెటిన్‌తో అనర్హతకు బలం
గవర్నర్, సీఎస్‌కు లేఖరాస్తాం: హరీశ్
కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా?
దీనికి మీరేం సమాధానం చెబుతారు
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కౌంటర్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ రాజ్యాంగ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్నం మహేందర్‌రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇస్తారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఆదివారం శాసనమండలిలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ చైర్మన్ స్వయంగా మహేందర్ రెడ్డి చీఫ్ విప్‌గా ఎంపికైనట్లు బులెటిన్

మిగతా 3వ పేజీలో...



గీసుగొండ ఠాణాలో సీఐ కుర్చీలో కూర్చొని పోలీసులను ప్రశ్నిస్తున్న మంత్రి సురేఖ

కొండా Vs రేవూరి

కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విభేదాలు.. ధర్మారంలో ఫ్లెక్సీ వివాదం
ఎమ్మెల్యే ఫొటో లేదని రగడ.. మంత్రి, ప్రకాశ్‌రెడ్డి వర్గాల ఘర్షణ
పోలీసులపై సురేఖ ఆగ్రహం.. సీఐ కుర్చీలో కూర్చోవడంపై వివాదం

గీసుగొండ, అక్టోబరు 13: వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుల మధ్య తలెత్తిన వివాదం.. మంత్రి సురేఖ స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసేదాకా వెళ్లింది. దసరా ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ పరకాల నియోజకవర్గంలోని ధర్మారంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఈ వివాదానికి కారణమైంది. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ఫొటో లేకపోవడంతో కొండా వర్గీయులతో రేవూరి వర్గీయులు వాగ్వాదానికి దిగారు. మరుసటి రోజు ఆ ఫ్లెక్సీ చినిగి ఉండటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మంత్రి వర్గీయులు తనపై దాడికి పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే రేవూరి వర్గానికి చెందిన

మిగతా 13వ పేజీలో...

రవాణాశాఖలో కార్డుల్లేవ్!

నెల నుంచి అందుబాటులో లేని స్మార్ట్ కార్డులు
ఆర్‌సీలు, డ్రైవింగ్ లైసెన్సులు ఎప్పుడో?
వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
త్వరలోనే వస్తాయంటున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పలు రవాణా కార్యాలయాల్లో సెప్టెంబరు 15 నుంచి కార్డులు అందుబాటులో లేవు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇదే దుస్థితి. అయినా కార్డులు సమకూర్చడంలో రవాణా శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కార్డుల కొరతతో గ్రేటర్‌లోని పలు ఆర్టీఏ కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల జారీ నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్ అనంతరం వారాల తరబడి వాహనదారులు నిరీక్షించాల్సిన వస్తోంది. కార్డుల కొరతతో ఆర్సీలు ఎప్పుడు వస్తాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు



మిగతా 12వ పేజీలో...

ప్రొఫెసర్ సాయిబాబ కన్నుమూత



- అనారోగ్యంతో వారం క్రితం నిమ్స్‌లో చేరిక
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే తుదిశ్వాస
- వైకల్యాన్ని జయించి పోరాడిన హక్కుల నేత
- నేడు గన్‌పార్క్ వద్ద మృతదేహానికి నివాళి
- తర్వాత గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

2



మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య

ముంబైలో కాల్చి చంపిన దుండగులు
ముగ్గురు నిందితుల పట్టివేత.. మరొకరు పరారీ
ఇది తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్
సల్మాన్ సహా బాలీవుడ్ స్టార్లకు సన్నిహితుడు సిద్దిఖీ

2

దేశంలో ఆకలి కేకలు!

ప్రపంచ సూచీలో 105వ స్థానంలో భారత్



సీరియస్ కేటగిరీలో దేశం
పాక్, అఫ్ఘానిస్థాన్ వంటి 42 దేశాల సరసన చోటు
మన కంటే ఉత్తమ కేటగిరీలో బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్



కమలా హారిస్‌కు రెహమాన్ మద్దతు

» ఎన్నికల ప్రచారానికి 30 నిమిషాల వీడియో రూపకల్పన

వాషింగ్టన్, అక్టోబరు 13: అమెరికాలో అధ్యక్ష ఎన్నికల హడావుడి నెలకొంది. నవంబరు 5న జరిగే ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ఆమె ఎన్నికల ప్రచారానికి ఊతమిచ్చేలా లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ 30 నిమిషాల నిడివిగల ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఇండో-ఆఫ్రికా సంతతికి చెందిన హారిస్‌కు ఈ ఎన్నికల్లో మద్దతు పలికిన తొలి అంతర్జాతీయ కళాకారుడు రెహమాన్ కావడం విశేషం. 'అమెరికాలో ప్రగతి, ప్రాతినిధ్యం కోసం నిలబడిన నాయకులు, కళాకారుల బృందానికి మద్దతుగా ఏఆర్ రెహమాన్ తన గాత్రాన్ని అందించారు. కమలా హారిస్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా 30 నిమిషాల వీడియోను రూపొందించారు' అని 'ది ఏషియన్ అమెరికన్ పసిఫిక్ ఐలాండర్స్ (ఏఐపీఐ)' విక్టరీ ఫండ్ సంస్థ చైర్మన్ శేఖర్ నరసింహన్ పేర్కొన్నారు. తమిళ మూలాలున్న కమలా హారిస్‌కు ఈ ఎన్నికల్లో ఏఐపీఐ విక్టరీ ఫండ్ సంస్థ మద్దతుగా నిలిచింది. దానికి ఏఆర్ రెహమాన్ కూడా తోడ్పాటు నందించారు. 'ఇది ఒక సంగీత కార్యక్రమం మాత్రమే కాదు. అమెరికాలో మా సంఘాలు, మేం చూడాలనుకునే భవిష్యత్తుకు ఓటు వేయాలని మా కమ్యూనిటీలకు ఇస్తున్న పిలుపు' అని నరసింహన్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ రాత్రి రెహమాన్ రూపొందించిన వీడియోను ఏఏపీఐ విక్టరీ ఫండ్... యూట్యూబ్‌లోనూ ప్రసారం చేయనుంది. ఈ వీడియోలో రెహమాన్‌కు అత్యంత ఇష్టమైన కొన్ని పాటలు ఉంటాయని, అలాగే హారిస్ అభ్యర్థిత్వం, ఏఏపీఐ కమ్యూనిటీ పట్ల నిబద్ధతను తెలియజేస్తూ కొన్ని సందేశాలు ఉంటాయని ఆ సంస్థ పేర్కొంది.

అమెరికా ఎన్నికల ప్రచారంలో తెలుగులో బ్యానర్లు

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో తెలుగువారి ప్రాబల్యం పెరిగిపోతోంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవంతో పాటు భారతీయ పండుగలకు అమెరికాలో సెలవులు ఇస్తున్నారు. అక్కడి వీధులకు భారతీయ ప్రముఖుల పేర్లు పెడుతున్నారు. తాజాగా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ తెలుగులో రాసి ఉన్న బ్యానర్లు అమెరికా వీధుల్లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార హడావుడి నెలకొంది. ఈ నేపథ్యంలో డల్లాస్‌లో 'సంస్కృతి, సన్మార్గం-దేశానికి ఆధారం' అని రాసి ఉన్న బ్యానర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అలాగే తమిళంలో రాసిన బ్యానర్లు కూడా కనిపిస్తున్నాయి. పై చదువుల కోసం అమెరికాకు వెళ్లి, అక్కడే ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడుతున్న తెలుగు వారి సంఖ్య యేటా పెరుగుతోంది. ఈ క్రమంలోనే అమెరికా రాజకీయాల్లో కూడా తెలుగువారు, భారతీయులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. భారత సంతతికి చెందిన వారు అమెరికాలో సెనెటర్ల వంటి పదవుల నుంచి నేడు ఏకంగా ఆ దేశ అధ్యక్ష పదవికి పోటీ చేసే స్థాయికి ఎదిగారు. డెమొక్రాట్ల తరఫున భారత సంతతికి చెందిన కమలా హారిస్ అధ్యక్ష బరిలో ఉన్నారు. రిపబ్లికన్ల తరఫున ఉపాధ్యక్షుడిగా ట్రంప్ బలపర్చిన వాన్స్. భారత సంతతికి చెందిన తెలుగమ్మాయి ఉషా చిలుకూరి భర్త కావడం విశేషం. దీంతో అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఎవరు గెలిచినా భారత్‌కు గర్వకారణమే. వాన్స్ రిపబ్లికన్ల తరఫున ఉండటంతో తెలుగు ప్రవాసులు ఏ పార్టీ వైపు ఉన్నారనేది కూడా చర్చనీయాంశంగా మారింది. దీంతో, తెలుగువారిని ప్రసన్నం చేసుకోవడానికి ఇరుపార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

లోకం తీరు



స్పేస్ ఎక్స్ సరికొత్త చరిత్ర

» లాంచ్‌ప్యాడ్ వద్దే స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్ ల్యాండింగ్

» ఉపయోగించిన రాకెట్ బూస్టర్‌ను లాంచ్‌ప్యాడ్ వద్దకు రప్పించి ఒడిసిపట్టుకోవడం ఇదే మొట్టమొదటిసారి

» 'పునర్వినియోగ రాకెట్' ప్రయోగాల్లో కీలక ముందడుగు

వాషింగ్టన్, అక్టోబరు 13: పునర్వినియోగ అంతరిక్ష వాహక నౌకలకు సంబంధించి ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ చరిత్ర సృష్టించింది. ఆ కంపెనీకి చెందిన, ప్రపంచంలోనే అతిపెద్దదైన 'స్టార్‌షిప్' మెగా రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించిన కొద్ది సేపటి తర్వాత దాని బూస్టర్ తిరిగివచ్చి విజయవంతంగా లాంచ్‌ప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. ఒక రాకెట్‌కు చెందిన బూస్టర్‌ను తిరిగి లాంచ్ ప్యాడ్ వద్దకు తీసుకురావడం ఇదే మొట్టమొదటిసారి. 'ఇది ఇంజనీరింగ్ అద్భుతం' అని స్పేస్ ఎక్స్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆదివారం టెక్సస్ తీరంలో ఈ ప్రయోగం నిర్వహించారు. స్టార్‌షిప్ రాకెట్ పొడవు 121 మీటర్లు. ఇందులో బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్ అని రెండు విభాగాలుంటాయి. బూస్టర్ పొడవు 71మీటర్లు. ప్రయోగంలో భాగంగా రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపించారు. కొద్దిసేపటి తర్వాత, బూస్టర్ నుంచి స్పేస్‌క్రాఫ్ట్ విడిపోయింది. ముందుగా అనుకున్న ప్రకారం... స్పేస్‌క్రాఫ్ట్‌ను హిందూ మహాసముద్రంలో దింపివేశారు. బూస్టర్‌ను తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్దకు రప్పించారు. అక్కడ బూస్టర్ ఒడిసిపట్టుకోవడానికి ప్రత్యేకంగా క్రేన్ లాంటి నిర్మాణాల(చాప్ స్టిక్స్)ను ఏర్పాటు చేశారు. అవి, బూస్టర్‌ను విజయవంతంగా ఒడిసిపట్టుకున్నాయి. స్పేస్ ఎక్స్‌కే చెందిన ఫాల్కన్-9 రాకెట్ బూస్టర్లు ఇప్పటికే పునర్వినియోగించుకొనే వెసులుబాటు ఉన్నవి. అయితే, వీటిని సముద్రాల వద్ద కింద పడేలా చేసి తర్వాత ఉపయోగిస్తున్నారు. కాగా, చంద్రుడు, అంగారకుడిపై యాత్రలకు వీలుగా స్పేస్ ఎక్స్ సంస్థ స్టార్ షిప్ రాకెట్‌ను రూపొందించింది.

'ఆయుష్మాన్'లో వృద్ధులకు మరిన్ని ప్రయోజనాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 13: దేశంలో 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు మరిన్ని ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) భావిస్తోంది. ఏబీ-పీఎంజేఏవైలో ప్రస్తుతం జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి 27 రకాల స్పెషాలిటీల్లో 1,949 వైద్య సేవలతో సమగ్ర కవరేజీని అందిస్తున్నారు. అయితే 70 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువగా కనిపించే అల్జీమర్స్, చిత్తవైకల్యం వంటి కొన్ని మానసిక సమస్యలకు అవసరమైన చికిత్స కూడా ఈ పథకంలో అందించాలని ఎన్‌హెచ్‌ఏ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆకలి సూచీలో 105వ స్థానంలో భారత్

లండన్, అక్టోబరు 13: భారత్‌లో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. 2024-ప్రపంచ ఆకలి సూచీలో దేశం 105వ స్థానం దక్కించుకుని 'సీరియస్' కేటగిరీలో ఉండడం గమనార్హం. ఈ కేటగిరీలో మొత్తం 42 దేశాలు ఉండగా భారత్‌తోపాటు పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ వంటివి ఉన్నాయి. అదేవిధంగా పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లు భారత్ కంటే మెరుగైన కేటగిరీలో ఉండడం విశేషం. తాజాగా అంతర్జాతీయ మానవతావాద సంస్థలు ప్రపంచ ఆకలి సూచీ(జీహెచ్‌ఐ)ని అంచనా వేశాయి. పోషకాహార లోపం, చిన్నపిల్లల మరణాలు వంటివి ఆధారంగా చేసుకుని మొత్తం 127 దేశాల్లో పరిస్థితిని వెల్లడించాయి. ఈ జాబితాలో భారత్ 105 స్థానం దక్కించుకుంది. "27.3 స్కోరుతో భారత్ ఆకలి స్థాయిలో సీరియస్ కేటగిరీలో ఉంది" అని నివేదిక పీఠికలోనే పేర్కొనడం గమనార్హం. దేశంలో 13.7% మంది ప్రజలు పోషకాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు.

భూమిని తిరిగి ఇచ్చేస్తామన్న ఖర్గే కుటుంబం

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్దార్థ విహార ట్రస్టుకు ఐదెకరాల భూమి కేటాయింపుపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో...ఆ భూమిని ప్రభుత్వానికి తిరిగి ఇస్తూ లేఖ రాశారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుబంధంగా ఉండే బెంగళూరు ఏరోస్పేస్ పార్కులో ఐదెకరాల భూమిని ప్రజా సౌకర్యాలకు కేటాయించడం వివాదాస్పదమైంది. సిద్దార్థ విహార ట్రస్టుకు కేటాయించిన ఆ భూమిని ఇటీవల ప్రభుత్వానికి వాపసు చేస్తూ రాహుల్ ఖర్గే.. కర్ణాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి బోర్డు (కేఐఏడీబీ)కి లేఖ పంపారు. బెంగళూరులోని ఏరోస్పేస్‌పార్కులో గతంలో స్థలాలు పంపిణీ చేశారు. అప్పట్లో 193 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలో 43 సంస్థలను ఎంపిక చేశారు. అందులో సిద్దార్థ విహార ట్రస్టుకు ఐదెకరాల భూమిని కేటాయించడం వివాదానికి దారితీసింది.

కేంద్రమంత్రి కుమారస్వామిపై పోలీసులకు లోకాయుక్త ఏడీజీపీ ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామి, ఆయన కుమారుడు జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్‌కుమార్‌పై లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్రమంత్రి కుమారస్వామి గతనెలలో తనపట్ల అనవసర ఆరోపణలు చేశారని, మౌఖికంగా బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిఖిల్ దురుద్దేశపూర్వకంగా పలు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కుమారస్వామి ఆప్తుడు సురేశ్‌బాబు సోషల్ మీడియాలో బెదిరింపులకు దిగాడని, వీరిపై చర్యలు తీసుకోవాలని బెంగళూరులోని సంజయ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఏడీజీపీ ఫిర్యాదు చేశారు. తాను లంచం తీసుకున్నానని ఆరోపించారని, ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయిస్తానని బెదిరించారనీ, కుటుంబ సభ్యులపైనా తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.

రేపు దేశవ్యాప్తంగా వైద్యుల నిరాహార దీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 13: కోల్‌కతాలో అత్యాచారానికి, హత్యకు గురయిన ట్రైనీ డాక్టరుకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా వైద్యులు నిరాహార దీక్ష చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఇదే విషయమై కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్యకళాశాల వద్ద జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష తొమ్మిదో రోజుకు చేరుకున్న నేపథ్యంలో ఐఎంఏ ఈ ప్రకటన చేసింది. ఇదిలా ఉండగా, ఆందోళనకారుల డిమాండ్లు సోమవారంలోగా పరిష్కరించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని బెంగాల్‌లోని కల్యాణి జేఎన్ఎం ఆస్పత్రికి చెందిన 77 మంది సీనియర్ వైద్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గుజరాత్‌లో రూ.5వేల కోట్ల కొకైన్ సీజ్

ఢిల్లీ, అక్టోబరు 13: గుజరాత్‌లో భారీ స్థాయిలో డ్రగ్స్ డెన్ బట్టబయలైంది. రూ5,620 కోట్ల విలువైన 518 కిలోల కొకైన్ పట్టుబడింది. ఢిల్లీ, గుజరాత్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి గుజరాత్ అంకలేశ్వర్‌లోని అవకర్ డ్రగ్స్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీకి చెందిన తుషార్(40), హిమాన్షు(27), ఔరంగాజేబ్ (23), ముంబైకి చెందిన భరత్ కుమార్ జైన్ (48), యూపీలోని హాపూర్‌కు చెందిన అఖ్‌లక్‌ను అరెస్టు చేశారు. గత 11 రోజుల్లో ఈ స్థాయిలో డ్రగ్స్ సీజ్ చేయడం మూడోసారి కావడం కావడం గమనార్హం. అక్టోబరు 10న ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందం రూ.2వేల కోట్ల విలువైన 200 కిలోల కొకైన్‌ను ఢిల్లీలో స్వాధీనం చేసుకున్నారు.

పుంజుకుంటున్న ట్రంప్!

(మొదటి పేజీ తరువాయి)



తగ్గిపోయినట్లు 'ది గార్డియన్' పత్రిక ఆదివారం వెల్లడించింది. నువ్వా నేనా అనే రీతిలో పోరు జరిగే 19 కీలక రాష్ట్రాల్లో ట్రంప్ ముందంజలో ఉండడం హ్యారిస్ శిబిరాన్ని కలవరపరుస్తోంది. ఆయన దూకుడును అడ్డుకునే దిశగా ప్రచార వ్యూహం రచిస్తోంది. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ట్రంప్ ముందంజలోకి రావడానికి కారణంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెలలో అమెరికాలో సంభవించిన రెండు విధ్వంసక హరికేన్లు (మిల్టన్, హెలెన్), పశ్చిమాసియా సంక్షోభం పూర్తిస్థాయి యుద్ధంగా మారే ప్రమాదం మొదలైనవి హ్యారిస్ ఆధిక్యం తగ్గడానికి ప్రధాన కారణాలుగా 'గార్డియన్' పేర్కొంది. రెండు వారాల కిందట ఆమె వైపు 48% మంది అమెరికన్లు మొగ్గు చూపగా.. ట్రంప్ 44% మంది మద్దతు పొందారు. ఈ నెల 10వ తేదీ నాటికి ఆమె ఆధిక్యం 46 శాతానికి తగ్గిపోయింది. అంటే ప్రస్తుతం ఇద్దరి మధ్య రెండు శాతం తేడా మాత్రమే ఉండడం డెమొక్రాట్లను విస్మయపరుస్తోంది. పెన్సిల్వేనియా, మిచిగన్, విస్కాన్సిన్, నార్త్ కరోలినా, జార్జియా, అరిజోనా, నెవడా.. ఈ ఏడు రాష్ట్రాలు అధ్యక్ష ఎన్నికల్లో విజేతను నిర్ణయిస్తాయని చెబుతారు. వీటిలో 3 రాష్ట్రాల్లో మాత్రమే హ్యారిస్ వైపు మొగ్గు కనిపిస్తోంది. వీటిలోనూ పెన్సిల్వేనియాలో ట్రంప్ కంటే ఒక శాతమే ఆమె ముందంజలో ఉన్నారు. మిగతా రాష్ట్రాల్లో ట్రంప్‌కు స్వల్ప ఆధిక్యం కనిపిస్తోంది. నవంబరు 5న అధ్యక్ష ఎన్నికల పోలింగ్ నాడు ఇదే పరిస్థితి కొనసాగితే.. విజయానికి కావలసిన 270 ఎలక్టొరల్ కాలేజీ ఓట్లను ట్రంప్ సునాయాసంగా దక్కించుకుని.. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవుతారని 'గార్డియన్' అంచనా వేసింది. గత నెల పదో తేదీ నాటికి.. అన్ని సర్వేల డేటాలను అధ్యయనం చేస్తే నూటికి 55% హ్యారిస్సే గెలుస్తారని ఫలితాలు చెబుతున్నాయని, ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదని తెలిపింది. అయితే ఇప్పుడున్న ట్రెండ్ పోలింగ్ తేదీన కూడా కొనసాగితే అరిజోనా, మిచిగన్, విస్కాన్సిన్, జార్జియాల్లో ఆమెకు స్వల్ప ఆధిక్యం మాత్రమే లభిస్తుందని.. బొటాబొటీగా నెగ్గడానికి ఇది దోహదపడుతుందని 11వ తేదీన 'వాల్ స్ట్రీట్ జర్నల్' సర్వే వెల్లడించింది. ఈ నెల 3-8 తేదీల నడుమ 'యాక్సివోట్' నిర్వహించిన సర్వేలో హ్యారిస్ కంటే ట్రంప్ 1.2 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నట్లు తేలింది.

తక్కువ మార్జిన్‌తో తంటా..

హ్యారిస్ ప్రజాదరణ శాతం క్రమంగా తగ్గుతుండడంతో ఉపాధ్యక్షురాలి శిబిరానికి ఏమీ పాలుపోవడం లేదు. జూలైలో కమలను డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థినిగా ప్రకటించాక.. ఆ పార్టీకి విరాళాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. గత 80 రోజుల్లో ఆమె ప్రచార బృందం బిలియన్ డాలర్ల విరాళాలు సేకరించింది. అయితే ట్రంప్ టీమ్ తక్కువ తినలేదు. ఆగస్టు నెలాఖరునాటికి 3 బిలియన్ డాలర్లకుపైగా సాధించింది. మరోవైపు పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ఆర్థికంగా అండగా నిలవడమే గాక కీలక 'స్వింగ్' రాష్ట్రాల్లో ట్రంప్ అనుకూల ఓటర్లుగా రిజిస్టర్ చేసుకునేవారికి నగదు కూడా ఇస్తున్నారు. గత నెల పదో తేదీన ఫిలడెల్ఫియాలో ట్రంప్‌తో జరిగిన చర్చలో హ్యారిస్ విజేతగా నిలిచారు. కానీ మిచిగన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియాల్లో క్రమంగా ఆమె ప్రజాదరణ తగ్గుతూ వస్తోంది. అయితే హ్యారిస్ కూడా ఓటర్ల మద్దతు కోసం పెద్దఎత్తున కృషిచేస్తున్నారు. సబర్బన్ ఓటర్లు, మధ్య ఆదాయ వర్గాలే లక్ష్యంగా వరాలు ప్రకటిస్తున్నారు. చౌకగా వైద్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆర్థిక పారదర్శకత వంటి హామీలతో ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో సబర్బన్ ఓటర్లలో 47% మంది ఆమె వైపు మొగ్గుచూపుతున్నారని.. 41% మంది మాత్రమే ట్రంప్ వైపు నిలిచారని 'రాయిటర్స్/ఇప్సోస్' సర్వే వెల్లడించింది. 2020 ఎన్నికల్లో ట్రంప్ ఓటమికి సబర్బన్ ఓటర్లే కారణం కావడం విశేషం.

\- సెంట్రల్ డెస్క్.

యుద్ధభయం..

నవంబరు 5న అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరుగనుంది. అంటే 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ తరుణంలో పశ్చిమాసియాలో యుద్ధం నానాటికీ తీవ్రరూపం దాల్చుతుండడం, ఇరాన్ మద్దతున్న లెబనాన్ షియా గ్రూపు హెజ్‌బుల్లాపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. అమెరికాలో స్థిరపడిన అరబ్ ఓటర్లలో హ్యారిస్‌పై ఆగ్రహానికి కారణాలయ్యాయని అంటున్నారు. గాజాలో హమా‌స్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి వైట్‌హౌస్ మద్దతివ్వడంపై ఇప్పటికే వారు మండిపడుతున్నారు. ఈ అంశం కారణంగానే మిచిగన్, విస్కాన్సిన్‌లలో ట్రంప్ మంచి ఆధిక్యం సాధించారని 'క్వినిపియాక్' సర్వే పేర్కొంది. ఇదిగాక ఆర్థిక వ్యవస్థ కుదేలవడం, ద్రవ్యోల్బణం పెరుగుదల, జీవన వ్యయం పెరగడం, ఇమిగ్రేషన్ సమస్యలు కూడా అధికార పార్టీకి ఇబ్బందులుగా పరిణమించాయి. దీని నుంచి తక్షణమే బయటపడాలని.. ఆయన ఆర్థిక విధానాలను విస్తృతంగా టార్గెట్ చేయాలంటూ 1992లో బిల్ క్లింటన్ విజయంలో కీలక భూమిక పోషించిన జేమ్స్ కార్విల్ పిలుపిచ్చారు. దిగుమతులపై సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటిస్తున్నారు. దీనివల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ట్రంప్‌పై విద్యావంతుల్లో, మధ్యతరగతి ప్రజల్లో వ్యతిరేకతకు ఇదే ముఖ్య కారణంగా భావిస్తున్నారు.

ఇజ్రాయెల్‌పై 9/11 తరహా దాడికి హమాస్ కుట్ర

» అక్టోబరు 7కు ముందే జరపాలని పథకం!

వాషింగ్టన్, అక్టోబరు 13: ఇజ్రాయెల్‌పై అక్టోబరు 7 దాడికి ముందే హమాస్ 9/11 తరహా భారీ దాడికి కుట్ర పన్నిందని ఆధారాలు లభించినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. పాలస్తీనా ఖాన్ యూనిస్ లోని హమాస్ కమాండ్ సెంటర్ నుంచి ఇజ్రాయెల్ బలగాలు స్వాధీనం చేసుకున్న కీలక పత్రాల్లో దాడికి కుట్ర వివరాలు బయటపడ్డాయి. ఐడీఎఫ్ బలగాలు అందించిన పత్రాలు, ఇతర ఆధారాలతో న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, వాల్‌స్ట్రీట్ జర్నల్ తదితర అంతర్జాతీయ మీడియా సంస్థలు హమాస్ కుట్రకు సంబంధించి తాజా కథనాలు ప్రచురించాయి. దాడి కోసం 2022 జనవరి నుంచి 2023 ఆగస్టు వరకూ హమాస్ రాజకీయ, సైనిక విభాగాలు పది ఉన్నత స్థాయి సమావేశాలు జరిపి ఇరాన్ నుంచి ఆర్థిక మద్దతు, సైనిక సాయం కోరాయి. టెల్ అవీవ్‌లోని బహుళ అంతస్థుల అజ్రెయిలీ టవర్స్‌ను కూల్చేయాలనేది హమాస్ అసలు కుట్ర. దీనికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ ఖానీ ఇతర ఇరాన్ కీలక నేతలతో హమాస్ నేత యాహ్యా సిన్వార్ చర్చలు కూడా జరిపాడు. ఇరాన్, హెజ్‌బుల్లాల నుంచి అదనపు ఆర్థిక మద్దతు, సైనిక సాయం అందే విషయంలో ఆలస్యం కావడంతో హమాస్ కుట్రను అమలు చేయలేక విరమించుకుంది. చివరకు వ్యూహాన్ని మార్చుకుని ఇజ్రాయెల్‌లో అంతర్గత పరిస్థితులు సరిగా లేని తరుణం చూసి 2023 అక్టోబర్ 7న భీకర దాడికి పాల్పడింది. 12 వందల మందిని చంపేయడంతో పాటు 250 మంది ఇజ్రాయెలీలను బందీలుగా తీసుకువెళ్లింది. కాగా, గాజాలోని జబాలియా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో 50 మంది చనిపోయారు.

జైలులో నాటకం.. సీతను వెతుకుతూ ఇద్దరు ఖైదీల పరార్

న్యూఢిల్లీ, అక్టోబరు 13: దసరా సందర్భంగా జైలులో రామాయణం నాటకం వేయగా, వానరుల వేషం వేసిన ఇద్దరు ఖైదీలు గోడదూకి పారిపోయారు. ఈ ఘటన ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని రోషనాబాద్ జైలులో జరిగింది. జైలులో దసరా సందర్భంగా రామాయణం నాటకం వేశారు. అందులో పంకజ్, రాజ్ కుమార్ అనే ఖైదీలు వానరుల వేషం వేశారు. నాటకంలో భాగంగా వారు సీతను వెతుకుతూ వెళ్లి పోలీసులు, తోటి ఖైదీలు చూస్తుండగానే నిచ్చెన వేసుకుని 22అడుగుల గోడ దూకి పారిపోయారు. పోలీసులు వెంటనే వారి కోసం గాలింపు చేపట్టారు. పంకజ్ ఓ హత్య కేసులో జీవిత ఖైదు, రాజ్ కుమార్ ఓ కిడ్నాప్ కేసులో శిక్ష అనుభవిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. జైలర్ ప్యారేలాల్ సహా ఆరుగురు జైలు అధికారులను సస్పెండ్ చేశారు. పంకజ్, రాజ్‌కుమార్‌తో పాటు చోటు అనే మరో ఖైదీ పారిపోయేందుకు ప్రయత్నించాడని, కాని నిచ్చెన కూలిపోవడంతో అతని ప్రయత్నం విఫలమైందని అధికారులు తెలిపారు. ఈ ముగ్గురు పారిపోయేందుకు వారంక్రితమే ప్రణాళికలు వేసుకోవడం విశేషం.

జామ్‌నగర్ రాజకుటుంబ వారసుడిగా అజయ్ జడేజా

జామ్‌నగర్, అక్టోబరు 13: గుజరాత్‌లోని జామ్‌నగర్ రాజ కుటుంబానికి తదుపరి వారసుడిగా భారత మాజీ క్రికెటర్ అజయ్ జడేజా(53)ను శనివారం ప్రకటించారు. దీనిపై ప్రస్తుత మహారాజ జాం సాహెబ్ శత్రుసల్యసింహ్‌జీ దిగ్విజయ్ సింహ్‌జీ జడేజా అధికారిక ప్రకటన చేశారు. "రాజ కుటుంబానికి వారసుడిగా అంగీకరించిన అజయ్ జడేజాకు కృతజ్ఞతలు. జామ్‌నగర్ తదుపరి జాం సాహెబ్‌గా బాధ్యతను అజయ్ జడేజా చేపట్టడం ఇక్కడి ప్రజలకు ఒక వరం" అని శత్రుసల్యసింహ్‌జీ పేర్కొన్నారు. ఇక అజయ్ జడేజా 1992 నుంచి 2000 వరకు క్రికెట్‌లో తనదైన ముద్ర వేశారు. ఆయన భారత్ తరఫున 15 టెస్ట్ మ్యాచ్‌లు, 196 వన్డేలు ఆడారు. కాగా క్రికెట్‌లో రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లకు జడేజా కుటుంబసభ్యులైన కేఎస్ రంజిత్‌సింహ్‌జీ, కేఎస్ దులీప్‌సింహ్‌జీ పేర్లు పెట్టారు.

మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య

ముంబైలో కాల్చి చంపిన ముగ్గురు వ్యక్తులు.. కుమారుడి కార్యాలయం వద్ద ఉండగా ఘటన

» తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్





బాబా సిద్దిఖీ(ఫైల్), ఆదివారం సిద్దిఖీ ఇంటివద్ద సల్మాన్ ఖాన్

ముంబై, అక్టోబరు 13: మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్)కి చెందిన నాయకుడు బాబా సిద్దిఖీ హత్యకు గురయ్యారు. ముంబైలో ఆయనను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపారు. బాబా శనివారం రాత్రి బాంద్రాలోని తన కుమారుడు, వాంద్రే ఎమ్మెల్యే అయిన జీషన్ సిద్దిఖీ కార్యాలయం వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల అనంతరం ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాబా సిద్దిఖీ (66) మంత్రిగా పనిచేశారు. గత రెండు ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఈ సంవత్సరం ఎన్సీపీలో చేరారు. ముంబైలో ముస్లిం నాయకుడిగా బాగా పలుకుబడి కలిగిన సిద్దిఖీ.. బాలీవుడ్ స్టార్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితులు. ఓ దశలో తీవ్ర విభేదాలతో కనీసం పలకరింపులు లేని సల్మాన్-షారూక్ ఖాన్ మధ్య సయోధ్య కుదిర్చింది సిద్దిఖీనే. సంజయ్ దత్ సహా పలువురు నటీ నటులతోనూ ఆయకు దగ్గరి సంబంధాలున్నాయి. ఈయన ఇచ్చే భారీ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్ నటులు పెద్దఎత్తున తరలివచ్చేవారు. కాగా, సిద్దిఖీపై కాల్పులకు పాల్పడిన ముగ్గురిలో ఇద్దరిని పట్టుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో గుర్మైల్(23) హరియాణాకు చెందినవాడు. మిగతా ఇద్దరు యూపీ వాసులైన ధర్మరాజ్(19), శివకుమార్. శివకుమార్ పరారీలో ఉన్నాడు. హత్యకు కుట్రదారులుగా, నిందితులకు సాయపడినవారిగా భావిస్తున్నవారిలో ప్రవీణ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అక్తర్ కోసం గాలిస్తున్నారు. అయితే, ధర్మరాజ్ వయసు ఆధార్ ప్రకారం 21గా ఉన్నప్పటికీ.. అతడు మైనర్ (17)నని పేర్కొనడంతో వయసు నిర్ధారణ పరీక్షలకు కోర్టు ఆదేశించింది. మరోవైపు సిద్దిఖీ హత్యకు కొన్ని నెలలుగా నిందితులు ప్రణాళికలు రచించారని, ముంబై, పుణెలలో నివాసం ఉన్నారని, సిద్దిఖీ ఇల్లు, కార్యాలయంపై నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హత్యకుగాను రూ.50 వేల అడ్వాన్స్ తీసుకున్నారని, ఆయుధాలను బిష్ణోయ్ గ్యాంగ్ సరఫరా చేసిందని పేర్కొన్నారు. సిద్దిఖీ హత్య తమ పనే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు గ్యాంగ్ సభ్యుడొకరు ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడు. సల్మాన్‌తో పాటు దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్నందుకే అతడిని హతమార్చినట్లు పేర్కొంది. సిద్దిఖీ హత్యతో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు. సల్మాన్ ఆదివారం సాయంత్రం సిద్దిఖీ ఇంటికెళ్లి భౌతిక ఖాయానికి నివాళి అర్పించారు. ఆ సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శనివారం సల్మాన్ బిగ్ బాస్ షూటింగ్ రద్దుచేసుకుని ఆస్పత్రిలో సిద్దిఖీ మృతదేహాన్ని సందర్శించారు.

20 ఏళ్లకే రాజకీయాల్లోకి

సిద్దిఖీ 1977లో రాజకీయాల్లోకి వచ్చారు. అసలు పేరు జియాఉద్దీనన్ సిద్దిఖీ. 1999 నుంచి వరుసగా మూడుసార్లు బాంద్రా వెస్ట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరంలో కార్మిక, పౌర సరఫరాలు తదితర శాఖల మంత్రిగా నియమితులయ్యారు. ఈ సమయంలోనే ముంబైలోని ఓ మురికివాడ పునరావాస ప్రాజెక్టు ఇళ్ల కేటాయింపు రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగినట్లు 2014లో సిద్దిఖీపై ఈడీ కేసు నమోదైంది. కాగా, వచ్చే నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా సిద్దిఖీ హత్య సంచలనంగా మారింది. సిద్దిఖీ హత్యను ఖర్గే, రాహుల్ గాంధీ ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని శరద్ పవార్ ఆరోపించగా ఘటనను రాజకీయం చేయొద్దని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబ కన్నుమూత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబ(56) అనారోగ్యంతో కన్నుమూశారు. వారం రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి చనిపోయారు. జైలులో ఉన్నప్పటి నుంచే అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమైన సాయిబాబ.. విడుదలైన తర్వాత ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కొంతకాలం చికిత్స పొందారు. అనంతరం కొద్ది రోజులుగా నిమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. ఆయనకు గత నెలలో శస్త్ర చికిత్స ద్వారా పిత్తాశయం తొలగించారు. ఆపరేషన్ తర్వాత అంతర్గత రక్తస్రావం కావడంతో సాయిబాబ ఇన్ఫెక్షన్ బారినపడ్డారు. దానికి చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో శనివారం రాత్రి 8.45 గంటలకు నిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. సోమవారం ఉదయం 8 గంటలకు గన్‌పార్క్ వద్ద ప్రజల సందర్శనార్థం సాయిబాబ మృతదేహాన్ని ఉంచుతామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మౌలాలి జవహర్‌నగర్‌లోని సాయిబాబ సోదరుడి ఇంటికి మృతదేహాన్ని తీసుకెళతామని వెల్లడించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ర్యాలీగా బయలుదేరి గాంధీ మెడికల్ కళాశాలకు చేరుకుని సాయిబాబ మృతదేహాన్ని అప్పగిస్తామని పేర్కొన్నారు. సాయిబాబ కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

వైకల్యాన్ని జయించిన మేధావి..

ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో గాంధీనగర్‌లోని పేద రైతు కుటుంబంలో 1967 జూలై 24న సాయిబాబ జన్మించారు. ఐదేళ్ల వయసులోనే పోలియోతో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. చదువులో చురుకుగా ఉండే సాయిబాబ డిగ్రీలో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బంగారు పతకాన్ని అందుకున్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో పీజీ, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ వర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. ఆ సమయంలోనే సికింద్రాబాద్‌లోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీలో ఆంగ్ల అధ్యాపకుడిగా రెండేళ్లు పనిచేశారు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీ, రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఆంగ్ల పాఠాలు బోధిస్తూనే, పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాలేజీ చదువుల సమయంలోనే ఆయన కుటుంబమంతా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మలిదశ తెలంగాణ పోరాటానికి నాంది పలికిన ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం(ఏఐపీఆర్ఎఫ్) ఆధ్వర్యంలోని వరంగల్ సభ నిర్వహణలో సాయిబాబ కీలక పాత్ర పోషించారు. సల్వాజుడుం దగ్గరి నుంచి ఆపరేషన్ గ్రీన్ హంట్ వరకు.. ఆదివాసీ, గిరిజనులకు వ్యతిరేకంగా సాగుతున్న విధానాలమీద ఫోరం ఎగెనెస్ట్ వార్ ఆన్ పీపుల్ వేదిక ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమించారు. సాయిబాబ మృతి పట్ల పౌర హక్కుల నేతలు, సామాజిక వేత్తలు విచారం వ్యక్తం చేశారు. బల్ల రవీంద్రనాథ్, ప్రొఫెసర్ హరగోపాల్, జి.లక్ష్మణ్, ఎం. రాఘవాచారి, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు సాయిబాబ మృతి పట్ల సంతాపం తెలిపారు. సాయిబాబ మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు.



పదేళ్లు అన్యాయంగా జైలు శిక్ష..

ఢిల్లీ యూనివర్సిటీ, రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో 2014 మే9న మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణతో సాయిబాబను అరెస్టు చేశారు. 2017 మార్చిలో గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించడంతో నాగ్‌పూర్ జైలులో ఉన్నారు. 90 శాతం వైకల్యం ఉన్న ఆయన కఠినమైన అండా సెల్‌లో పదేళ్లపాటు శిక్ష అనుభవించారు. ఆ సమయంలో ఆయన తల్లి చనిపోయినా.. కడచూపునకూ నోచుకోలేదు. ఈ ఏడాది మార్చి 5న ముంబై హైకోర్టు నిర్దోషిగా తేల్చడంతో సాయిబాబ విడుదలయ్యారు. జైలులోనూ ఆయన ఖైదీల హక్కుల కోసం అనేక పోరాటాలు, నిరాహార దీక్షలు చేశారు.


మధుసూదనాచారిని అభినందిస్తున్న హరీశ్‌రావు

మండలి ప్రతిపక్ష నేతగా
మధుసూదనాచారి బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ప్రతిపక్ష నేతగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం మండలి ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో చేపట్టిన ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు హాజరై మధుసూదనాచారిని అభినందించారు. అదే విధంగా శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్ రావు తదితరులు ఆయన్ను సత్కరించి అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రులు, జగదీశ్ రెడ్డి, తలసాని, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

సర్కారు వైఫల్యంవల్లే కలుషితనీటి మరణాలు

- ఈడీ నుంచి కాంగ్రెస్ నేతలను రక్షిస్తున్న పెద్దన్న ఎవరు?: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు వైఫల్యం కారణంగానే సంగారెడ్డి జిల్లా సంజీవన్‌రావుపేటలో కలుషితనీటి మరణాలు చోటుచేసుకున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మరణించినవారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగినసాయం అందించాలని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా కోరారు. రాష్ట్రంలో మరెక్కడా ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో మిషన్ భగీరథ ప్రాజెక్టుద్వారా తాగునీటిని అందించిందని, రేవంత్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కూడా సరిగ్గా నిర్వహించలేకపోతోందని ఆయన విమర్శించారు. మరోవైపు.. ఢిల్లీలో కొట్లాడుతున్నట్లు నాటకమాడుతూ తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ బంధం అంటకాగుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇక్కడి కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నా.. బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. ఒక సంపన్న తెలంగాణ కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంపై జరిగిన దాడి గురించి ప్రస్తావిస్తూ.. రూ.వందలకోట్ల నగదు దొరికినట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. రెండు వారాలు పూర్తయిన తర్వాత కూడా ఇప్పటిదాకా ఈ సంఘటన తాలూకు ఒక్క మాట బయటకి రాలేదన్నారు.

తుంగభద్రకు భారీ వరద

బళ్లారి సిటీ, అక్టోబరు 13: కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర నదికి వరద పెరిగింది. హొస్పేట్ సమీపంలోని తుంగభద్ర జలాశయా (టీబీ డ్యాం)నికి 84,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం నిండుగా ఉండడంతో 82,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో దాదాపు 11వేల క్యూసెక్కులు కాలువలకు, 20 క్రస్ట్ గేట్ల ద్వారా 71 వేల క్యూసెక్కులు నది దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు శనివారం తొలుత 18 గేట్లను, తర్వాత మరో రెండు గేట్లను తెరిచారు. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జలాశయం నుంచి నదికి దిగువకు వదలడం ఇది మూడోసారి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,632 అడుగులు కాగా.. ప్రస్తుతం 1631.97 అడుగుల మేర నీరు ఉంది.

పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్ విప్ ఎలా?

(మొదటిపేజీ తరువాయి)


మధుసూదనాచారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. మండలి ఛైర్మన్ వద్ద మహేందర్‌రెడ్డిపై అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉందని, ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా దాని మీద నిర్ణయం తీసుకోవాలని, ఇలాంటి సమయంలో అధికారపార్టీ చీఫ్‌విప్‌గా అదే కౌన్సిల్ ఛైర్మన్ బులిటెన్ ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. దాన్ని పరిష్కరించకపోగా.. ఇప్పుడు మండలి చీఫ్‌విప్‌గా ఆయన్ను నియమిస్తూ ఛైర్మన్ ఇచ్చిన బులెటిన్ అనర్హత పిటిషన్‌కు మరింత బలం చేకూర్చిందని, దీన్నికూడా అనర్హత పిటిషన్‌లో సాక్ష్యంగా చేరుస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాజ్యాంగం ఎలా ఖూనీ జరుగుతుందనే దానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీని కాంగ్రెస్‌లో చేర్చుకొని చీఫ్ విప్ పదవి ఇవ్వడంపట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. బిల్ పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చూడాల్సిన బాధ్యత చీఫ్ విప్‌దని, అలాంటప్పుడు ఆయన ఎవరికి విప్ జారీచేస్తారు? అధికార పార్టీ సభ్యులకా? ప్రతిపక్ష పార్టీ సభ్యులకా? అని నిలదీశారు. పట్నం మహేందర్‌రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి అనేది కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పీఏసీ ఛైర్మన్ పదవి విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించిందని విమర్శించారు. మహేందర్‌రెడ్డిని చీఫ్ విప్‌గా నియమించడంపై రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీవోపీటీకి కూడా ఫిర్యాదు చేస్తూ లేఖ రాస్తామని వెల్లడించారు.

గవర్నర్, సీఎస్‌కు, పీఓటీకి లేఖ రాస్తాం

పాతతేదితో.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీని చీఫ్‌విప్‌గా నియమించినట్లు తాజాగా బులెటిన్ విడుదల చేసి.. అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారని.. హరీశ్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి మార్చి15న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పట్నం మహేందర్‌రెడ్డిని చీఫ్ విప్‌గా నియమించారు. అలాంటప్పుడు.. 2024 ఆగస్టు13న జారీ చేసిన జీవోఆర్‌టీ నంబరు 1075 ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన్ను ఎమ్మెల్సీగానే పరిగణించారు. చీఫ్‌విప్‌గా గుర్తించలేదని తెలిపారు. అదేవిధంగా 2024 సెప్టెంబరు 17న జీవోఆర్‌టీ నంబరు 1213 ద్వారా పట్నం మహేందర్‌రెడ్డిని ప్రజాపాలన దినోత్సవంలోనూ కేవలం ఎమ్మెల్సీగా మాత్రమే పేర్కొన్నారని, చీఫ్ విప్‌గా జీవోలో ఎందుకు సూచించలేదని ప్రశ్నించారు.

హరీశ్‌రావు ప్రతిదాన్ని రాజకీయం చేస్తున్నారు: దుద్దిళ్ల

ప్రతిపక్ష స్థానంలో ఉన్న మాజీమంత్రి హరీశ్ రావుకు ప్రతిదాన్ని రాజకీయం చేయడం అలవాటుగా మారిందని రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి చీఫ్‌విప్ పదవి ఇవ్వడంపై హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అన్ని వ్యవస్థలను ఆయన రాజకీయాల్లోకి లాగుతున్నారన్నారని విమర్శించారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్నపుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో ఎలా చేర్చుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో.. హరీశ్ రావుకు రాజ్యాంగం గుర్తుకు రాలేదా? పీఏసీ ఛైర్మన్ పదవిని సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికే ఇచ్చామని చెప్పారు. ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశం కోర్టుపరిధిలో ఉందని.. న్యాయస్థానాది తుది నిర్ణయమన్నారు.

సోలార్ కరెంటులో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తాం

పీఎం ఎస్‌జీఎంబీవైతో ఇంటింటికీ సౌర శక్తి.. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

- కుల గణన పేరుతో రాష్ట్ర సర్కారు కాలయాపన
- స్థానిక ఎన్నికలను ఆలస్యం చేసేందుకే: సంజయ్


సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కిషన్ రెడ్డి, ఈటల

మన్సూరాబాద్/హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా ప్రతి ఇంటికీ సౌరశక్తిని అందించి భారతదేశం ప్రపంచానికే ఆదర్శం(గ్లోబల్ లీడర్)గా నిలవనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ బండ్లగూడలోని జీఎస్‌ఐటీఐ(జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లో నూతనంగా ఏర్పాటు చేసిన 150 కిలోవాట్ల రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి శనివారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పునరుత్పాదన శక్తి వనరులను ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జీఎస్‌ఐ నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. సంస్థలో ఏర్పాటు చేసిన ఈ సోలార్ పవర్ ప్లాంట్ 75 శాతం మేర కరెంటు అవసరాలను తీర్చి ఏటా 30 లక్షలు ఆదా చేస్తుందని చెప్పారు. దేశ పురోగతిలో పునరుత్పాదక ఇంధనం ప్రాముఖ్యాన్ని ఎంపీ ఈటల రాజేందర్ వివరించారు. అనంతరం ప్లాంట్ ప్రారంభోత్సవ జ్ఞాపకార్థంగా జీఎస్‌ఐటీఐ ప్రాంగణంలో మొక్కను నాటారు.

సమగ్ర కుటుంబ సర్వే ఏమైంది..?: సంజయ్

కుల గణన సర్వే అన్నది కాంగ్రెస్‌కు కాలయాపన వ్యవహారంగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను జాప్యం చేసేందుకే ఈ నాటకాలని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ విషయంలో ప్రజలు కాంగ్రెస్ పట్ల ఆగ్రహంతో ఉన్నారని, ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతోనే కుల గణన పేరుతో కాలయాపన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఆదివారం సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో కులం సహా అన్ని వివరాలు సేకరించినా, ఆ నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్‌ఎస్‌తో చీకటి ఒప్పందంలో భాగంగానే ఆ నివేదికను బయటపెట్టడం లేదా..? అని ప్రశ్నించారు. "అసలు ఆ సర్వేతో ఒనగూరిన ప్రయోజనం ఏంటి..? ఆ నివేదిక ఉండగా మళ్లీ కుల గణన సర్వే పేరుతో రూ.150 కోట్లు కేటాయించి 60 రోజుల గడువు పెట్టడమెందుకు..? సమగ్ర కుటుంబ సర్వే నివేదిక నాటికి, నేటికి తెలంగాణ ప్రజల కులం ఏమైనా మారిందా..? కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే కుల గణన అబద్ధమనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సమగ్ర కుటుంబ సర్వే నివేదికను బయటపెట్టాలి" అని సంజయ్ డిమాండ్ చేశారు.

అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్

- శ్రీసత్యసాయి జిల్లాలో దారుణం
- బాధితులు వలస కార్మికులు
- పోలీసుల అదుపులో ఐదుగురు?

అమరావతి(ఆంధ్రజ్యోతి), హిందూపురం/చిలమత్తూరు, అక్టోబరు 13: పొట్టకూటి కోసం వచ్చిన వలస కూలీలపై మానవ మృగాలు విరుచుకుపడ్డాయి. నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేస్తున్న వాచ్‌మన్ కుటుంబానికి చెందిన అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టాయి. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో శుక్రవారం జరిగిందీ దారుణం. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వ్యక్తి ఐదు నెలల క్రితం చిలమత్తూరు మండలంలో పొలాల వద్ద నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లులో వాచ్‌మన్‌గా చేరాడు. ఆ పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఆయనతోపాటు భార్య, కుమారుడు, కోడలు నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో 3 ద్విచక్రవాహనాలపై ఆరుగురు దుండగులు నిర్మాణంలో ఉన్న ఆ భవనం వద్దకు వచ్చి వాచ్‌మన్‌ను తాగడానికి నీరు అడిగారు. తొట్టిలో ఉన్నాయని చెప్పడంతో వాచ్‌మన్ కుటుంబం నివసిస్తున్న రేకుల షెడ్డువైపు దుండగులు వెళ్లారు. ఆ అలికిడికి వాచ్‌మెన్ భార్య, కుమారుడు, కోడలు బయటికి వచ్చారు. దుండగులు ఆ మహిళలపై అఘాయిత్యానికి ప్రయత్నించగా వాచ్‌మన్, అతని కుమారుడు ప్రతిఘటించారు. దుండగులు అక్కడే ఉన్న కత్తిని తీసుకుని బెదిరించడంతో తండ్రీకొడుకు నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. దుండగులు ఆ ఇద్దరినీ బయటికి గెంటేసి, అత్తాకోడలిని వేర్వేరు రేకుల షెడ్లలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. గంటన్నర తరువాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. వాచ్‌మన్ కుమారుడు సమీపంలోని మరో గ్రామానికి వెళ్లి ఆ గ్రామస్థుల ఫోన్ ద్వారా పరిశ్రమ యజమానికి జరిగిన ఘోరం గురించి చెప్పగా, ఆయన పోలీసులకు తెలియజేశారు. జిల్లా ఎస్పీ రత్న ఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. కాగా శనివారం సాయంత్రానికే నిందితుల్లో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.నిందితుల్లో ముగ్గురు పాత నేరస్థులు, వారిలో ఒకరు అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు సమాచారం. వీరు చోరీ చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో ఒప్పుకొన్నట్టు తెలిసింది. ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఏపీ సీఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వివిధ

వేదగిరి రాంబాబు పురస్కారాలు

వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం, 'మా కథలు 2023' పుస్తకావిష్కరణ సభ అక్టోబర్ 14 ఉ.10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. పురస్కార గ్రహీతలు కెఎస్వీ రమణమ్మ (బాలసాహిత్య పురస్కారం), హుమాయూన్ సంఘీర్ (కథానికా పురస్కారం). 'మా కథలు 2023'ను కె.వి. రమణాచారి ఆవిష్కరిస్తారు. సభలో విహారి, బి.ఎస్. రాములు, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9849061668.

సింహప్రసాద్ సాహిత్యసమితి

సుమనశ్రీ సాహితీ సమాలోచన

కవి సుమనశ్రీ (చెల్లపిళ్ల కామేశ్వరరావు) సాహితీ సమాలోచన అక్టోబర్ 15 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సుమనశ్రీ సాహిత్య జీవన వ్యక్తిత్వం గురించి మిత్రులు పాఠకులు ఆలోచనలను, జ్ఞాపకాలను కలబోసుకుంటారు. మిత్రులందరికీ ఆహ్వానం.

సుమనశ్రీ మిత్రులు

కథల ముచ్చట్లు

తెలంగాణ రచయితల వేదిక (తె.ర.వే.) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 17 సాయంత్రం '138వ ఎన్నీల ముచ్చట్లు' సాహిత్య కార్యక్రమంలో భాగంగా ఈ విడత 'కథల ముచ్చట్లు' కార్యక్రమం జరుగుతుంది. సింగిల్ పేజీ చిన్న కథలతో హాజరు కావాలని రచయితలకు పిలుపు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ ఆతిథ్యంలో ఈ 'కథల ముచ్చట్లు' జరుగుతాయి. గాజోజు నాగభూషణం, బి.వి.ఎన్. స్వామి, పుల్లూరి జగదీశ్వరరావు కథలను సమీక్షిస్తారు.

సి. వి. కుమార్

రెండు అనువాదాలు

గీతాహరిహరన్ రచనకు ఓల్గా అనువాదం 'పోటెత్తిన కెరటాన్ని', ఆకార్ పటేల్ రచనకు ఎన్. వేణుగోపాల్ అనువాదం 'నియంత అంతం' ఈ రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ మలుపు బుక్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 19 సా.6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ పుస్తకాల్ని ఆకార్ పటేల్, గీతా హరిహరన్‌లు ఆవిష్కరిస్తారు. సభాధ్యక్షత ఎ.కె. ప్రభాకర్, వక్తలు కె. శ్రీనివాస్, కె.ఎన్. మల్లీశ్వరి; నిర్వహణ మలుపు బాల్‌రెడ్డి.

మలుపు బుక్స్

సుద్దాల పురస్కారం

సుద్దాల ఫౌండేషన్ ప్రకటించిన 'సుద్దాల హనుమంతు – జానకమ్మ' జాతీయ పురస్కారాన్ని అరుణోదయ నాగన్న స్వీకరిస్తారు. పురస్కార ప్రదానోత్సవం అక్టోబర్ 19 సా.6గంటలకు సుందరయ్య కళానిలయం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి జస్టిస్ నగేష్ భీమపాక; విశిష్ట అతిథులు పిల్లల మర్రి రాములు, సూర్య ధనుంజయ్; సభాధ్యక్షులు సుద్దాల సుధాకర్ తేజ; స్మారకోపన్యాసం పోరెడ్డి రంగన్న; ఆత్మీయ అతిథి యోచన; స్వాగతం సుద్దాల ప్రభాకర్, వందన సమర్పణ చి. ఉన్నత్.

సుద్దాల అశోక్ తేజ

'వంశవృక్షం' నవలపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 117వ సమావేశం అక్టోబర్ 20 ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా, రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. రౌతు గణపతి రావునాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో 'వంశవృక్షం నవల – పరిశీలన' అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ముఖ్యప్రసంగం చేస్తారు. వివరాలకు: 98857 58123.

గార రంగనాథం

కళింగాంధ్ర కవితలు

కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన కవులు రాసి ఇప్పటికే అచ్చైన దళిత, మత్స్యకార కవితలతో విడివిడి సంకలనాలను 'చంపావతి ప్రచురణలు'గా నా సంపాదకత్వంలో తీసుకు వస్తున్నాను. మీ వద్ద ఉన్న పై విభాగాలకు చెందిన కవితలను, వాటి అచ్చైన వివరాలను champaavathi@gmail.comకు ఈమెయిల్ చేయాల్సిందిగా కోరుతున్నాను. ఫోన్: 96764 93680.

బాలసుధాకర్

మొదటి నవలలకు ఆహ్వానం

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్, వరంగల్ నవలాకారుల మొదటి నవలలను ఆహ్వానిస్తున్నది. మొదటి, రెండవ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు. నవల నిడివి ప్రింట్‌లో 100 పేజీలకు తగ్గకుండా, 250పేజీలకు మించకుండా ఉండాలి. 2023 – 2024 మధ్య నవలా రచన జరిగి, పత్రికలలో ప్రచురితం కాని నవలనే, డిటిపి చేయించి మాత్రమే అక్టోబర్ 31 తేదీ లోగా పంపాలి. చిరునామా: డి. స్వప్న, 2-7-71, ఎక్సయిజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్ – 506001. ఫోన్: 99892 91299.

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్

కొత్త పాఠకులు ఏం చదువుతున్నారు...



తెలుగులో పుస్తకాలు చదవడం మొదలుపెట్టాలి అనుకొనేవాళ్ళకి కొన్ని పుస్తకాలు చెప్పమంటే, ఎక్కువమంది తమకి నచ్చిన పుస్తకాల గురించి చెప్పేవారు. 2021 హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆ పుస్తకాలను వెతికి కొన్నాను. కానీ చదవడానికి ఇబ్బంది పడ్డాను. క్లిష్టమైన భాషే కాకుండా, నాకు తెలియని ఎన్నో గొప్ప సిద్ధాంతాలతో ఉన్న పుస్తకాలు అవి. కానీ ఒక కొత్త పాఠకుడు సులువుగా అర్థమయ్యే పుస్తకాలను చదవడానికి ఇష్టపడతాడు. ఇలాంటి బిగినర్ ఫ్రెండ్లీ పుస్తకాల గురించి మాట్లాడంతోపాటు, సమకాలీన సాహిత్యాన్ని అందరికీ పరిచయం చెయ్యాలి అనే ఉద్దేశంతో మొదలు పెట్టిందే– 'The తెలుగు Collective' ఇన్‌స్టాగ్రామ్ పేజీ. ఈరోజుకు దాదాపు 25వేల మంది ఫాలోయర్స్ ఉన్నారు. ఎక్కువమంది 30ఏళ్ల లోపువారే. తెలుగు పుస్తకాలు ఈ మధ్యనే మొదలుపెట్టిన వాళ్ళ నుంచి ఎన్నో ఏళ్లుగా చదువుతున్న వాళ్ళ దాకా అందరూ ఉన్నారు. ఈ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా పుస్తక పరిచయాలు మాత్రమేగాక, 'మీట్ & గ్రీట్' పేరుతో బుక్ క్లబ్ కూడా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఒక పుస్తక రచయితను పాఠకులు కలుసుకొని ఆ పుస్తకంపై తమ అభిప్రాయాలు, సందేహాల గురించి చర్చించే అవకాశం ఉంటుంది. ఈ పేజీ నిర్వహణలో భాగంగా కొత్త పాఠకులు, వారి అభిరుచుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు దొరికింది. ఇప్పుడు 'వివిధ' పేజీ తరఫున 30ఏళ్ల లోపు పాఠకులు కొందరితో మాట్లాడాను. వారు చదివిన మొదటి పుస్తకం ఏమిటి? ఇష్టమైన రచయిత (రచయిత్రి) ఎవరు? ఎక్కువగా చదవడానికి ఇష్టపడే జానర్ ఏమిటి? పుస్తకాలు ఎక్కడ కొంటారు? లాంటి ప్రశ్నలను అడిగితే– వారి నుంచి వచ్చిన జవాబులు ఇవి.

■ ఆదిత్య అన్నావఝుల

instagram.com/telugu_collective/



భార్గవి బెజ్జం

నేను జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణిని మరోపక్క పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. బాల్యం నుంచే పుస్తక పఠనం చేస్తున్నాను. నేను చదివిన మొదటి నవల 'మానవి'. దీనిని ఓల్గా గారు రచించారు. వీరు నాకు ఇష్టమైన రచయితల్లో ముఖ్యులు. దళిత, స్త్రీవాద, సామాజిక స్పృహ కలిగిన పుస్తకాలు చదువుతాను. అన్ని రచనా ప్రక్రియలు చదువుతాను. వ్యాసాలు నన్ను ఎక్కువ ఆకట్టుకొంటాయి. మనం ఏ స్థితిలో ఉన్నా, పుస్తక పఠనం గుండె నిబ్బరాన్నీ స్థిత ప్రజ్ఞతను ఇస్తుందని నమ్ముతాను. పుస్తకాలను నేరుగా షాపుల్లో కొనడానికి ఇష్టపడతాను. పుస్తకం వెనక అట్ట మీద రచయిత లేదా ఇతరులు రాసిన విషయాన్ని బట్టి పుస్తకాన్ని ఎంచుకుంటాను.



పవన్

ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరాను. 'అమరావతి కథలు'తో తెలుగు పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. కవనమాలి రచనలు నన్ను ఎప్పుడూ అబ్బుర పరుస్తాయి. ఏదో తెలియని సంతృప్తిని ఇస్తాయి. ఒక పాఠకుడిగా నాకు అన్ని రచనలు చదవాలి అని ఉంటుంది. ఒకటి ఇష్టంగా పెట్టుకుని గోడ కట్టుకోవాలి అని లేదు. హైదరాబాద్‌లో ఉన్నపుడు బుక్‌షాప్‌లో కొనేవాడిని. ఇప్పుడు అమెజాన్‌లో కొంటున్నాను. పుస్తకం కవర్ పేజ్ చూసి, రచయిత ముందు రచనలని బట్టి, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే సజెషన్స్‌ను బట్టి పుస్తకాలు తీసుకుంటాను.



మాధవ్

ప్రస్తుతం సినిమాల్లో పని చేస్తున్నాను. నేను చదివిన మొదటి పుస్తకం గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'. పింగళి సూరన్న, కేశవరెడ్డి రచనలు అంటే చాలా ఇష్టం. చదివేటప్పుడు డ్రామా లేదా ఫాంటసీ ఉండే నవలలు చదవడానికి ఇష్టపడతాను. మొదట్లో ఆన్‌లైన్ లేదా స్నేహితుల సలహాలతో పుస్తకాలు కొనుక్కునే వాడ్ని. కానీ ఇప్పుడు పుస్తకం వెనుక అట్ట మీద కథ గురించి రాసింది చదివి కొంటున్నాను. హైదరాబాద్‌లో ఉంటే షాపులో కొనడానికి ఇష్టపడతాను. లేదంటే అమెజాన్, లోగిలి లాంటి వెబ్‌సైట్స్‌లో కొంటాను.



సాయి చరణ్

నేను ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిని. చిన్నప్పుడు చిట్టి వికటన్ అనే మాసపత్రికలో వచ్చే కథలను ఇష్టంగా చదివేవాడిని. నాకు నచ్చిన రచయిత కేశవరెడ్డి. సూటిగా, వ్యంగ్యంగా ఆయన వాస్తవాన్ని నిర్వచించే తీరు నచ్చుతుంది. చిన్నప్పటి చందమామ కథల ప్రభావం వల్ల పెద్ద పేరాలుగా ఉన్న నవలల కన్నా చిన్నచిన్న పేరాలతో ఉండే కథల్లాంటివి చదవడం ఇష్టం. అభ్యుదయ, భావ కవిత్వం సూటిగా ఉంటుంది కాబట్టి ఇష్టంగా చదువుతాను. సాధారణంగా నేను పుస్తకాలను షాపుల్లోనే కొంటాను. ఈమధ్య ఆడియో బుక్స్, ఆన్‌లైన్ కొనుగోలు అలవాటైంది. పుస్తకాలపై వచ్చే సమీక్షలను బట్టి, లేదా ఆ పుస్తకం ముందుమాట, కవర్ ఫోటోలు ఏమైనా కథపై ఆసక్తి కలిగిస్తే వాటిని బట్టి పుస్తకాన్ని కొంటాను.



ప్రసన్న ఓరుగంటి

ప్రస్తుతం అమెరికాలో అగ్రికల్చర్ మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. చిన్నప్పుడు అమ్మమ్మ ఇంట్లో ఉన్న 'తులసీదాసు జీవిత చరిత్ర' నేను చదివిన మొదటి పుస్తకం. అప్పటి రచయితలలో యద్దనపూడి సులోచనారాణి, యండమూరి, గొల్లపూడి మారుతీరావు, పి. శ్రీదేవి, రంగనాయకమ్మ నచ్చితే, ఇప్పటి రచయితలలో వి. మల్లికార్జున్, రవి మంత్రి రచనలు బాగా నచ్చాయి. నేటివిటీకి దగ్గరగా సాగే రచనలు ఎక్కువగా నచ్చుతాయి. ఆత్మపరిశీలనకి తోడ్పడే రచనలను చదవడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. విదేశాలలో ఉండడం వల్ల తెలుగు పుస్తకాలు దొరకటం ఇబ్బంది. ప్రస్తుతానికి ఈ కొరియర్ సర్వీసుల పుణ్యమా అని అక్కడ స్నేహితుల సాయంతో కావాల్సిన పుస్తకాలు అన్నీ ఒకేసారి ఇక్కడికి తెప్పించుకుంటున్నాను. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



చిత్కళ

నేను ఇప్పుడు ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ చేస్తున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. నాకు కేశవరెడ్డి, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు ఇష్టం. సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే రచనలు, మిస్టరీ నవలలు ఇష్టం. పుస్తకాలు బుక్ షాప్‌లో కొనడాన్ని ఇష్టపడతాను. పుస్తకం కథాసారాన్ని చదివి, లేదా ఒక్కోసారి పుస్తకం పేరును బట్టి కూడా పుస్తకాల్ని ఎంపిక చేసుకుంటాను.



విరూపాక్ష

నేను సాఫ్ట్‌వేర్ కంపెనీలో బిజినెస్ అనలిస్టుగా పనిచేస్తున్నాను. మొదటగా పరవస్తు చిన్నయ సూరి 'నీతి చంద్రిక' చదివాను. ప్రత్యేకంగా ఇష్టమైన రచయిత అని లేరు కానీ, ఓల్గా, కె.ఎన్.వై. పతంజలి, కొడవటిగంటి, రావిశాస్త్రి రచనలు అంటే మక్కువ ఎక్కువ. మాండలికంలో ఉన్న కథలు, నాన్ ఫిక్షన్ పుస్తకాలు చదవడానికి ఎక్కువ ఇష్టపడతాను. పుస్తకాలు సాధారణంగా బుక్‌షాప్‌లలో కొనడానికే ఇష్టపడతాను. మా నాన్నగారు, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండే స్నేహితుల సూచనలతో పుస్తకాలను కొనడానికి ఇష్టపడతాను.





రోహిత్ సత్య

ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగుపెట్టాను. చదివిన మొట్టమొదటి పుస్తకం 'బట్టి విక్రమార్క కథలు'. మనిషిని అర్థం చేయించే పుస్తకాలు ఎక్కువగా ఇష్టపడతాను. అందుకే కాశీభట్ల వేణుగోపాల్ గారు అంటే ఇష్టం. పుస్తకాలు ఎక్కువగా ఆన్‌లైన్‌లో కొనేవాడిని. ఇప్పుడు హైదరాబాద్‌లో బుక్ షాప్‌కు వెళ్లి కొంటున్నాను. స్నేహితుల సలహాలు, ఆన్‌లైన్‌లో వచ్చే సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



నిర్వాణ

ప్రస్తుతం సీఏగా పనిచేస్తున్నాను. మొదటి చదివిన పుస్తకం 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' అని గుర్తుంది. సూర్యదేవర రామ్మోహనరావు రచనలు చదవడానికి ఇష్టపడతాను. ఉత్కంఠభరితంగా సాగే నవలలు లేదా హాయిగా వెళ్లిపోయే షార్ట్ స్టోరీస్ ఎక్కువగా చదువుతాను. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే రికమెండేషన్స్‌తో దగ్గరలో ఉండే బుక్ షాపులో కొనుక్కుంటాను.



చరణ్ చిన్నన్నగారి

నేను ఇప్పుడు హెచ్‌సీయూలో ఎం.ఏ తెలుగు చదువుతున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం ఓల్గా రాసిన 'విముక్త'. రచయితల్లో ఒకరు ఇష్టం అని చెప్పలేను. ప్రస్తుతానికి ఓల్గా, కేశవరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు, శ్రీశ్రీ, తిలక్ వచన కవితలు బాగా ఇష్టం. మానవుల నిజమైన జనజీవనాన్ని, సంఘటల్ని కొత్త దృక్కోణంలో చిత్రించే నాటకాలు, వచన కవితలు, కథలు, నవలలు, బొమ్మల కథల పుస్తకాలు బాగా ఇష్టపడతాను. నేను పుస్తకాలు ఎక్కువగా బుక్ షాపుల్లో, ఇంకా బుక్ ఫెయిర్లో కొంటాను. స్నేహితుల సూచనలను బట్టి, కథాంశాలను బట్టి బట్టి పుస్తకాలు ఎంపిక చేసుకుంటాను.



రిషిత

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'తో చదవడం మొదలుపెట్టాను. 'కాలతీత వ్యక్తులు' రాసిన శ్రీదేవి గారు నాకు చాలా ఇష్టం. ఏదైనా ఆలోచింప చేసేది కానీ ఏదైనా కొత్త అంశం చెప్పే కథలు కానీ ఎక్కువగా చదువుతాను. పుస్తకాలను నవోదయా బుక్ షాప్‌లో గానీ లేదా అమెజాన్‌లో గానీ కొనుక్కుంటాను. రచయితలను ఇన్‌స్పైర్ చేసిన రచనలను ఎన్నుకొని చదువుతాను, లేదా సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



సాయి కీర్తన

సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాను. నేను కాలేజీలో ఉన్నప్పుడు 'మస్టర్డ్' అనే పుస్తకం చదివాను (సంపాదకులు: కడలి సత్యనారాయణ, అన్వేష్ చెట్టుపల్లి). ఈ జెనరేషన్ ఫేస్ చేస్తున్న అన్ని ఇష్యూస్ ఆ కథల్లో కనిపిస్తాయి. కొన్నిటికి రిలేట్ అయ్యాను. సీనియర్ రచయితలలో యద్దనపూడి సులోచనారాణి నా ఫెవరేట్. ప్రస్తుతం రాస్తున్న వాళ్లలో కడలి సత్యనారాయణ, మొహమ్మద్ గౌస్ రచనలు బాగా నచ్చాయి. నేను ఎక్కువగా లవ్ స్టోరీస్, థ్రిల్లర్స్ చదవడానికి ఇష్టపడతాను. పుస్తకాలను బుక్‌ఫెయిర్లో లేదా అమెజాన్‌లో కొంటాను. నచ్చిన జానా అయ్యుంటే తప్పకుండా తీసుకుంటాను. లేదంటే స్నేహితుల సూచనలతో తీసుకుంటాను.

మన అనువాదాలకు మార్కెట్ పెంచుకోవాలి

మూడు ప్రశ్నలు

'హర్షణీయం' టీమ్: గిరి, అనిల్, హర్ష

తెలుగు రచయితల పరిచయాలతో, సంభాషణలతో నాలుగేళ్ళ క్రితం మొదలైన 'హర్షణీయం' ఆడియో పాడ్‌కాస్ట్ చానెల్ క్రమంగా ప్రపంచవ్యాప్త అనువాదకులతోను, ప్రచురణకర్తలతోనూ సంభాషణలు నిర్వహిస్తూ పరిధిని విస్తరించుకున్నది. ప్రస్తుతం అరవై భాషల్లో నుంచి వచ్చిన పుస్తకాల గురించి డెబ్బై గంటలకు పైగా ఆడియో హర్షణీయంలో అందుబాటులో ఉంది (harshaneeyam.in). 'హర్షణీయం' పాడ్‌కాస్ట్ టీమ్‌తో (గిరి, అనిల్, హర్ష) ఈవారం 'మూడు ప్రశ్నలు'.

హర్షణీయం పాడ్‌కాస్ట్‌లో అనువాదాలకు (ముఖ్యంగా ప్రపంచ సాహిత్యంలో ఇప్పుడు వస్తున్న అనువాదాలకు) ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి, ఆ అనువాదకుల ఇంటర్వ్యూలు చేస్తున్నారు. అటువైపు దృష్టి పెట్టాలని ఎందుకు అనిపించింది?

రెండేళ్ళ క్రితం తమిళ రచయిత జయమోహన్ 'అరం' తమిళ కథలు, కన్నడ నవల 'తేజోతుంగభద్ర' వీటి ఆంగ్ల అనువాదాలు చదివాం. అదే సమయంలో కన్నడ రచయిత వసుధేంద్ర, 'ఛాయా' మోహన్ బాబు, కాలచ్చువడు పబ్లిషింగ్ కణ్ణన్ గార్లు అనువాదం గురించి మాట్లాడిన విషయాలు ఆసక్తిని రేకెత్తించాయి. రచన లాగే అనువాదం కూడా ఒక కళారూపం, సృజనాత్మక ప్రక్రియ అని తెలిసింది. అనువాద ప్రక్రియ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో ఇతర భాషల అనువాదకులతో, పబ్లిషర్లతో మా పాడ్‌కాస్ట్‌లో సంభాషణ మొదలు పెట్టాం. తమిళ – ఇంగ్లిష్ అనువాదకురాలు సుచిత్రా రామచంద్రన్‌తో మాట్లాడినప్పుడు ఒక పుస్తకం గురించి అనువాదకులకంటే విపులంగా వేరెవరూ మాట్లాడ లేరనే విషయం అర్థమైంది. వారితో జరుపుతున్న ప్రతి సంభాషణ ఒక గొప్ప సాహిత్యానుభవం.

ఈ పాడ్‌కాస్ట్‌లలో అనువాదం చుట్టూ ఇన్ని ఇంటర్వ్యూలు చేసిన తర్వాత ప్రస్తుత అనువాద సాహిత్య వాతారణం మీద మీ అవగాహనకు వచ్చిన కొత్త విషయాల గురించి చెప్పండి?



('హర్షణీయం' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఇతర భాషల అనువాదకులు కొందరి ఫోటోలు.)

ప్రపంచవ్యాప్తంగా అనువాదాలకు ఆదరణ, అనువాదకులకు గుర్తింపు పెరుగుతోంది. భారతీయ భాషల్నించి ఇంగ్లీష్ లోకి అనువాదాలు చాలా తక్కువగా వెడుతున్నాయి (మిగతా భాషలతో పోలిస్తే బెంగాలీ, తమిళ, హిందీ భాషల పరిస్థితి కొంత మటుకు మెరుగు). యూరప్, లాటిన్ అమెరికా, జపాన్, కొరియాల నుంచి సాహిత్యం విరివిగా ఇంగ్లీష్ లోకి అనువాదం అవుతోంది. BCLT (UK), ALTA (USA), SALT (Chicago university) లాంటి సంస్థలు, Words Without Borders, Asymptote లాంటి ఆన్‌లైన్ పత్రికలు ప్రపంచ వ్యాప్తంగా అనువాదాలపై అవగాహన పెంచడానికి విశేషంగా కృషి చేస్తున్నాయి. అనువాదాల్లో ముందుండే దేశాల్లో పిల్లల సాహిత్యం కూడా ఎక్కువగా అనువాదం అవుతోంది. అనువాదాలను తమ భాష నించీ వేరే భాషలకు తీసుకెళ్ళడంతో పాటూ వేరే భాషల సాహిత్యాన్ని తమ భాషలోకి తీసుకురావడం పైన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. 3.5 లక్షలమంది మాట్లాడే ఐస్లాండిక్ భాషకూ రెండు లక్షలమంది మాట్లాడే ఎస్పెరాంటో భాషకూ కూడా పదుల సంఖ్యలో సాహితీ అనువాదకులు వున్నారు. కొన్ని చోట్ల ప్రసిద్ధి కెక్కిన రచయితల పుస్తకాలు ఒకే సమయంలో ఏడెమినిది భాషల అనువాదకులు కలిసి అనువాదం చేస్తారు. బుకర్, పెన్ లాటి అనేక సంస్థలు ప్రతి ఏటా అనువాదాలకు పెద్దఎత్తున బహుమతులను ప్రకటిస్తున్నాయి. మన దేశంలో సాహితీ అనువాదాలకు జేసీబీ ఇచ్చే బహుమతి చెప్పుకోదగ్గది.

అనువాదాలు బాగా జరుగుతున్న అమెరికా, యూరప్‌లలో అనువాదాలకు సంబంధించి ఎలాంటి వాతావరణం వుంది?

వారు తమ భాషా సాహిత్యం ఇతర భాషల్లోకి అనువదింపబడటానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. ముఖ్యంగా ఇంగ్లీషులోకి వస్తే, ఎక్కువమంది పాఠకులకు చేరువ అవ్వటమే కాక, ఇతర భాషలైన ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, స్వీడిష్ లాంటి అనేక భాషల్లోకి పుస్తకం వెళ్ళే అవకాశం ఉంటుంది. ప్రసిద్ధ రచయితలందరూ, స్వీడిష్ భాషలో తమ రచనలు ఉండాలని ఆశిస్తారు. స్వీడిష్‌లో వచ్చే గొప్ప అనువాద రచనలకు నోబెల్ పురస్కారం వచ్చే అవకాశాలు మెరుగవుతాయి. ఫ్రెంచ్, నార్వే ప్రభుత్వాలు, తమ సాహిత్యాన్ని అనువదించి ప్రచురించే పబ్లిషర్లకు ప్రత్యేక రాయితీలు, గ్రాంటు ఇస్తాయి. మన దేశం నించి ఇలాంటి సహాయం తరచూ పొందేవారిలో కలకత్తాకు చెందిన సీగల్ పబ్లిషర్స్, నాగర్ కోయిల్‌కు చెందిన కాలచ్చువడు పబ్లిషర్స్ ముఖ్యమైనవి. (ఈ మధ్యనే తమిళనాడు ప్రభుత్వం కూడా ఇలాంటి రాయితీలు ఇవ్వడం మొదలెట్టింది.) ప్రతి ఏటా వచ్చిన అనువాదాల్లో నుంచి ఎంపిక చేసి బహుమతులు ఇచ్చే ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు అనేకానేకం వున్నాయి.

పబ్లిషర్లు ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, ఢిల్లీలలో జరిగే అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలలో తప్పక పాల్గొంటారు. పుస్తకాల హక్కుల కోసం పబ్లిషర్లు రైట్స్ కాటలాగ్ (ప్రచురణ హక్కుల రాయల్టీ తదితర వివరాలతో) తయారు చేసుకోవడం తప్పనిసరి. పబ్లిషర్లు అనువాదాల నాణ్యతపైన ప్రత్యేక శ్రద్ధ పెడతారు.

కొన్ని దేశాల్లో ప్రభుత్వ సంస్థలు అనువాదకులు పుస్తకం ఎంచుకున్న తర్వాత ఏ ఇబ్బంది లేకుండా పని చేసుకోడానికి వాతావరణం కల్పించి అన్ని ఖర్చులతో రెసిడెన్సీలను నిర్వహిస్తాయి. అనువాదకులు కూడా మూల రచన, రచయిత మీద ఎంతో గౌరవంతో అనువాదాలు చేస్తూ, సామర్థ్యాన్ని పెంచుకునేందుకు నిరంతరం కృషి చేస్తారు. సంఘాలుగా ఏర్పడి హక్కులను పరిరక్షించుకుంటారు. అంటే, కనీస వేతనాలకు డిమాండ్లు, అనువాదకుల ఎంపికలో జాతి వివక్ష ఉండకుండా చూడటం, అనువాదకులకు సరైన గుర్తింపు (ఉదాహరణకు పై పేజీలో వారి పేరు)... మొదలైనవి.

తెలుగు భాష నుంచి ఇంగ్లీష్ అనువాదాలకు వస్తే– మన పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉంది. వచ్చిన అతితక్కువ అనువాదాల్లోనూ పుస్తకాల ఎంపిక సరిగా లేకపోవటం, అనువాద నాణ్యత కొరవడటం, పుస్తక ముద్రణలో నాణ్యత లేకపోవటం, సరైన అనువాదకులు సరైన సంఖ్యలో లేకపోవడం, పబ్లిషర్లు అనువాదాలతో ఇంగ్లీష్‌లాంటి పెద్ద మార్కెట్‌కు చేరువయ్యే ప్రయత్నాలు చేయకపోవడం దీనికి ముఖ్య కారణాలు. ఇది జరగాలంటే మన సాహిత్యం ఇతర భాషా సాహిత్యాలకు తీసిపోదని గుర్తెరిగి ఉండటం, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి కావాల్సిన అన్ని వనరులను పెట్టుబడిగా పెట్టడం ముఖ్యం.

తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు అనువాద నాణ్యతను పెంచడానికి ఇప్పుడు రెండు చెప్పుకోదగ్గ ప్రయత్నాలు ఇక్కడ కూడా జరుగుతున్నాయి. మొదటిది– అక్టోబర్ నుంచి ప్రఖ్యాత ఫ్రెంచి అనువాదకురాలు రాస్ స్వాట్జ్ తదితరులు నిర్వహించబోయే ఆరు నెలల మెంటరింగ్ వర్క్‌షాప్. ఈ వర్క్‌షాప్ హైదరాబాద్‌కు చెందిన ఛాయా రిసోర్సెస్, అజు పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతోంది. రెండోది– అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్ (ALTA) తెలుగు – ఇంగ్లీష్ అనువాదకుల వర్క్‌షాప్. దీనిని తెలుగు కవి అఫ్సర్ నిర్వహిస్తారు.

harshaneeyam@gmail.com

అనువాద ప్రక్రియ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో ఇతర భాషల అనువాదకులతో, పబ్లిషర్లతో మా పాడ్‌కాస్ట్‌లో సంభాషణ మొదలు పెట్టాం. తమిళ – ఇంగ్లిష్ అనువాదకురాలు సుచిత్రా రామచంద్రన్‌తో మాట్లాడినప్పుడు ఒక పుస్తకం గురించి అనువాదకులకంటే విపులంగా వేరెవరూ మాట్లాడ లేరనే విషయం అర్థమైంది. వారితో జరుపుతున్న ప్రతి సంభాషణ ఒక గొప్ప సాహిత్యానుభవం.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7 కనిష్ఠం 23.3





అలయ్ బలయ్‌లో కళాకారుల నృత్యం

డోలును వాయిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో ఆయన కుమార్తె, కార్యక్రమ నిర్వాహకురాలు విజయలక్ష్మి

అట్టహాసంగా అలయ్ - బలయ్

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన 'అలయ్ - బలయ్' కార్యక్రమం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అట్టహాసంగా జరిగింది. దసరా పండుగ సందర్భంగా హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, ఆయన కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఐదు రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- హైదరాబాద్ సిటీ, అబిడ్స్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి) :

నేతల ఐక్యతా రాగం..

● అలయ్-బలయ్‌లో ఎవరేమన్నారంటే..

8



హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తున్న దుర్గామాత విగ్రహం





ఎన్టీఆర్ స్టేడియంలో సింధూర్ ఉత్సవంలో అమ్మవారికి సింధూరం పూస్తున్న భక్తురాలు

గంగమ్మ ఒడికి దుర్గమ్మ..

నవరాత్రుల్లో పూజలందుకున్న దుర్గమ్మ అమ్మవారి విగ్రహాలు సోమవారం హుస్సేన్‌సాగర్ తీరం వద్ద గంగమ్మ ఒడిలోకి చేరాయి. ఇందుకోసం పీవీ నర్సింహారావు మార్గంలోని పీపుల్స్ ప్లాజా వద్ద 7 క్రేన్లు, గార్డెన్ పాయింట్, హెర్బల్ పార్కు, సంజీవయ్య పార్కు సమీపంలోని బేబీ పాండ్ల వద్ద 2 క్రేన్ల చొప్పున, జలవిహార్ బేబీ పాండ్ వద్ద ఓ క్రేనును నిమజ్జనాలకోసం వినియోగిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారే సరికి 506 దుర్గామాత విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. బ్యాండు చప్పుళ్లకు, పాటలకు అనుగుణంగా భక్తులు నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య అమ్మవార్లను గంగమ్మ ఒడికి చేర్చారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లను చేశారు.

- ఖైరతాబాద్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి)

నాడు 175..
నేడు 70



ఎంఎంటీఎస్ సర్వీసుల్లో భారీ కోత

- ఉద్యోగులకు తప్పని వెతలు
- ప్రయాణికులకు దూరమవుతున్న చవక ప్రయాణం
- ఇష్టానుసార వేళలతో తప్పని పడిగాపులు

తక్కువ చార్జీతో ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశమున్న ఎంఎంటీఎస్ ప్రయాణికులకు దూరం అవుతోంది. నానాటికీ సర్వీసులు తగ్గిపోతున్నాయి. దీంతో ఉద్యోగులకు ప్రయాణ తిప్పలు తప్పడం లేదు.

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్(ఎంఎంటీఎస్) ప్రాజెక్టును ఓ వైపు విస్తరిస్తూనే, మరోవైపు ఆయా ప్రాజెక్టులను ప్రయాణికులకు దూరమయ్యేలా దక్షిణమధ్య రైల్వే వ్యవహరిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఎంఎంటీఎస్ రైళ్లు అతితక్కువ కాలంలోనే ప్రయాణికుల ఆదరణను చూరగొన్నాయి. తక్కువ చార్జీలతో, ఎక్కువ దూరం ప్రయాణించే వీలుండడమే ఇందుకు ప్రధాన కారణం. కరోనాకు ముందు రోజూ 175 సర్వీసులతో రెండున్నర లక్షలమందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన ఎంఎంటీఎస్ రైళ్లు.. కొన్నాళ్లుగా ప్రయాణికులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేస్తున్నాయి. సుమారు వంద సర్వీసులకు పైగా తగ్గి ప్రస్తుతం 70 వరకు నడుపుతూ సుమారు 50వేల మందికి ప్రయాణ సేవలను అందిస్తున్నాయి. పలురూట్లలో ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్యను సగానికి సగం తగ్గించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరోవైపు తిప్పుతున్న సర్వీసులను కూడా ఆలస్యంగా నడుపుతుండడంతో ప్రయాణికులు వారంతట వారే దూరమయ్యేందుకు దక్షిణమధ్యరైల్వే కారణమవుతోంది. ఇదిలా ఉంటే, ఐదేళ్ల కిందట ప్రారంభమైన మెట్రోరైల్.. సర్వీసుల(ఫ్రీక్వెన్సీ) పెంపుతో ప్రయాణికులకు చేరువ అవుతుంటే, చవకైన ప్రయాణానికి చిరునామాగా ఉన్న ఎంఎంటీఎస్ సర్వీసులను కుదిస్తూ రైల్వే అధికారులు వీటిని ప్రయాణికులకు దూరం చేస్తున్నారు.

గంటల కొద్దీ ఆలస్యంతో..

మెట్రోరైళ్లు సకాలంలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేరుస్తుండగా, ఎంఎంటీఎస్ రైళ్లు ఎప్పుడు వస్తాయో, ఎప్పటికి గమ్యానికి చేరుకుంటాయో తెలియక ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఫ్రీక్వెన్సీ తగ్గింపు, ప్రయాణంలో తీవ్రమైన జాప్యంతో కొందరు ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకుంటుండగా, మరికొందరు మెట్రోరైళ్లు, ఆటోలను ఆశ్రయిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఎంఎంటీఎస్ రూట్లలో ప్రధానమైన ఫలక్‌నుమా-లింగంపల్లి మార్గంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ప్రయాణికులకు ఎంఎంటీఎస్‌లు అందుబాటులో లేవు. దీంతో మధ్యాహ్నం షిఫ్ట్‌లకు వెళ్లాల్సిన ఉద్యోగులు, ఉదయం షిఫ్టు పూర్తయ్యాక ఇళ్లకు పోవాల్సిన వారు గంటల తరబడి స్టేషన్లలోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. సికింద్రాబాద్, చందానగర్..వంటి కొన్నిస్టేషన్లలో గంటల తరబడి ఎంఎంటీఎస్‌లను నిలిపివేస్తుండడం ప్రయాణికుల సహనానికి పరీక్ష పెట్టినట్లుగా తయారైంది. చందానగర్ నుంచి లింగంపల్లికి ఐదు నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉన్నా, 35 నిమిషాలు వెయిటింగ్ టైమ్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది.

రూ.5కే ఎంఎంటీఎస్ ఉంటే.. ప్రత్యామ్నాయాల వైపు ఎందుకు చూస్తాం

మెట్రోరైల్ కారణంగా ఎంఎంటీఎస్‌లకు ప్రయాణికుల ఆదరణ తగ్గిందంటూ రైల్వే అధికారులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రయాణికులు అంటున్నారు. రూ.5తో ఎంఎంటీఎస్‌లో చవకగా ప్రయాణం అందుబాట్లో ఉంటే, అదే దూరానికి మెట్రోరైల్‌లో రూ.50 వెచ్చించాల్సిన అవసరం తమకేంటని ప్రశ్నిస్తున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా ముఖ్యమైన స్టేషన్లలో ప్లాట్‌ఫారాలను పెంచాలని, ఎంఎంటీఎస్‌ల సంఖ్యను పెంచి సామాన్యులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సామాన్యులకు చవక ప్రయాణాన్ని దూరం చేయొద్దని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్‌లు

- జగద్గిరిగుట్టలో గొంతుకోసి ఒకరి హత్య
- హైదర్‌గూడలో మార్నింగ్‌వాక్‌కు వెళ్లొస్తున్న వ్యక్తిపై దాడి



నదీమ్‌పాషా (ఫైల్)


నగరంలో గంజాయి మూకలు రెచ్చిపోతున్నాయి. గంజాయి తాగిన మత్తులో దారుణాలకు పాల్పడుతున్నాయి. జగద్గిరిగుట్ట దీనబంధుకాలనీలో ఆదివారం తెల్లవారుజామున గంజాయి మత్తులో ఉన్న కొందరు ఓ యువకుడిని గొంతు కోసి, తలపై రాడ్డుతో కొట్టి దారుణంగా హత్యచేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్‌గూడ ఎర్రబోడ నలందనగర్‌లో మార్నింగ్‌వాక్‌కు వెళ్లొస్తున్న ఓ వ్యక్తిపై అకారణంగా దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.

జీడిమెట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దీనబంధుకాలనీలో నివాసముంటున్న మహ్మద్ అక్బర్‌పాషా, షాహిన్‌లకు కుమార్తె అయిషా, కుమారుడు మహ్మద్ నదీమ్‌పాషా(21) సంతానం. నదీమ్‌పాషా బ్యాండ్ కొడుతుంటాడు. అంతేకాక ఆకతాయిలతో

మిగతా 8వ పేజీలో..

భార్యతో చాటింగ్.. భర్త హత్య

- యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



మహ్మద్ సిద్దిక్

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పక్కింటాయన భార్యతో చాటింగ్ చేస్తూ ఈ క్రమంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఆ మహిళ భర్తను హత్య చేసి పరారైన యువకుడిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ ఎంఏ జావీద్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహ్మద్ సాజిద్ (37)భార్యతో కలిసి ఉండేవాడు. అతడి ఇంటి పక్కనే ఉండే మహ్మద్ సిద్దిక్ (22) సాజిద్ భార్యతో ఫోన్ చాటింగ్ చేసేవాడు. ఈ విషయం గుర్తించిన సాజిద్ వేరే ఇంటికి మారాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్యలో తరచూ గొడవలు జరిగేవి. ఈనెల మొదటి వారంలో సాజిద్ ఇదే విషయంలో భార్యతో గొడవ పెట్టుకున్నాడు. దాంతో సాజిద్ భార్య, ఆమె అన్న ఇంటికి వెళ్లిపోయింది. ఆమె అన్న ఇంటి ప్రాంతంలో సిద్దిక్ తరచూ తచ్చాడుతుండడం గమనించిన సాజిద్ మాట్లాడుదామని చెప్పి, ఈనెల 9న సాయంత్రం అతన్ని ఫలక్‌నుమా గుఫ్రిన్ మసీదు వద్ద ఉన్న తనభార్య అన్న ఇంటికి పిలిచాడు. మాట్లాడుతుండగా మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన సిద్దిక్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సాజిద్ కడుపులో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో సాజిద్ మృతి చెందాడు. బాధితుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఫలక్‌నుమా పోలీసులు నిందితుడు సిద్దిక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



పెద్దమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

సందడిగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలు

దసరా పండుగ నేపథ్యంలో రెండు రోజులుగా నగరంలోని పలు ఆలయాలతో పాటు పర్యాటకప్రాంతాలు సందడిగా మారాయి. పండుగ రోజున ఉదయం, సాయంత్రం వేళల్లో పలు ఆలయ ప్రాంగణాలన్నీ కిటకిటలాడాయి. పెద్దమ్మగుడి, జగన్నాథ టెంపుల్, బిర్లా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం, అష్టలక్ష్మీ టెంపుల్, ఉజ్జయినీ మహంకాళి టెంపుల్ ఇలా పలుప్రాంతాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో లుంబినీపార్కు, ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్కు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు జనాలతో సందడిగా మారాయి. బిర్లా టెంపుల్‌తో పాటు బిర్లా ఆడిటోరియాన్ని సందర్శించడానికి పెద్దఎత్తున సందర్శకులు వచ్చారు.

- హైదరాబాద్ సిటీ, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి)

కేబీఆర్ పార్కు వద్ద అతిపెద్ద అండర్‌పాస్

740 మీటర్ల మేర నిర్మాణం

- రోడ్ నంబర్-45 నుంచి రెండు వైపులా వెళ్లేలా ప్రతిపాదన
- యూసుఫ్‌గూడ వైపు రెండు లేన్లు
- ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వైపు మూడు లేన్లు
- జూబ్లీ చెక్‌పోస్ట్ వద్ద సెకండ్ లెవల్‌లో వంతెన
- కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ నుంచి రోడ్ నంబర్-36 వైపు ఆరు లేన్ల వంతెన

గ్రేటర్‌లో అతి పెద్ద అండర్‌పాస్ కేబీఆర్ పార్క్ వద్ద అందుబాటులోకి రానుంది. సిగ్నల్ చిక్కులు లేకుండా వాహనదారులు నిరాటంకంగా ప్రయాణించేలా బహుళ మార్గాలకు రూపకల్పన చేస్తున్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న పలు జంక్షన్లలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణం చేసేలా వీటిని రూపొందించారు.



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేబీఆర్ (కాసు బ్రహ్మానందరెడ్డి)పార్క్ చుట్టూరా సిగ్నల్ ఫ్రీ ప్రయాణాలు సాగేలా అండర్‌పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్నది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ -45 వైపు నుంచి కేబీఆర్ పార్కు ప్రధాన గేటు(ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్) వైపు 740 మీటర్ల మేర అతిపెద్ద భూగర్భ మార్గం నిర్మించనున్నారు. దీంతో ఐటీ కారిడార్, ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు జూబ్లీ చెక్‌పోస్ట్ కంటే ముందు ఉండే అండర్‌పాస్ నుంచి సిగ్నల్ చిక్కులు లేకుండా రాకపోకలు సాగించే వెసులుబాటు కలగనుంది. మూడు లేన్లుగా అండర్‌పాస్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. గతంలో నిర్మించిన అండర్‌పాస్‌లలో మెజార్టీ 200-300 మీటర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో కేబీఆర్ పార్కు వద్ద నిర్మించే అండర్‌పాస్ అతిపెద్దది కానుంది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్- సిటీ)లో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు అండర్‌పాస్‌లు నిర్మిస్తుండగా, మెజార్టీ 300 మీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉన్నాయి. ఇవి నగర ప్రయాణంలో వాహనదారులకు వినూత్న అనుభూతి కలిగిస్తాయని అధికారులు చెబుతున్నారు.

ప్రతి జంక్షన్ వద్ద వంతెన.. అండర్‌పాస్

సిగ్నల్ చిక్కులు లేకుండా జంక్షన్ల వారీగా బహుళ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. జూబ్లీ చెక్‌పోస్ట్ వద్ద మాత్రం రెండో లెవల్‌లో ఓ వంతెన ప్రతిపాదించారు.

● కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ చౌరస్తా వద్ద రూ.192 కోట్లతో రెండు అండర్‌పాస్‌లు, (ముగ్ద జంక్షన్‌తో కలిపి) ఓ వంతెన ప్రతిపాదించారు. యూసుఫ్‌గూడ వైపు నుంచి వచ్చే వాహనాలు మూడు లేన్ల వంతెన నుంచి జూబ్లీచెక్‌పోస్ట్ వైపు వెళ్లనున్నాయి. జూబ్లీచెక్‌పోస్ట్ నుంచి వచ్చే వాహనాలు ఫ్రీ లెఫ్ట్ ద్వారా యూసుఫ్‌గూడ వైపు, కేన్సర్ ఆస్పత్రి వైపు వెళ్లాల్సిన వాహనాలు అండర్‌పాస్ వినియోగించాల్సి ఉంటుంది.

● జూబ్లీచెక్‌పోస్ట్ వద్ద రెండు వంతెనలు, ఓ అండర్‌పాస్ నిర్మించనున్నారు. ఇందుకు రూ.229 కోట్లు అవసరమని అంచనా వేశారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ -36 (పెద్దమ్మ గుడి వైపు) మూడు లేన్ల చొప్పున రెండు వైపులా వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఆరు లేన్ల వంతెన అందుబాటులోకి రానుంది. రోడ్ నెంబర్-45 వైపు నుంచి కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు వెళ్లేందుకు మూడు లేన్ల అండర్‌పాస్, యూసుఫ్‌గూడ వైపు వాహనాల కోసం మరో అండర్‌పాస్ ప్రతిపాదించారు. యూసుఫ్‌గూడ వైపు నుంచి రోడ్ నంబర్-45 వైపు

మిగతా 8వ పేజీలో..

జీహెచ్‌ఎంసీ మేయర్‌పై కేసు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా పెద్దశబ్దంతో డీజే పెట్టిన ఆరోపణలతో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 10న బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లో కందాడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రాత్రి 11.40 గంటల సమయంలో పెద్దశబ్దంతో వేడుకలు నిర్వహిస్తుండడంతో పోలీసులు డీజేను ఆపేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న మేయర్ విజయలక్ష్మి, నిర్వాహకుడు విజయ్‌కుమార్, డీజే నిర్వాహకుడు మహ్మద్‌గౌస్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌తో ప్రొ.సాయిబాబాకు విడదీయరాని బంధం



మీట్ ది ప్రెస్‌లో పాల్గొన్న ప్రొఫెసర్ సాయిబాబా చిత్రంలో ప్రొ.హరగోపాల్, విరహత్‌అలీ (ఫైల్)

బర్కత్‌పుర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమకారుడు ప్రొ.సాయిబాబాకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌తో విడదీయరాని బంధం ఉంది. ఇక్కడ జరిగిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసన సభల్లో హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా జరిగిన అనేక సభల్లో ఆయన వీల్‌చైర్‌లోనే వచ్చి పాల్గొన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన తర్వాత టీయూడబ్ల్యూజే నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని మహారాష్ట్ర జైలులో కులాలకు ఇస్తున్న ప్రాధాన్యం, హక్కుల ఉల్లంఘన, అక్కడి పోలీసులు అనుసరించిన తీరును ఆయన ఎండగట్టారు.


ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేస్తున్న సబితారెడ్డి

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

పహాడిషరీఫ్ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జల్‌పల్లి మున్సిపాలిటీ సాదత్‌నగర్, తుర్ కాలనీకి చెందిన దివ్యాంగులకు ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదివారం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్‌పల్లిని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్, అజీమ్ ఖాన్, ఫైసల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేతలంతా ఒకటే..!

● దసరా ఉత్సవాల్లో ప్రధాన పార్టీ నేతల ముచ్చట్లు ● వికారాబాద్ జిల్లా తాండూరులో చర్చ


దసరా ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరులో శనివారం దసరా ఉత్సవాల్లో విమర్శలు మరిచి ముగ్గురు నేతలు నవ్వులతో సరదా ముచ్చట్లు పెట్టారు. వీరిని చూసిన ప్రజలు, నాయకులు పలు రకాలుగా స్పందించారు. ఈనెల 10వ తేదీన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై రాజకీయ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అనుచరులు రోహిత్‌రెడ్డిపై ప్రతివిమర్శలు చేశారు. విమర్శలు, ప్రతివిమర్శలు ఇంకా కొనసాగుతున్న తరుణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో పాత తాండూరు బోనమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు ముగ్గురు నేతలు హాజరయ్యారు. సరదాగా ముచ్చట్లు పెడుతూ నవ్వులతో కనిపించారు. ఈ చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కాగా, అది చూసిన తాండూరు నియోజకవర్గ ప్రజలు ఇప్పటికైనా కనువిప్పు చేసుకోవాలని, నేతలు ఒక్కటి ఎలా అవుతారో చూడండి అంటూ కామెంట్లు రాశారు.


నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకలో ప్రత్యేక పూజలు చేసిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, గోవింద్‌రాఠీ, ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రెటరీ బి.సురేందర్‌రెడ్డి


అలయ్‌బలయ్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు జ్ఞాపికలను అందజేస్తున్న తెలంగాణ భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు తదితరులు


మహారాజ్‌గంజ్‌లోని మహాకాళి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బొడ్డు శివ, బొడ్డు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, నాయకులు నరేందర్, రాజేశ్ తదితరులు


మామిడిపల్లిలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు కల్లెం నరేష్‌గౌడ్, లాల్ శేఖర్‌గౌడ్, రాజుగౌడ్, ఎల్.విజయ్, బీజేపీ నాయకులు ఎలిగేపల్లి యాదగిరి యాదవ్, సురేష్‌గౌడ్, శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సంబురంగా దసరా వేడుకలు

విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా సంబురాలు అంబరాన్నంటాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఒకరికొకరు జమ్మి ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలుచోట్ల రావణ దహనం చేశారు. ఆలయాల నిర్వాహకులు, భక్తులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

\- రాజేంద్రనగర్/చార్మినార్/అఫ్జల్‌గంజ్/చాంద్రాయణగుట్ట/పహాడీషరీఫ్/మదీన


పల్లెచెరువు వద్ద జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి


మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నాయకులు


పురానాపూల్‌లో నిర్వహించిన దసరా సమ్మేళనం కార్యక్రమంలో స్వాగత వేదికపై నుంచి ఊరేగింపునకు స్వాగతం పలుకుతున్న ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ తదితరులు


జాంబాగ్‌లో పూజలు చేసిన కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, బీజేపీ నాయకుడు నటరాజ్ నామ్‌దారి, మండప నిర్వాహకులు


హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మైనారిటీ సెల్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బాక్రీ తదితరులు


రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు చెబుతున్న పలుగుచెరువు మహేశ్ తదితరులు


గౌలిపురా గాంధీబొమ్మ వద్ద శ్రీ లక్ష్మీనారాయణస్వామి రథోత్సవానికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు


కిషన్‌బాగ్ పార్కు వద్ద జరిగిన దసరా సంబరాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయికిరణ్ తదితరులు


బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చిన లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహాకాళి అమ్మవారు


లాల్‌దర్వాజ మోడ్ నాగులచింతలో రావణ దహనం చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, ఆర్యసమాజ్ ప్రతినిధులు విఠల్‌రావు ఆర్య, అర్జున్ ఆర్య తదితరులు


నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి బతుకమ్మ సమర్పించి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ జి.ముఖేష్‌సింగ్, మండప నిర్వాహకులు


జంగమ్మెట్ శ్రీకృష్ణ బాలభక్త సమాజం, ఉమ్మడి ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో రావణ దహనం చేస్తున్న ఆలయ అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, చైర్మన్ నిరంజన్‌గౌడ్, ప్రతినిధులు రాంరెడ్డి, పాపయ్య తదితరులు


విజయదశమి రోజున లాల్‌దర్వాజలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బేగంబజార్‌లో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జి ఆర్‌వీ మహేందర్, భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డూ యాదవ్, నరేందర్ యాదవ్ తదితరులు


అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయంలో 85 అడుగుల భగవద్ధ్వజం ఆవిష్కరించారు. అనంతరం మోండ్ర నర్సింహ ఆధ్వర్యంలో రావణ దహనం చేశారు


విశేష అలంకరణలో రాజేంద్రనగర్‌లోని శ్రీ మాతా పోచమ్మ అమ్మవారు


బేగంబజార్‌లో నిర్వహించిన మాతా విశాల్ జాగారణలో కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తంరావు, ఎం.రాంచంద్రరాజుకు సన్మానం


గోషామహల్‌లో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ తదితరులు


లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహామెహ్రా, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నిమ్స్‌లో సిద్ధమవుతున్న స్లీప్ ల్యాబ్

నిద్రలేమి, గురక, ఇతర శ్వాసకోశ బాధితులకు

స్లీప్ అప్నియా నిర్ధారణ ● 24 గంటల పాటు పరీక్షలు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ల్యాబ్ సిద్ధమవుతోంది. శ్వాసకోశ సంబంధిత సమస్యలను గుర్తించి చికిత్సలు అందించేందుకు ఈ ల్యాబ్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఓ రోగి సహాయకుడు ఇచ్చిన విరాళాలతో ఈ ల్యాబ్‌ను మరింత ఆధునికీకరించి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో బాధితులకు పరీక్షలు చేయడానికి అవసరమైన బ్రాంకోస్కోపీ, సీపాప్ తదితర పరికరాలను కొనుగోలు చేశారు. నిద్రలేమి, గురక, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి నిమ్స్ స్లీప్ ల్యాబ్‌లో పరీక్షలు చేయనున్నారు.


స్లీప్ అప్నియాను టైప్1, 2, 3గా విభజించి..

గురక సమస్యను నిర్ధారించడానికి ఆస్పత్రిలో 24 గంటల పాటు ఉండాల్సి వస్తుంది. రోగికి 24 గంటల పాటు స్లీప్ ల్యాబ్‌లో నిద్రలో అతని అవయవాల పనితీరు, గుండె స్పందనలు, ఊపిరితిత్తులు, మెదడు కార్యకలాపాలు, శ్వాస విధానాలు, చేయి, కాలు కదలికలు, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను నిర్ధారిస్తారని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప తెలిపారు. ఈ పరీక్షలను పాలిసోమ్నోగ్రఫిగా వ్యవహరిస్తమన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా స్లీప్ అప్నియా టైప్1, 2, 3గా విభజించి విశ్లేషిస్తారని చెప్పారు. నిద్రపోతున్న సమయంలో గంటలో 5 నుంచి 20 సార్లు శ్వాస ఆగిపోతే దాన్ని మైల్డ్ గ్రేడ్‌గా భావిస్తామని, అలాగే గంటకు 20 నుంచి 40 సార్లు ఆగిపోతే దాన్ని మోడరేట్ గ్రేడ్‌గా లెక్కిస్తామని, తరువాత గంటకు 40 నుంచి 60 సార్లు అంతకన్నా ఎక్కువ సార్లు ఆగిపోతే దాన్ని సీవియర్ గ్రేడ్ స్లీప్ అప్నియాగా పరిగణించి పరిస్థితిని తీవ్రంగా భావిస్తామని వైద్యులు వివరించారు.

పదిమందిలో ముగ్గురికి..

శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ప్రతి పది మందిలో ముగ్గురు తప్పనిసరిగా స్లీప్ అప్నీయా బాధితులుంటున్నారని వైద్యులు తెలిపారు. పిల్లలు, పెద్దలు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారని ఇది స్లీప్ అప్నియాకు దారితీస్తుందన్నారు. గురక సమయంలో కొన్ని క్షణాలు శ్వాస ఆగిపోతుందని, ఈ సమయంలో ఆక్సిజన్ అందకపోడం, గుండెస్పందనలో తేడాలు రావడం, బీపీ పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నవుతున్నాయన్నారు. స్లీప్ అప్నియా పరీక్ష ద్వారా నిర్ధారణ జరిగిన తర్వాత ఏమైనా లోపాలు ఉంటే వాటికి దశల వారీగా చికిత్సలు అందిస్తారు. పరీక్ష ఫలితాల ఆదారంగా రోగికి అవసరమైన చికిత్సలు, వైద్య సలహాలు, అందిస్తామని తెలిపారు. శ్వాసనాళాల్లో అడ్డంకులు ఉంటే శస్త్రచికిత్సతో తొలగించడం, మరికొందరిలో జీవనశైలిలో మార్పులకు సంబంధించి సూచనలు సలహాలు అందిస్తామని వైద్యులు తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rmdypvJలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



సీ-డాక్ ఐఎస్ఈఏ రూపొందించిన మహిషాసుర మర్దిని సూచనల వెబ్ పోస్టర్

సైబర్ నేరాలపై సీ-డాక్ ప్రత్యేక వెబ్ పోస్టర్

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగం వారి సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) హైదరాబాద్ శాఖ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) నిపుణులు సైబర్ నేరాలపై రూపొందించిన మహిషాసుర మర్దిని సూచనల పోస్టర్‌ను విడుదల చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం సీ డాక్ తక్కువ నిడివి వీడియోలతో పాటు, పోస్టర్లనూ ప్రతిరోజూ విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో సీ-డాక్ సీనియర్ డైరెక్టర్ సీహెచ్ఏఎస్ మూర్తి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అందరికీ సులభంగా అర్థమయ్యేలా పోస్టర్లు రూపొందించి అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారుత. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు వెబ్ పోస్టర్లను విడుదల చేయడంతో నెటిజన్లు సీ డాక్, ఐఎస్ఈఏలను అభినందిస్తున్నారు.

మధ్యతరగతి జీవన సంవేదన చిత్రకారుడు శీలా వీర్రాజు

● ప్రముఖ రచయిత నాళేశ్వరం శంకరం


మాట్లాడుతున్న నాళేశ్వరం శంకరం

రవీంద్రభారతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో మరిచిపోలేని సృజనాత్మక రచనలను అందించిన సాహితీకారు స్మృతిలో భాగంగా ప్రముఖ కవి, రచయిత శీలా వీర్రాజుసాహిత్య జీవితంపై నా దృష్టిలో శీర్షికన ప్రత్యేక కార్యక్రమం సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత నాళేశ్వరం శంకరం ప్రసంగించారు. శీలా వీర్రాజు ప్రయోగవాది అని, ఆయన ప్రధానంగా మధ్యతరగతి జీవన సంవేదనను చిత్రించాడని అభివర్ణించారు. ప్రకృతి అన్వేషకుడు, సహృదయ స్నేహశీలి, వచన కవిత్వం, కథకులలకు మార్గదర్శి అని పేర్కొన్నారు. వచన కథా కావ్యాలకు ఆద్యుడని, ఆయన గొప్ప చిత్రకారుడని కొనియాడారు. నగర జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని మళ్లీ వెలుగు అనే కావ్యంగా మలిచాడని తెలిపారు. తన ఆత్మకథను వచన కథాత్మక కావ్యంగా పడగు పేకల మధ్య జీవితం పేరుతో తొలిసారిగా విద్యార్థి దశలోనే ప్రజామాత పత్రికలో దారావాహికంగా బతుకుబాట అనే నవలను రచించారని తెలిపారు. కార్యక్రమంలో నందిని సిధారెడ్డి, మందలపర్తి కిశోర్, డా.ఎస్.రఘు, శిఖామణి, శీలా సుభద్రాదేవి, ఎం.వి. రామిరెడ్డి, సమ్మెట నాగమల్లీశ్వరరావు, డా.నాగసూరి, వేణుగోపాల్, అమరవాది నీరజ, చెన్నకేశవరెడ్డి, వద్దిరాజు ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, బెల్లంకొండ సంపత్‌కుమార్, రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు గుర్తింపుగా పురస్కారాలు


హిమబిందుకు పురస్కారం ఇస్తున్న అతిథులు

చిక్కడపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలను ప్రతిభకు గుర్తింపుగా ఇస్తారని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. రసమయి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో రఘుపతి వెంకయ్య అవార్డుగ్రహీత డా. సాలూరి రాజేశ్వరరావు 102వ జయంతి నిర్వహించారు. నాలుగు దశాబ్దాలకు పైగా సంగీత రంగంలో విశేషమైన కృషి చేస్తున్న స్వరకర్తలకు, గాయనీగాయకులకు సాలూరి సంగీత పురస్కారాలను ప్రదానం చేశారు. కొప్పుల ప్రవీణ్, చింతలపాటి మూర్తి, శీలం రమణ, సౌమ్య వారణాసి, హిమబిందుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, నిర్వాహకులు ఎంకే రాము, ఎంకేఆర్ ఆశాలత పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీజేపీ నేత మృతి


శ్రీనివాస్‌గౌడ్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు, బుద్వేల్ నివాసి మూల శ్రీనివాస్‌గౌడ్(52) శనివారం రాత్రి 10 గంటలకు మృతిచెందారు. అంతిమయాత్ర ఆదివారం జరిగింది. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వై.శ్రీధర్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోరని సదానంద్, సీనియర్ నాయకులు బి.కుమార్, లోహిత్‌రెడ్డి, వెంకటేశ్, జి.బాబురావు, సాబాద విజయ్‌కుమార్, అడికె జనార్దన్, రావుల భాస్కర్, మోండ్ర గౌరీశంకర్, డి.సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు..


రమేశ్ కుమార్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయదశమి రోజు శనివారం మైలార్‌దేవుపల్లిలో విషాదం చోటుచేసుకుంది. మూవర్స్ అండ్ ప్యాకర్స్‌లో సామగ్రిని అన్‌లోడ్ చేస్తుండగా రమేశ్ కుమార్‌కు విద్యుత్ షాక్ తగిలింది. అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు మైలార్‌దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్‌లో దుర్గామాతకు పూజలు

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో గల 'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంస్థ డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వైస్ ప్రెసిడెంట్ శ్రుతికీర్తి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

- బాలానగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి)

కళాభిమానులను ఆకర్షిస్తున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



చిత్రాలను వీక్షిస్తున్న కళాభిమానులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి చెందిన గ్యాలరీ డాట్‌వాక్ 'సైరెన్స్ లుల్లబీ ఇన్ ది ఫర్గాటెన్ రియల్మ్' పేరుతో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నది. ఈ ప్రదర్శన అక్టోబర్ 16 వరకూ జరగనుంది. సుప్రసిద్ధ చిత్రకారులతో పాటు ఔత్సాహిక పెయింటర్లు చిత్రించిన చిత్రాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నామని క్యూరేటర్ ప్రేమ్‌జీష్ ఆచారి తెలిపారు. భావోద్వేగాలను రేకెత్తించే, కల్పనాశక్తిని పెంపొందించే, ఆలోచనలను రేకెత్తించే శక్తికి నిదర్శనంగా ఈ చిత్రాలు ఉంటాయంటూ పెయింటింగ్స్, స్కల్ప్చర్, ఇన్‌స్టాలేషన్, మిక్స్ మీడియాతో సహా వివిధ మాధ్యమాల ద్వారా రూపొందించిన కళాకృతులు ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తుల విక్రయం

- దుకాణాల్లో రూ.2 లక్షల నకిలీ సరుకు స్వాధీనం
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న ముఠాకు చెందిన ముగ్గురిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన రమేష్‌కుమార్ పార్మర్(40), హితేష్‌పవార్(22), రమేష్‌కుమార్(34) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రమేష్ పార్మర్ బేగంబజార్‌లో జీఎం జనరల్ స్టోర్, హితేష్ ఫీల్ ఖానాలో శ్రీ సరోజ్ ఏజెన్సీ, రమేష్‌కుమార్ ఎర్రగడ్డలో శ్రీ ట్రేడర్స్ పేరుతో దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరు కొంతకాలంగా బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది.. వీరి దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రూ.2 లక్షల విలువైన నకిలీ గుడ్‌నైట్ మస్కిటో లిక్విడ్(44), నకిలీ గుడ్‌నైట్ కాయిల్స్(94), లైజాల్ బాటిళ్లు(702), ఫెవీక్విక్ సాచెట్లు (13440) స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- శరవేగంగా సాగుతున్న సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల పనులు
- 20 రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం



రాయదుర్గం మెట్రోస్టేషన్ వద్ద.. (ఫైల్)

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది ఐటీ కారిడార్. వేలాది ఐటీ కంపెనీలు.. రోజుకు సుమారు 15-20 లక్షల మంది వాహనదారులు రాకపోకలు సాగించే అత్యధిక రద్దీ ప్రాంతం.. అలాంటి ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టడానికి సైబరాబాద్ పోలీసులు అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. తాజాగా ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్న, అత్యధికంగా వాహనాల రాకపోకలు సాగించే ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడున్న రోడ్లను విస్తరించి, ప్రత్యేకంగా ఫ్రీ లెఫ్ట్ వెల్లడానికి సరిపడా రోడ్లను విస్తరిస్తున్నారు. గచ్చిబౌలి ఐబీటీ జంక్షన్ వద్ద గచ్చిబౌలి పీఏఎస్ ఎంట్రెన్స్ నుంచి పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్ స్థలాన్ని తొలగించి ఐబీటీ జంక్షన్ వరకు అతిపెద్ద రోడ్డుగా విస్తరిస్తున్నారు. దాంతో సైబరాబాద్ సీపీ కార్యాలయం, ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌కు వెళ్లేవారు ఐఐఐటీ జంక్షన్ వద్ద సిగ్నల్ కోసం ఆగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక రోడ్డును నిర్మిస్తున్నారు. అంతేకాకుండా హెచ్‌సీయూ నుంచి వచ్చే ట్రాఫిక్ ఐఐఐటీ జంక్షన్ వద్ద ఆగకుండా లెఫ్ట్‌వెళ్లేవారు, నేరుగా వెళ్లేవారు సిగ్నల్ కోసం ఆగకుండా, జంక్షన్ వద్ద వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి రాయదుర్గం వైపు వెళ్లాలనుకునేవారు. ఐఐఐటీ వద్ద లెఫ్ట్ తీసుకొని, స్టేడియం వద్ద యూటర్న్ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా రాయదుర్గం నుంచి షేక్‌పేట ఫ్లైఓవర్ వరకు, ఐకియా నుంచి హైటెక్‌సిటీ వరకు అక్కడి నుంచి మాదాపూర్ యశోద ఆస్పత్రి వరకు సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌లు అందించడానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నారు. బయోడైవర్సిటీ వద్ద సిగ్నల్ ఫ్రీ జంక్షన్ ఏర్పాటు చేసి ఎలా సక్సెస్ అయ్యారో ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద అదే పద్ధతి కొనసాగించడానికి పోలీసులు కసరత్తు చేస్తున్నారు. మరో 20 రోజుల్లో సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇప్పటికే హైరైజ్ కెమెరాల ఏర్పాటు..

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణకు ఇప్పటికే హైరైజ్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎత్తైన ఐటీ కంపెనీల భవనాలకు హైరైజ్ కెమెరాలను ఇన్‌స్టాల్ చేయడం వల్ల చుట్టూ 360 డిగ్రీస్ రేడియస్‌లో ఒక్కో కెమెరా ఒక కిలోమీటర్ మేర స్పష్టమైన విజువల్స్‌తో వీక్షిస్తుంది. దాన్ని జూమ్‌చేసి చాలా స్పష్టంగా వాహనాల నంబర్‌లతో సహా.. చూడొచ్చు. దాంతో ఆ చుట్టుపక్కల ఎక్కడ ఏ చిన్న ట్రాఫిక్ జామ్ ఏర్పడినా, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వెంటనే ట్రాఫిక్ పోలీసులకు తెలిసేలా కెమెరాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ (పీఎస్ ఐఓసీ)కి అనుసంధానం చేశారు. అక్కడి నుంచి సిబ్బంది ట్రాఫిక్‌ను మానిటరింగ్ చేస్తారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ సైతం పరిస్థితిని సమీక్షించేలా ఆయన కార్యాలయానికి కనెక్ట్ చేశారు. దాంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో ఎక్కడ జామైంది..? ఎందుకు జామైంది..? ప్రస్తుత పరిస్థితిని వీక్షించి వెంటనే ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి ఘటనా స్థలానికి వెళ్లి తక్షణమే ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌ల ఏర్పాటు సైతం సత్ఫలితాలు ఇస్తాయని, ఎన్నాళ్లుగానో ఉన్న ఐటీ కారిడార్ ట్రాఫిక్ కష్టాలు తీరిపోతాయని సైబరాబాద్ ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్పాన్సర్డ్ 'ఎంటెక్'లో అవకాశమివ్వండి

- జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు ఎంసీఏ అభ్యర్థుల వినతి
- ఎంసీఏతో ఎంటెక్ చేసిన వారికి ఐఐటీల్లో ఫ్యాకల్టీగా అనుమతి
- గత విధానానికి మోకాలడ్డుతున్న జేఎన్‌టీయూ అధికారులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్పాన్సర్డ్ కేటగిరీలో జేఎన్‌టీయూ ఆఫర్ చేస్తున్న ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు తమకు కూడా అవకాశం కల్పించాలని పలువురు ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) అభ్యర్థులు కోరుతున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. వాస్తవానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించే ఉద్దేశంతో జేఎన్‌టీయూ స్పాన్సర్డ్ కేటగిరీ అడ్మిషన్లు ఇస్తోంది. ఇందులో భాగంగానే ఇంజనీరింగ్ విభాగంలో ఎంటెక్ కోర్సులను, ఫార్మసీ విభాగంలో ఎంఫార్మసీ కోర్సులను ఆఫర్ చేస్తోంది. మొత్తం 186 సీట్ల భర్తీకిగాను వర్సిటీ అడ్మిషన్ల విభాగం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. అయితే, గతంలో ఎంసీఏ అభ్యర్థులకు ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, అనుబంధ కోర్సుల్లో ప్రవేశం కల్పించిన జేఎన్‌టీయూ అధికారులు, ఈ దఫా నోటిఫికేషన్‌లో బీటెక్ అభ్యర్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. దీంతో ఎంసీఏ అభ్యర్థులకు ఎంటెక్ చేయాలనే ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

బోధించేందుకు అనుమతి.. చదువుకునేందుకు తిరస్కరణ

ఐఐటీలు, ఎన్ఐటీలు, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలు, అఫిలియేటెడ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంసీఏతో పాటు ఎంటెక్ చేసిన అభ్యర్థులను ఫ్యాకల్టీగా అనుమతిస్తుండగా, ఎంసీఏ అభ్యర్థులకు ఈ ఏడాది ఎంటెక్‌లో చేరేందుకు జేఎన్‌టీయూ అనుమతించకపోవడాన్ని పలువురు యూనివర్సిటీ ఆచార్యులు సైతం ఆక్షేపిస్తున్నారు. ఓవైపు అఖిలభారత సాంకేతిక విద్యామండలి ఎంసీఏ అభ్యర్థులను బీటెక్ బోధనకు అనుమతిస్తుండగా, ఎంసీఏ/ఎంఎస్సీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఐఐటీ కాన్పూర్, ఐఐటీ హైదరాబాద్ ఎంటెక్‌లో అడ్మిషన్లు కల్పిస్తున్నాయని చెబుతున్నారు. విద్యార్థులు వారికి నచ్చిన విధంగా ఏ డిసిప్లినరీలోనైనా చదువుకునేందుకు జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) వెసులుబాటు కల్పిస్తుండగా, గతంలో ఎంసీఏ అభ్యర్థులకు ఎంటెక్ ప్రవేశానికి అవలంబించిన విధానాన్ని జేఎన్‌టీయూ అధికారులు ఈ ఏడాది రద్దు చేయడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఓవైపు ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు రెండు కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సులు చేసిన సివిల్, మెకానికల్ బ్రాంచ్‌ల అధ్యాపకులకు అవకాశమిస్తున్న అధికారులు, మూడేళ్లపాటు ఎంసీఏ చదివి ఎంటెక్‌లో చేరతామంటే మోకాలడ్డు పెట్టడమేంటని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఎంసీఏ అభ్యర్థుల విన్నపాన్ని మన్నించి, వారికి ఎంటెక్ చదువుకునేందుకు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్‌లు

(5వ పేజీ తరువాయి)

తిరుగుతుంటాడు. ఇతనికి స్థానికంగా ఉన్న ఖలీల్, వేణు, మహేష్ ఇతర యువకులతో స్నేహం ఉంది. ఈ యువకులంతా రాత్రంతా మద్యం, గంజాయి తాగి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తుంటారు. ఇదేక్రమంలో రెండుసార్లు నదీమ్‌పాషాను ఖలీల్ గ్యాంగ్‌సభ్యులు తీవ్రంగా కొట్టారు. ఈ విషయంలో కేసులు నమోదు కాకుండా ఖలీల్ మేనమామ (చోటా నాయక్) చూశాడు. ఈ క్రమంలో ఆదివారం ఓ స్నేహితుని పుట్టినరోజు వేడుకలు ఉండటంతో తప్పతాగిన ఖలీల్ గ్యాంగ్ సభ్యులు నదీమ్‌పాషాను పిలిపించి తెల్లవారుజామున 3గంటల సమయంలో రోడ్లపై పరుగెత్తించి గొంతుకోసి, తలపై రాడ్డుతో విచక్షణా రహితంగా కొట్టి హత్యచేసి పారిపోయారు. స్థానికులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో పరిశీలించి ఇనుపరాడ్డు, నిందితుల చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేసు తారుమారు చేస్తే ఊరుకోం.. మృతుడి సోదరి

పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐని కలవడానికి వెళ్తున్న చోటానాయక్‌పై మృతుడి సోదరి తీవ్ర పదజాలంతో విరుచుకుపడింది. 'నా తమ్ముడు నీవల్లనే చనిపోయాడు.. కేసును తారు మారుచేయాలనిచూస్తే ఊరుకోం..' అని హెచ్చరించింది. దీంతో బయటకు వచ్చిన సీఐ నర్సింహ చోటానాయక్‌ను అక్కడి నుంచి పంపించడంతో ఆమె శాంతించారు. ఇదిలాఉంటే.. జగద్గిరిగుట్ట ప్రాంతంలో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్‌షాపులు, గంజాయి వ్యాపారాలతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారని, స్థానికులు ఆరోపించారు. పట్టపగలు కూడా స్థానికులకు రక్షణలేకుండా పోయిందని వాపోతున్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని గంజాయిబ్యాచ్ ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

మార్నింగ్ వాక్‌కు వెళ్లొస్తున్న వ్యక్తిపై దాడి



గాయపడ్డ అనిల్‌కుమార్

రాజేంద్రనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ ఎర్రబోడ సమీపంలోని నలందనగర్ కాలనీలో ఆదివారం ఉదయం గంజాయి తాగిన ఐదుగురు యువకులు హల్‌చల్ చేశారు. వాకింగ్‌కు వెళ్లొస్తున్న అనిల్‌కుమార్(54)ని ఆపి మరీ దాడి చేశారు. సమీపంలో పార్కు చేసిన కారు అద్దాలనుకూడా ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నలందనగర్‌లో నివాసం ఉండే అనిల్‌కుమార్ ఆర్టీఏ కార్యాలయంలో చిన్నచిన్న పనులు చేస్తుంటాడు. ఆదివారం ఉదయం ఆయన తమ కాలనీ సమీపంలో వాకింగ్ చేసి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. గంజాయి తాగిన ఐదుగురు యువకులు ఆయన బైక్‌ను ఆపారు. 'అరెయ్ మా ముందే కళ్లద్దాలు(సైట్‌కు సంబంధించినవి) పెట్టుకుని తిరుగుతావా.. కళ్లద్దాలు తీయ్' అని అన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఎందుకు అలా మాట్లాడుతున్నారని ఆ యువకులను అనిల్‌కుమార్ ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులైన ఆ యువకులు అనిల్‌కుమార్‌పై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. అక్కడే పార్కు చేసి ఉన్న కారు అద్దాలనూ పగులగొట్టారు. గాయపడ్డ అనిల్‌కుమార్ తన స్నేహితులను తీసుకుని వెళ్లగా వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో అనిల్‌కుమార్ స్థానికులతో కలిసి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎర్రబోడ, నలందనగర్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

నేతల ఐక్యతా రాగం

అలయ్ బలయ్‌లో ఎవరేమన్నారంటే..

ఎన్నికల వరకే పార్టీలు: పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



ఎన్నికల వరకే పార్టీలు.. ఎన్నికల తరువాత తెలంగాణా సంస్కృతీ సాంప్రదాయాలను అన్ని పార్టీల నేతలు కలిసి కాపాడుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న అలయ్ బలయ్ కార్యక్రమంలో పార్టీలకతీతంగా అందరం ఒకే వేదికపై కలువడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి ముందుకుపోవాలని ఆయన సూచించారు.

నాయకులు కలసికట్టుగా ఉండేందుకు: మంత్రి శ్రీధర్‌బాబు



భావితరాల రాజకీయ నాయకులు కలసికట్టుగా ఏ విధంగా ఉండాలో తెలిపేదే అలయ్ బలయ్ అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వల్ల ప్రజలకు మంచి సందేశం వెళ్తుందని అన్నారు. రాజకీయాలు ఏవైనా ప్రజలే మనందరికీ ముఖ్యమని ఆయన అన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు: పొన్నం



రాజకీయాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడకుండా స్వీయనియంత్రణ అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టకుండా మాట్లాడేలా దత్తాత్రేయ చొరవ చూపాలని కోరారు. రాజకీయాలు పార్టీలు, వ్యక్తులు అభినందించేలా ఉండాలని సూచించారు.

ఏపీలో కూడా నిర్వహించాలి : ఏపీ మంత్రి సత్యకుమార్



స్నేహపూరిత వాతావరణంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా నిర్వహించాలని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. దత్తాత్రేయ రాజకీయ అజాతశత్రువు అని, దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్లను, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజా ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మంచి వాతావరణానికి పునాది వేయడం సంతోషంగా ఉందని అన్నారు.

తెలంగాణ అభివృద్ధికి సూచిక : జానారెడ్డి



తెలంగాణ అభివృద్ధికి సూచికగా.. సంకేతంగా అలయ్ బలయ్ వేదిక అని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. దసరా తర్వాత ఆత్మీయంగా అందరం ఇక్కడ కలుసుకోవడం ఆనందంగా ఉందని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా అలయ్ బలయ్ నిర్వహించడం హర్షణీయమని అన్నారు.

కక్షపూరిత వాతావరణం మంచిదికాదు : ఎంపీ ఈటల



ప్రస్తుతం రాజకీయ వ్యవస్థలో కక్షపూరిత వాతావరణం నెలకొందని, ఇది సమాజానికి మంచిది కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు మాట్లాడుతున్న భాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఈ ధోరణి మారాలని అన్నారు. బయట రాజకీయ నాయకులు ఎన్ని తిట్టుకున్నా ఈ వేదికపై కలుసుకోవడం, శుభాకాంక్షలు తెలుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టేలా: తలసాని



మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని దత్తాత్రేయ నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దసరా పండుగ తర్వాత పర్టీలకతీతంగా అందరం కలిసి అలయ్ బలయ్ చేసుకోవడం సంతోషమని, ఈ కార్యక్రమం ఇలాగే ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

సౌభ్రాతృత్వానికి ప్రతీక: విద్యాసాగర్‌రావు



అలయ్ బలయ్ రాజ్యాంగ పీఠికలోని సౌభ్రాతృత్వానికి ప్రతీక అని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. పలు రాష్ట్రాల గవర్నర్ల రాకతో దేశమంతా దిగివచ్చినట్లుందని, అలయ్ బలయ్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని జిల్లాలకు ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించాలని ఆయన కోరారు.

తెలంగాణ కలలను బతికించే విధంగా..: చైర్‌పర్సన్ విజయలక్ష్మి



తెలంగాణ కలలను బతికించే విధంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని కార్యక్రమ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. తెలంగాణ వంటకాలను ప్రత్యేకంగా చేయించి ప్రతి ఒక్కరికీ రుచి చూపించామని అన్నారు. పార్టీలకతీతంగా ఆట, పాట, మాట, ముచ్చట చెప్పుకుంటూ ఈ పండుగ జరుపుకుందామని అన్నారు. మహిళల మీద ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా ఉండాలని కోరుకుంటున్నానని ఆమె తెలిపారు.

అలయ్ బలయ్‌పై సీపీఐలో భిన్న స్వరాలు

అలయ్ బలయ్ కార్యక్రమంపై సీపీఐలో భిన్న స్వరాలు వినిపించాయి. ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి మీ ప్రభుత్వం కారణమైందని ఆరోపిస్తూ, అందుకు నిరసనగా అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కావడంలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తేల్చిచెప్పారు. కానీ, అదే పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, శాసనసభ నేతగా ఉన్న కూనంనేని సాంబశివరావు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమాన్ని నిర్వహించిన దత్తాత్రేయ, ఆయన కూతుర్లకు సీపీఐ పార్టీ నుంచి అభినందనలు తెలుపుతున్నట్లుగా వేదికపై కూనంనేని ప్రకటించడం విశేషం.

మంటలు చెలరేగి దగ్ధమైన కారు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శంషాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లే దారిలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగాయి. కారుడ్రైవరు అప్రమత్తం కావడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కారులో ప్రయాణికులను ఎక్కించుకొని హైదరాబాద్‌కు డ్రైవర్ బయల్దేరాడు. కొద్దిదూరం వెళ్లాక షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారులో నుంచి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవరు వెంటనే కారులో ఉన్న ఇద్దరు ప్రయాణికులతో పాటు తాను దిగిపోయాడు. కారులో నుంచి మంటలు అధికంగా రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. కానీ, అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేబీఆర్ పార్కు వద్ద అతిపెద్ద అండర్‌పాస్

(5వ పేజీ తరువాయి)

వెళ్లే వాహనాల కోసం సెకండ్ లెవల్‌లో రెండు లేన్ల వంతెన నిర్మించనున్నారు.

- కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ఓ అండర్‌పాస్, ఓ వంతెనను రూ.83 కోట్లతో ప్రతిపాదించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి మహారాజ అగ్రసేన్ చౌరస్తా (తెలంగాణ భవన్) వైపు వెళ్తాయి. తెలంగాణ భవన్ నుంచి వెళ్లే వాహనాలు వంతెన మీదుగా బంజారాహిల్స్ రోడ్ నంబర్-10, రోడ్ నంబర్-1 వైపు వెళ్లొచ్చు.
- మహారాజ అగ్రసేన్ చౌరస్తా వద్ద రూ.110 కోట్లతో ఓ అండర్‌పాస్, వంతెన ప్రతిపాదించారు. కేన్సర్ ఆస్పత్రి వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ మీదుగా ఫిల్మ్‌నగర్ చౌరస్తా వైపు వెళ్లాలి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ -12 నుంచి వచ్చే వాహనాలు వంతెన మీదుగా ఫిల్మ్‌నగర్ చౌరస్తాకు వెళ్లొచ్చు.
- ఫిల్మ్‌నగర్ చౌరస్తా వద్ద అండర్‌పాస్, ఓ వంతెనను రూ.115 కోట్లతో నిర్మించనున్నారు. మహారాజ అగ్రసేన్ చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనదారులు వంతెన మీదుగా మహారాజ అగ్రసేన్ జంక్షన్ వైపు వెళ్లే అవకాశం కలుగుతుంది.
- రోడ్ నంబర్ -45 జంక్షన్ వద్ద రూ.97 కోట్లతో ఓ అండర్‌పాస్, వంతెన నిర్మాణం ప్రతిపాదించారు. జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా వైపు నుంచి అండర్‌పాస్ ద్వారా జూబ్లీ చెక్‌పోస్ట్‌కు వెళ్లొచ్చు. జూబ్లీ చెక్‌పోస్ట్ నుంచి వచ్చే వాహనదారులు వంతెన మీదుగా కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లాల్సి ఉంటుంది. కేబుల్ బ్రిడ్జి వైపు నుంచి వచ్చే వాహనదారులు ఫ్రీ లెఫ్ట్‌ను వినియోగించుకుంటే జూబ్లీ చెక్‌పోస్ట్ వైపు వెళ్లొచ్చు.

అండర్‌పాస్‌ల వివరాలు..

- రోడ్ నంబర్-45 వైపు నుంచి కేబీఆర్ పార్కు మెయిన్ గేటు వైపు మూడు లేన్ల అండర్‌పాస్- 740 మీటర్లు
- జూబ్లీ చెక్‌పోస్ట్ వైపు నుంచి కేబీఆర్ పార్కు మెయిన్ గేట్ చౌరస్తా మీదుగా క్యాన్సర్ ఆస్పత్రి వైపు రెండు లేన్ల అండర్‌పాస్- 330 మీటర్లు
- కేబీఆర్ పార్కు మెయిన్ గేట్ జంక్షన్ వైపు నుంచి పంజాగుట్ట వైపు (ముద్ర చౌరస్తా వద్ద) మూడు లేన్ల అండర్‌పాస్ - 260 మీటర్లు
- కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ జంక్షన్ వైపు నుంచి క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ మీదుగా మహరాజ్ అగ్రసేన్ చౌరస్తా వైపు రెండు లేన్ల అండర్‌పాస్- 330 మీటర్లు
- క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా వైపు నుంచి మహారాజ్ అగ్రసేన్ జంక్షన్ మీదుగా ఫిల్మ్‌నగర్ జంక్షన్ వరకు రెండు లేన్ల అండర్‌పాస్- 410 మీటర్లు
- మహరాజ అగ్రసేన్ చౌరస్తా వైపు నుంచి ఫిల్మ్‌నగర్ చౌరస్తా మీదుగా జర్నలిస్టు కాలనీ చౌరస్తా వరకు రెండు లేన్ల అండర్‌పాస్ - 340 మీటర్లు
- జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా వైపు నుంచి రోడ్ నంబర్-45 జంక్షన్ మీదుగా జూబ్లీచెక్‌పోస్ట్ వరకు రెండు లేన్ల అండర్‌పాస్ - 290 మీటర్లు

వంతెనలు..

- కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ - 36 వరకు ఒక్కోవైపు రెండు లేన్ల చొప్పున ఫస్ట్ లెవల్ వంతెన - 745 మీటర్లు
- యూసుఫ్‌గూడ వైపు నుంచి రోడ్ నంబర్ -45 జంక్షన్ వైపు సెకండ్ లెవల్‌లో రెండు లేన్ల వంతెన - 770 మీటర్లు
- పంజాగుట్ట వైపు నుంచి కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ జంక్షన్ మీదుగా జూబ్లీచెక్‌పోస్ట్ వైపు మూడు లేన్ల వంతెన - 900 మీటర్లు
- మహరాజ అగ్రసేన్ జంక్షన్ వైపు నుంచి క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా మీదుగా బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 వైపు రెండు లేన్ల వంతెన -540 మీటర్లు
- ఫిల్మ్‌నగర్ జంక్షన్ వైపు నుంచి మహరాజ అగ్రసేన్ చౌరస్తా మీదుగా బంజారాహిల్స్ రోడ్ నంబర్-12 వైపు రెండు లేన్ల వంతెన - 590 మీటర్లు
- ఫిల్మ్‌నగర్ వైపు నుంచి మహారాజ అగ్రసేన్ చౌరస్తా వైపు రెండు లేన్ల వంతెన - 600 మీటర్లు
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు నుంచి రోడ్ నంబర్-45 చౌరస్తా మీదుగా కేబుల్ బ్రిడ్జి వైపు రెండు లేన్ల వంతెన - 500 మీటర్లు

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 14 అక్టోబరు 2024



నడవలేని వారికి ఎక్కువగా అందుబాటులో ఉండేవి... చేతులతో బలంగా నెట్టనిదే ముందుకు కదల్లేని చక్రాల కుర్చీలే. బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు కొనే స్థోమత అందరికీ ఉండదు.
ఈ ఇబ్బందులను స్వయంగా అనుభవించిన
డాక్టర్ నల్లూరి హిమబిందు...
తక్కువ ధరకే ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్‌ను రూపొందిస్తూ, దివ్యాంగుల అవసరాలను తీరుస్తున్నారు. ఆమె 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

వీల్‌చైర్స్‌తో... వైకల్యాన్ని గెలిచి!

"ఏడాది వయసుకే పోలియో బారిన పడ్డాను. సర్జరీ చేసిన తర్వాత, క్యాలిపర్స్‌తో పడుతూ లేస్తూ నడక కొనసాగించాను. కానీ బాత్రూమ్‌లో పట్టుతప్పి పడిపోయి, భుజానికి దెబ్బ తగలడంతో సర్జరీ చేయించుకోవలసి వచ్చింది. క్యాలిపర్స్ సహాయంతో నడవగలిగినా... వాటి వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయి కాబట్టి చక్రాల కుర్చీకే పరిమితమవడం మేలని నిర్ణయించుకున్నాను. అయితే కానీ ఎక్కడ వెతికినా, సాదాసీదా చక్రాల కుర్చీలే కనిపించాయి. కానీ వాటిని ఉపయోగించాలంటే ఇతరుల సహాయం కావాలి. తోడు లేకుండా ఎక్కడికీ వెళ్లలేను. అది నాకు ఇష్టం లేదు. స్వతంత్రంగా నడుపుకొంటూ వెళ్లగలిగే వీల్ చైర్ కావాలి. కానీ అలాంటి ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ మన దగ్గర ఎక్కడా కనిపించలేదు. దాంతో గత్యంతరం లేక.. 2016లో, రెండున్నర లక్షల ఖర్చుతో, తైవాన్ నుంచి ఒక ఎలక్ట్రిక్ వీల్‌చైర్ దిగుమతి చేసుకున్నాను. ఏడాది తర్వాత ఢిల్లీలో ఒక కాన్ఫరెన్స్‌కి హాజరైనప్పుడు, అకస్మాత్తుగా వీల్‌చైర్ బ్యాటరీ డిశ్చార్జ్ అయిపోయింది. దాన్ని చేతులతో నడిపించలేం! మరమ్మతు చేయించాలని ఎంత ప్రయత్నించినా... వాటి స్పేర్ పార్ట్స్ దొరకలేదు. సర్వీసింగ్ లేదు. చివరకు ఆ ఎలక్ట్రిక్ కుర్చీని అలాగే ఇంటికి తీసుకొచ్చేశాను. తర్వాత బ్యాటరీని స్థానికంగా రిపేర్ చేయించాను. ఛార్జింగ్ పెట్టి, అలారం వచ్చిన తర్వాత డిస్కనెక్ట్ చేశాను. అది పండుగ రోజు. మా కుటుంబ సభ్యులం అందరం ఇంటి బయట వేడుకలో పాల్గొంటున్నాం. ఆ సమయంలో ఇంట్లో నుంచి హఠాత్తుగా పెద్ద శబ్దం వచ్చింది. కుర్చీకి బిగించి ఉన్న బ్యాటరీ పేలిపోయి, ఇంట్లోని సామానంతా ధ్వంసమైపోయింది. ఈ సంఘటనతో నాలో ఆలోచన మొదలైంది. మన దేశంలో ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ తయారుచేయకపోవడం వెనుక ఉన్న కారణాల గురించి లోతుగా పరిశోధించాను. వాటిని తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెస్తే, ఎంతోమంది దివ్యాంగుల ఇబ్బందులు తీరతాయనిపించింది. అలా ఆ ఆలోచన నుంచే, "ఈజీలైఫ్ వీల్‌చైర్ సంస్థ రూపం పోసుకుంది.

అవరోధాలను అధిగమించి...

మొదట్లో చైనా నుంచి కొన్ని ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ స్పేర్ పార్ట్స్ తెప్పించాం. వాటికి సర్వీసింగ్ చేయగలిగే నిపుణులను నియమించుకొని, అమ్మకాలు మొదలుపెట్టాం. 2020లో కొవిడ్ సమయంలో దిగుమతులకు అవరోధం ఏర్పడింది. దీనికి తోడు అదే సమయంలో, మన దేశానికి చైనాతో విభేదాలు పెరగడంతో, చైనా ఉత్పత్తుల పట్ల దేశవ్యాప్తంగా అయిష్టత ఏర్పడింది. ఈ పరిస్థితి మాకు ఆటంకంగా మారింది. దాంతో చైనా నుంచి దిగుమతికి స్వస్తి చెప్పి, స్థానికంగా చెన్నై ఐఐటీని సంప్రతించాం. కానీ వాళ్లు తయారుచేసి అందించే మోడల్... దిగుమతి చేసుకున్న మోడల్ కంటే ఖరీదైనది కావడంతో స్వయంగా మేమే ఎలక్ట్రిక్ కుర్చీల తయారీకి పూనుకున్నాం. కొందరు ఐఐటీ విద్యార్థుల సాయంతో ఇంట్లోనే ఎలక్ట్రిక్ వీల్‌చైర్ తయారీ మొదలుపెట్టాం. అలా 2021లో ప్రొటోటైప్ ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను రూపొందించగలిగాం. అప్పటికే ఇండియా మార్ట్‌లో రిజిస్టర్ అయి ఉన్నాం. కాబట్టి ఆ వేదిక ద్వారా కుర్చీల అమ్మకాలు. మొదలుపెట్టాం.

ఎన్నో రకాల వీల్‌చైర్స్

వీల్‌చైర్స్‌లో ఎన్నో రకాలుంటాయి. దివ్యాంగుల అవసరాలకు తగ్గట్టు రూపొందే వీల్‌చైర్స్ కూడా ఉంటాయి. కాబట్టి వీటి ధరల్లో తేడాలుంటాయి. విదేశీ వీల్‌చైర్స్‌తో పోలిస్తే, 'ఈజీలైఫ్' వీల్‌చైర్స్ చవకగా దొరకడమే కాకుండా, వాటి విడిభాగాలను కొనుక్కోవచ్చు, ఇతరత్రా సర్వీసింగ్ సేవలు కూడా పొందవచ్చు. మరీ ముఖ్యంగా నేల మీద దోగాడుతూ కదిలే వైకల్యం కొందరికి ఉంటుంది. ఇలాంటి వాళ్లు చేతుల సహాయంతో పైకి లేవలేరు. ఇతరుల సహాయం లేకుండా కుర్చీలో కూర్చోలేరు. వాళ్ల కోసం 'గ్రౌండ్ లిఫ్టింగ్ వీల్ చైర్'ను కూడా మేం తయారుచేశాం. దీనిలో చైర్ నేలకు సమాంతరంగా కిందకు చేరుకోగలుగుతుంది. దీని మీదకు చేరుకుంటే.. అది నెమ్మదిగా పైకి లేస్తుంది. ఇలా ఏ ఎత్తు కావాలనుకుంటే ఆ ఎత్తుకు కుర్చీ కదులుతుంది. ఇలాంటి కుర్చీని దిగుమతి చేసుకోడానికి 3 నుంచి 4 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. మేం ఒకటిన్నర లక్షలకే ఇస్తున్నాం. ఇలా మా దగ్గర పది రకాల వీల్‌చైర్స్ అందుబాటులో ఉన్నాయి. దివ్యాంగులు కస్టమైజ్ కూడా చేసుకోవచ్చు. ఇప్పటివరకూ 400 వీల్‌చైర్స్ అమ్మకాలు జరిపాం.

> **మాది ఒంగోలు. అక్కడే పుట్టి పెరిగాను. వైద్య విద్యలో ఫీటల్ మెడిసిన్ నా స్పెషాలిటీ. ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ఫీటల్ అటాప్సీ కన్సల్టెంట్‌గా పని చేశాను. ప్రస్తుతం రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఫీటల్ మెడిసిన్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. అమ్మ భూమా నాగేశ్వరమ్మ, ప్రభుత్వ టీచర్. మేం ముగ్గురు పిల్లలం. నాకు అక్క, అన్న, నేను చివరిదాన్ని. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం కోసం నిర్వహించిన 'టై' (ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) విమెన్స్ గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ రీజనల్ ఫైనల్స్‌లో... మొదటి రన్నరప్‌గా గుర్తింపు సాధించాను.**

సవాళ్లను ఎదుర్కొని, వైద్యురాలిగా ఎదిగి...

చిన్నప్పటి నుంచే నేను చదువరిని. దివ్యాంగురాలిగా నన్ను చిన్నచూపు చూసిన సందర్భాలు కూడా లేవు. కుటుంబసభ్యులు, స్నేహితులు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారే తప్ప, ఎప్పుడూ ఆత్మన్యూనతకు గురి చేయలేదు. అయితే డాక్టర్‌గా ఎదగాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. అందుకు కారణం నా వైకల్యం కాదు. ఎంతలా దేవుడిని కొలిచేవాళ్లైనా, అనారోగ్యం బారిన పడితే ముందుగా వైద్యులనే ఆశ్రయిస్తూ ఉంటారు. అలాంటి సందర్భాలు నాకు ఎదురైనప్పుడు... నేను కూడా వైద్యురాలిగా ఎదగాలనే కోరిక నాలో నాటుకుపోయింది. నా ఆలోచనను గ్రహించిన కొందరు "కుదురుగా నిలబడలేవు. నువ్వు వైద్యం ఎలా చేయగలుగుతావు?" అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. దాంతో పట్టుదలగా చదివేదాన్ని. క్యాలిపర్స్‌తో సమర్థంగా నడవడం సాధన చేసేదాన్ని. ఇంటర్ ఒంగోలులో పూర్తి చేసిన తర్వాత, ఎంసెట్‌లో 320 ర్యాంకు సాధించాను. 'దివ్యాంగుల కోటాలో సీటు సాధిస్తే, వైకల్యం కారణంగా మెడిసిన్ ప్రవేశానికి అనుమతించరేమో?' అనే ఆలోచన కూడా వేధిస్తూ ఉండేది. దాంతో మెరిట్‌లో సీటు సాధించాలని పట్టుదలతో చదివాను. అనుకున్నది సాధించాను. అలా తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎమ్‌బిబిఎస్ పూర్తి చేశాను. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండి చేశాను.

మేమిద్దరం ప్రాణ స్నేహితులం

నాకు పెళ్లి ఆలోచన ఉండేది కాదు. ఒక కోచింగ్ సెంటర్‌లో, జిన్నేంద్ర సత్యశ్రీనివాస్ పరిచయం అయ్యారు. తక్కువ కాలంలోనే మేమిద్దరం మంచి స్నేహితులమైపోయాం. కలకాలం స్నేహితులుగా ఉండాలంటే పెళ్లొక్కటే మార్గమని నిర్ణయించుకున్నాం. అలా 2013లో మేము దంపతులమయ్యాం! ఇప్పటికీ ఆయనే నా బెస్ట్ ఫ్రెండ్. ప్రతి విషయంలో ఆయన తోడ్పాటు ఉంటూనే ఉంటుంది. ప్రస్తుతం ఆయన 'ఈజీలైఫ్ మొబిలిటీ ఇన్నొవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు సిఇఒగా వ్యవహరిస్తున్నారు.

• గోగుమళ్ల కవిత

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
6. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉలాయా)
7. మిలియనీర్ (గ్లోరీ)
8. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)
9. అపనా బనాలే (భేడియా)
10. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి!

రాత్రి నుంచి ఉన్న ఫాస్టింగ్‌ను ఉదయం అల్పాహారం తీసుకోవడం ద్వారా బ్రేక్ చేస్తాం. ఈ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేస్తే కొత్త సమస్యలు చుట్టుముడతాయని అంటున్నారు నిపుణులు.



- ఉదయం వేళల్లో రక్తంలో షుగర్ లెవెల్స్ తక్కువ స్థాయిలో ఉంటాయి. బ్రేక్‌ఫాస్ట్ చేయడం వల్ల ఈ షుగర్ లెవెల్స్ సాధారణ స్థితికి చేరుకుంటాయి. జీవక్రియలు గాడిలో పడటానికి బ్రేక్‌ఫాస్ట్ అనేది శరీరానికి ఫ్యూయల్ మాదిరిగా ఉపకరిస్తుంది.
- నిద్రలేచినపుడు అందరిలోనూ ఎనర్జీ లెవెల్స్ చాలా తక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో టిఫిన్ చేయకపోతే మెదడుకు అవసరమైన ముఖ్యమైన పోషకాలు అందకుండా పోతాయి. దీనివల్ల మరింత నీరసపడతారు.
- సమయానికి బ్రేక్‌ఫాస్ట్ చేయకపోతే యాసిడ్ రిఫ్లక్స్ అయ్యే అవకాశం ఉంది. ఎసిడిటీ సమస్య దరిచేరకుండా ఉండాలంటే లైట్‌గానైనా బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి.
- రోజంతా మెదడు అలర్ట్‌గా ఉండాలి. ఒకవేళ మీరు బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తే ముఖ్యమైన పోషకాలు అందక మెదడు చురుగ్గా పనిచేయదు. ప్రొటీన్ అధికంగా లభించే బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి సులువుగా బయపడొచ్చు.
- బ్రేక్‌ఫాస్ట్‌ను మానేస్తే గుండె జబ్బులు వచ్చే రిస్క్ కూడా పెరుగుతుందని అంటున్నారు వైద్యులు. బ్రేక్‌ఫాస్ట్‌ను తరచుగా స్కిప్ చేసే వారిలో డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ అని హెచ్చరిస్తున్నారు.
- ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ బరువు నియంత్రణకు ఉపయోగపడుతుంది. ఎక్కువసేపు పొట్ట నిండి ఉన్న ఫీలింగ్‌ని అందిస్తుంది. స్నాక్స్ వంటి వాటి జోలికిపోకుండా చేస్తుంది.

ఆదివాసీల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేశారు ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో అరెస్టయిన ఆయన కొంతకాలం జైలు జీవితం గడిపారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రోజున కన్నుమూశారు. సాయిబాబా జైలు జీవితం గడుపుతున్న సమయంలో ఆయన జీవనసహచరి ఎ.ఎస్ వసంతకుమారి నవ్యతో ముచ్చటించారు.



ఆదివాసీల కోసం ఆయన జీవితం అంకితం

"ఆయన జైలు జీవితం మా కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఎంతో కుంగదీసింది. జైలులో ఉన్నప్పుడు ఆయనకు మందులు అనుమతించలేదు. దాంతో ఎడమ చేతి నరాలు, కండరాలు బాగా దెబ్బ తిన్నాయి. ఆయనకు రెండు కాళ్లూ పనిచేయవు కాబట్టి చేతుల మీదే ఆధారపడేవారు. దాంతో ఆయన పరిస్థితి మరింత దిగజారింది. వైద్యపరీక్షల్లో 'ఎక్యూట్ పాంక్రియాటిస్'తో బాధపడుతున్నారని తెలిసింది. ఆ తర్వాత గాల్‌బ్లాడర్‌లో ఉన్న రాళ్లను తీయడానికి సర్జరీ చేయాలన్నారు. రక్తపోటుకు, గుండెలోని ఇన్ఫెక్షన్‌కు, చేతులు, వెన్నెముక సమస్యలకు మందులు వాడేవారు. ఆ మందులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపకూడదు. కానీ జైలులో మందులు వాడే పరిస్థితి లేక ఆయన శరీరంలోని చాలా అవయవాలు దెబ్బతిన్నాయి. ఆరోగ్యపరంగానే కాదు ఆర్థికంగా కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాం. తను సస్పెండ్ అయినప్పటి నుంచి మాకు సగం జీతమే ఇచ్చారు. దీనికి తోడు యూనివర్సిటీ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించారు. ఇతర ఆదాయమార్గాలేవీ మాకు లేవు. ఇంత బాధలో ఉన్న మమ్మల్ని సాయిబాబా తోటిసిబ్బంది ఎంతగానో ఆదుకున్నారు. ఇంకా ఎందరో కళాకారులు, రైతులు, దళితులు, మానవహక్కుల కార్యకర్తలు అందరూ మాకు అండగా నిలబడ్డారు. వారందరికీ ఏమిచ్చి రుణం తీర్చుకోగలను.

> నేను జైలుకు వెళ్లిన మొదట్లో ప్రాణాలతో బయటకు రానని అనుకున్నా. ఆ సమయంలో ఎలా బతికాననే విషయం చెప్పలేను. అక్కడ పరిస్థితుల గురించి వర్ణించటం చాలా కష్టం. అలాంటి అమానవీయ పరిస్థితులున్నాయి. మొదట్లో ఐదారు నెలల కన్నా ఎక్కువ బతకననుకున్నా. వాస్తవిక పరిస్థితిని గమనించా. నేను జైలులో బతికి బయటకు వచ్చినా.. జైలు లోపలే చనిపోయినా- ఏదో ఒకటి చేయాలనుకున్నా. జైలులోనే చనిపోతే- నా ఆలోచనలు బయట ప్రపంచానికి తెలియాలి. బయటకు రావాలంటే- నా కోసం నేనే పోరాటం చేయాలి. ఇలా ఆలోచనలు మొదలయిన తర్వాత నాలో భయం పోయింది. రకరకాల పద్ధతుల ద్వారా నేను ఉన్న పరిస్థితుల గురించి ఉత్తరాలు రాసేవాడిని. ఇలా ఆరు నెలలు గడిచిన తర్వాత నాకు పుస్తకాలు ఇవ్వటం మొదలుపెట్టారు. దీనికి నా కూతురు పెద్ద పోరాటమే చేసింది.
>
> \- జీఎన్ సాయిబాబా

నిత్యం ప్రజల కోసమే...

ఆయన 'ఆపరేషన్ గ్రీన్ హంట్'కు వ్యతిరేకంగా పోరాడారు. ఆదివాసీ యువతను చంపేయడాన్నీ, ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, వారి నివాసాలను తగలబెట్టేయడాన్నీ ఆయన తీవ్రంగా నిరసించారు. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లలో ఉన్న ఖనిజసంపదపై కన్నేసి బహుళజాతి కంపెనీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పం




దాలు కుదుర్చుకోవడాన్ని వ్యతిరేకించారు. అక్కడ ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో చంపేయడాన్ని తప్పుపట్టారు. ఇలాంటి ఎన్నో దారుణాలను ప్రపంచం ముందుకు తెచ్చారు. మానవహక్కుల కోసం కృషిచేశారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మానవహక్కుల పరిరక్షణకు, ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు.

అలా కలిశాం..

మా ఇద్దరిదీ తూర్పు గోదావరి జిల్లా అమలాపురం. 1991లో మా వివాహం అయింది. చదువుకునే రోజుల్లో ట్యూషన్‌లో పరిచయం అయ్యారు. చిన్నప్పటి నుంచి గ్రామాల్లోని దళితులు, స్త్రీలు, ఆదివాసీల ఈతిబాధలను దగ్గరి నుంచి చూశారు. సమాజంలో అణచివేతకు గురవుతున్న వారికి ఏదైనా చేయాలని ఆయన స్వప్నించారు. ఇద్దరం హైదరాబాద్ వచ్చిన తర్వాత మా స్వప్నాలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేశాం. సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమాల్లో సాయిబాబా, మహిళా ఉద్యమాల్లో నేను పాల్గొన్నా. ఇద్దరం ఒకరికొకరం అండగా నిలబడ్డాం. ఆయన శారీరక లోపం మా ప్రేమకు, లక్ష్యాలకు ఆటంకం అనుకోలేదు. ప్రజాఉద్యమాలే ముందుకు నడిపించాయి."

నవ్య | చిత్రజ్యోతి



మెగాస్టార్ చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడిని కలిశారు. శనివారం, జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆయన ఏపీలో వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి తన తరపున రూ. 50 లక్షలు, రామ్‌చరణ్ తరపున మరో రూ. 50 లక్షల విరాళం చెక్కులను సీఎంకు అందజేశారు.

మాస్ పాత్రలో నాని

నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' చిత్రం సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా, వీరిద్దరి కలయిలో మరో చిత్రం ప్రారంభమైంది. 'నాని ఓదెల 2' వర్కింగ్ టైటిల్‌తో పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాని ఇది వరకు పోషించనంత మాస్ పాత్రలో కనిపించనున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కే ఈ చిత్రం 'దసరా'ను మించి ఉండబోతోందని నాని ఓ సందర్భంలో తెలిపారు.





అంచనాలను మించేలా...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. త్రిష, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ మాట్లాడుతూ "సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. మీ అందరి అంచనాలను మించేలా సినిమా ఉంటుంది. చిరంజీవితో సినిమా చేయడం మరిచిపోలేని అనుభూతి" అని చెప్పారు.

టైటిల్ దీపావళికి.. సినిమా సంక్రాంతికి



బాబీ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న సినిమా వర్కింగ్ టైటిల్ 'ఎన్‌బీకే109' అని తెలిసిందే. దసరా సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దీపావళికి టైటిల్‌ను ప్రకటిస్తామని తెలిపారు. మరోవైపు, అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో నాలుగో సారి బాలకృష్ణ నటించనున్న సినిమాను ఈ నెల 16న ప్రారంభిస్తున్నట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రకటించారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'బీబీ4'. బాలకృష్ణ కూతురు తేజస్విని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



మొదటి పాట వచ్చేస్తోంది

పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ పీరియడ్ డ్రామా 'హరిహర వీరమల్లు'. జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి దసరా సందర్భంగా ఓ నూతన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. త్వరలోనే మొదటి గీతం విడుదవుతుందని తెలిపారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ ఆలపించడం విశేషం. వచ్చే ఏడాది మార్చి 28న సినిమా విడుదలవుతోంది.



శ్రీదేవి కపూర్ చౌక్

దివంగత నటి శ్రీదేవి జ్ఞాపకార్థం ముంబైలోని ఓ రహదారి కూడలికి ఆమె పేరు పెట్టారు. శ్రీదేవి తుదిశ్వాస విడిచేవరకూ లోఖండ్‌వాలా ప్రాంతంలో నివసించారు. ఆమె అంతిమ యాత్ర కూడా ఈ రహదారి గుండానే సాగింది. ఈ నేపథ్యంలో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ లోఖండ్‌వాలా కాంప్లెక్స్ ఏరియాలోని ముఖ్య కూడలికి శ్రీదేవి కపూర్ చౌక్ అని పేరు పెట్టింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని శనివారం శ్రీదేవి భర్త బోనీకపూర్, కూతురు ఖుషీకపూర్ ఆవిష్కరించారు.

కొత్త తేదీన గేమ్ చేంజర్



శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పొలిటికల్ యాక్షన్‌థ్రిల్లర్ 'గేమ్‌చేంజర్'. దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ, శ్రీకాంత్, ఎస్.జే.సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా విడుదలపై నెలకొన్న సస్పెన్స్ వీడింది. సంక్రాంతి కానుకగా సినిమాను వచ్చే ఏడాది జనవరి 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. మొదట ఈ సినిమాను క్రిస్మస్‌కు విడుదల చేయాలనుకున్న సంగతి తెలిసిందే.

ప్రియురాలితో నిశ్చితార్థం



నటుడు నారా రోహిత్ త్వరలోనే ఓ ఇంటివాడవబోతున్నారు. తన ప్రేయసి, హీరోయిన్ శిరీష లేళ్లను పెళ్లాడనున్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో వీరి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. సిరీ లెల్లా, నారా రోహిత్ 'ప్రతినిధి-2'లో కలసి నటించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు నారా, నందమూరి, సిరీ లెల్లా కుటుంబాలకు చెందిన పలువురు హాజరయ్యారు. నారారోహిత్, శిరీష డిసెంబరు 15న పెళ్లి పీటలెక్కనున్నారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్ఫియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టు2(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సుల్లో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టిపొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్ఫెయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్ఫియర్ అంటారు. దీనిని అశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు.

భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.

- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.



- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉత్పత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటిసారిగా 1972లో స్టాక్ హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.

హైదరాబాద్ రాజ్యంలో భూ సంబంధాలు, వ్యవసాయరంగం

ఎకానమీ



హైదరాబాద్ రాజ్యంలో ఉన్న భూ విస్తీర్ణంలో ఎక్కువ భాగం సాగులో ఉంది. అయితే ఈ భూమిలో అధిక భాగం తక్కువ సారవంతమైనది. వ్యవసాయంపైనే ఎక్కువమంది ఆధారపడినప్పటికీ, భూమి యాజమాన్యం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. చిన్న కమతాల యాజమాన్యాన్ని ఎక్కువమంది కలిగి ఉన్నారు. 22 శాతం ప్రజలు వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. కూలీల్లో ఎక్కువమంది అంటరాని కులాల వారు, సామాజికంగా వెనుకబడిన కులాలవారు ఉన్నారు' అని వి.భాస్కరరావు తాను రాసిన 'హైదరాబాద్ రాజ్యంలో వ్యవసాయ, పారిశ్రామిక సంబంధాలు' పుస్తకంలో పేర్కొన్నారు.

భూ సంబంధాలు

నిజాం రాజ్యంలోని భూ సంబంధాల్లో దివానీ ప్రాంతం, జాగీరు ప్రాంతం అనే రెండు రకాల భూ యాజమాన్య/ శిస్తు/ నిర్వహణ పద్ధతులు ముఖ్యమైనవి.

దివానీ ప్రాంతాలు(రైత్వారీ పద్ధతి): శిస్తు ప్రత్యక్షంగా ప్రభుత్వానికి చెల్లించే భూ యాజమాన్యం కలిగి ఉన్న భూ విస్తీర్ణ ప్రాంతాన్ని దివానీ ప్రాంతం అన్నారు. దీనిని రైత్వారీ పద్ధతి అని కూడా అనవచ్చు. ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో ఉండే ప్రాంతం కాబట్టి దీనిని 'ఖల్సా' అని కూడా అంటారు. రాజు సొంత భూములు సర్ఫేఖాస్ కూడా దీనిలో భాగమే. 1853లో నాలుగో నిజాం ఇంగ్లీష్ కంపెనీకి కొంత భూభాగాన్ని వదులుకున్నప్పటికీ అదే సంవత్సరం సాలార్‌జంగ్ ప్రధానమంతి పదవి చేపట్టిన తరవాత దివానీ ప్రాంతం విస్తరించింది. 1861కి పూర్వం ఖల్సా ప్రాంతం దాదాపు 40వేల చ.మై.గా ఉండగా ఆ తరవాత అది 71,589 చ.మై.కు విస్తరించింది.

1908లో చేసిన 'హైదరాబాద్ భూమిశిస్తు చట్టం' ప్రకారం భూమిపై యాజమాన్యం అంతిమంగా రాష్ట్రం(రాజ్యం)దే అయింది. అయితే ఈ రైత్వారీ విధానంలో పట్టాదారుల పేర్లను గ్రామ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వీరికి వ్యవసాయ కార్యకలాపాలు చేసుకోవడానికి, వంశపారంపర్యంగా బదిలీ చేయడానికి, ఇతరులకు బదిలీ చేయడానికి కూడా హక్కులు కలిగి ఉంటారు. రిజిస్టర్ చేసిన రైతుకు భూమిని సేద్యం చేయడానికి లేదా బంజరుగా ఉంచడానికి, పొలంలో బావుల నిర్మాణానికి, మరమ్మతు చేయడానికి కూడా హక్కులుంటాయి. అయితే పట్టాదారుకు వారసులు లేనప్పుడు, భూమిశిస్తు చెల్లించినప్పుడు భూమిపై హక్కు ప్రభుత్వానికి బదిలీ అవుతుంది. అంతేకాకుండా గనుల తవ్వకం విషయంలో రాష్ట్రానికి పూర్తి హక్కు ఉంటుంది. ఇక రిజిస్టర్ కాని రైతులను షిక్మీదారులు అంటారు. వీరికి కూడా భూమిపై సాగు హక్కులుంటాయి. వీరికి సాగు వీలుపడనప్పుడు కౌలుకు ఇవ్వవచ్చు. ఇలా కౌలుకు భూమిని సాగు చేస్తున్న వారిని 'ఆసామీ షిక్మీలు' అనేవారు. 1900 సంవత్సరంలో రైత్వారీ విధానంలో ఉన్న భూములు అన్నింటినీ సర్వే చేయించడం వల్ల భూ వివాదాలు పరిష్కారమై ప్రభుత్వ శిస్తు వసూళ్లు పెరిగాయి.

జాగీరు ప్రాంతాలు(ఖల్సా కాని ప్రాంతాలు): నిజాం కాలంలో జాగీరులు రకరకాల పేర్లతో ఉండేవి. మొఘలుల భూస్వామ్య పద్ధతులను నిజాంలు అనుసరించడం వల్ల జాగీరు వ్యవస్థ హైదరాబాద్ రాజ్యంలో కూడా వేళ్లూనుకుంది. మొదటి అసఫ్‌జాహీ హైదరాబాద్ వచ్చినప్పుడు తనతోపాటు వచ్చి పాలనలో, మిలిటరీలో సహాయపడిన వారికి జీతభత్యాల కోసం భూములను దానంగా ఇచ్చారు. ఏదేని కారణంగా భూమిపై శిస్తు వసూలు అధికారం ఇవ్వడాన్ని 'జాగీరు' అంటారు. 'ప్రభువులకు, మున్సబ్‌దారులకు సుల్తానులు ఇచ్చిన భూమి' అని కూడా అర్థం వస్తుంది. జాగీర్‌దారుని ప్రవర్తన తీరు బాగాలేకపోయినా, ఆర్థిక అవకతవకలకు పాల్పడినా జాగీరు బాధ్యతల నుంచి తొలగించేవారు. 1726లో మొదటిసారి జాగీర్‌ను నిజాం-ఉల్-ముల్క్ ఇవ్వగా చివరి జాగీరును 1889-90లో మీర్-బహబూబ్ అలీ పరిపాలనలో ఇచ్చారు. మొత్తమ్మీద హైదరాబాద్ రాష్ట్రం(రాజ్యం)లో 'ఏడు'రకాల జాగీరులు ఉండేవి.

1. **సంస్థానాదీశులు:** వీరు నిజాంకు కప్పం చెల్లించే స్థానిక పాలకులు.
2. **ఇనామ్‌దార్లు:** తమ సేవలకు ప్రతిఫలంగా భూదానం పొందినవారు.
3. **దేశ్‌ముఖ్‌లు:** ప్రభుత్వంతో ఒప్పందంలో ఉన్న స్థానిక భూస్వాములు.
4. **దేశ్‌పాండేలు:** గ్రామీణ ప్రాంతంలో దొరల స్థాయిలో అధికారం చేలాయించే పెద్ద భూస్వాములైన గణిక నిపుణులు.
5. **పటేళ్లు:** గ్రామాల్లో శాంతిభద్రతలు పర్యవేక్షించేవారు.
6. **పట్వారీలు:** గ్రామాల్లో భూమి లెక్కలు చూస్తూ, గ్రామాధికారులుగా నిజాం ప్రభుత్వ పాలనకు ప్రతినిధులుగా, దొరల భూస్వామ్యానికి రక్షకులుగా ఉండేవారు.
7. **జాగీర్దార్లు:** పాలనలో, మిలిటరీలో సేవలందించి సుల్తాను నుంచి భూమిని పొందిన ప్రభువులు, మునసబ్‌దారులు.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల

సగటు భూ కమతం పరిమాణం

హైదరాబాద్ రాష్ట్రంలో సగటు భూ కమతం పరిమాణం క్రమంగా తగ్గింది. మాగాణికి సగటు కమత పరిమాణం 1914-15లో 1.86 ఎకరాలు కాగా, 1944-45 నాటికి 1.26 ఎకరాలకు తగ్గింది. అదేకాలంలో మెట్ట సగటు కమతం పరిమాణం 14.80 ఎకరాల నుంచి 1944-45 వరకు 9.19 ఎకరాలకు తగ్గింది. అంటే పై కాలంలో భూమిపై ఒత్తిడి పెరిగిందని అర్థం. వ్యవసాయేతర రంగాలు విస్తరించకపోతే భూమిపై ఒత్తిడి క్రమంగా పెరుగుతుంది.

భూ కేంద్రీకరణ

సగటు భూ కమతం తక్కువగా ఉండటం అంటే దాని అర్థం అందరి దగ్గర భూమి విస్తీర్ణం తక్కువ మొత్తంలో ఉందని కాదు. వాస్తవానికి హైదరాబాద్ రాష్ట్రం భూ కేంద్రీకరణ కిందివిధంగా ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలో 1945లో 1000-2000 ఎకరాల విస్తీర్ణం కలిగిన కమతాలు 444 కాగా, 2500-5000 ఎకరాల విస్తీర్ణం కలిగిన కమతాలు 49, ఇక 5000ల ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగినవి 11 కమతాలు ఉండేవి. వరంగల్ జిల్లాలో 100-5000 ఆపై ఎకరాల విస్తీర్ణం కలిగిన పట్టాదార్లు నాలుగు శాతం ఉండగా 60 శాతం పట్టాదార్లు 5-10 ఎకరాల విస్తీర్ణాన్ని మాత్రమే కలిగి ఉండేవారు. దీనిని బట్టి హైదరాబాద్ రాష్ట్రంలో భూ యాజమాన్యం బాగా కేంద్రీకృతం అయిందని అర్థమవుతుంది.

వ్యవసాయరంగం

హైదరాబాద్ రాష్ట్రంలో పండించిన సాధారణ పంటలు- వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న(మక్కలు), వేరుశనగ(పల్లి), ఆముదాలు, పత్తి, పొగాకు, మిరప. కరీంనగర్, వరంగల్ అధిక నీటిపారుదల కలిగిన ప్రాంతాలు. వరంగల్ సుబాలో నీటిపారుదల కింద ప్రధానంగా వరి, జొన్నలను పండించేవారు. నీటిపారుదల అందే భూమిలో వరి కరీంనగర్‌లో 73 శాతం, వరంగల్‌లో 72 శాతం, ఆదిలాబాద్‌లో 68 శాతం ఉండేది. అయినప్పటికీ హైదరాబాద్ రాష్ట్రం బియ్యాన్ని దాదాపు కొన్నిసార్లు గరిష్ఠంగా లక్ష టన్నులను మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి దిగుమతి చేసుకునేది.

సాలార్‌జంగ్ సంస్కరణలకు పూర్వం జీవనాధారం వ్యవసాయం ప్రధానంగా ఉండేది. వివిధ కుల వృత్తులపై ఆధారపడిన వారి ద్వారా వ్యవసాయేతర ఉత్పత్తి జరిగేది. సాలార్‌జంగ్ సంస్కరణలు, యూరప్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవంతో వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ అవసరాలకు మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో పండించే పత్తి, నూనెగింజలు ప్రధాన వాణిజ్య పంటలు. ప్రపంచ మార్కెట్‌లోకి తెలంగాణను ఈ పంటలే పరిచయం చేశాయి. 1930 నాటికి హైదరాబాద్ రాష్ట్రంలో ఉత్పత్తి అయిన పత్తిలో 60 శాతం ఎగుమతి అయ్యేది.



ముందుగా మరట్వాడా ప్రాంతం, ఆ తరవాత ఆదిలాబాద్ పత్తి వ్యాపార కేంద్రాలుగా వర్ధిల్లాయి. 1867లో సాలార్‌జంగ్ నీటిపారుదల శాఖను ఏర్పాటు చేశాక 1867-68 నుంచి వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేకించి నీటి పారుదలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఆరంభమయ్యాయి. అంతకుపూర్వం పాలకుల దృష్టి కేవలం భూమిశిస్తు వసూలు మీదనే ఉంది కానీ, భూమి అభివృద్ధి మీద అంతగా లేదు. గోదావరి, తుంగభద్ర, కృష్ణా నదులపై ఆనకట్టల నిర్మాణానికి బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన సలహాలను పాలకులు పట్టించుకోలేదనే విమర్శ ఉంది.

తదనంతరం పెద్దతరహా నీటిపారుదల(కాలువల ద్వారా నీరు) సౌకర్యంపై దృష్టి పెట్టడంతో 1922లో 0.8 మిలియన్ ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం ఉండగా 1945 నాటికి 1.7 మిలియన్ ఎకరాలకు చేరింది. అయితే నికర పంటల విస్తీర్ణంలో నీటిపారుదల కలిగిన భూ విస్తీర్ణం ఆరు శాతం మాత్రమే. మార్కెట్ దృష్ట్యా వ్యవసాయ ఉత్పత్తి జరగడం ఆరంభం కావడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయ పంటల విస్తీర్ణం 1921-22లో 15.3 మిలియన్ ఎకరాలు కాగా 1925-26లో 26.9 మిలియన్ ఎకరాలుగా ఉంది. 1932-33(ప్రపంచ ఆర్థికమాంద్య కాలం)లో 30 మిలియన్ ఎకరాలుగా ఉంది. 1934-35 సంవత్సరం వరకు పెరిగిన పంటల విస్తీర్ణం ఆ తరవాత తగ్గుముఖం పట్టింది. పంటల తీరును గమనిస్తే ఆహార ధాన్యాలు పండే విస్తీర్ణం కొంత తగ్గి ఆహారేతర పంటల విస్తీర్ణం పెరిగింది. 1920-22 కాలంలో మొత్తం విస్తీర్ణంలో 75 శాతం ఆహార ధాన్యాల విస్తీర్ణం ఉండగా 1949-50కి 68 శాతానికి తగ్గింది. ఆహార పంటల్లో వరి విస్తీర్ణం పెరగ్గా జొన్న, సజ్జల విస్తీర్ణం తగ్గింది. మొత్తం పంటల విస్తీర్ణంలో 1920-22లో మూడు శాతంగా ఉన్న వరి విస్తీర్ణం 1949-50 నాటికి ఆరు శాతానికి పెరిగింది. అదేకాలంలో జొన్నలు, సజ్జలు పండించే విస్తీర్ణం 49 శాతం నుంచి 31 శాతానికి తగ్గింది.

పాచికలు

రీజనింగ్

టీజీపీఎస్సీ / ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, 4) లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (△, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్ని ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 6 బి) 4 సి) 5 డి) 3

సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే
మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు
నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 4 బి) 2 సి) 1 డి) 5

సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు
మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.



3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?




ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు
రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు
నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ Sలు ఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 4 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 6 బి) 5 సి) 3 డి) 2

సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక వివిధ స్థితులు గమనిస్తే
మొదటి డయాగ్రమ్‌లో 4కు పక్కగా 3, 5 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 4కు పక్కగా 2, 5 అంకెలు
మూడో డయాగ్రమ్‌లో 4కు పక్కగా 1, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 4కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 4కు పక్క గా '6' అంకె కనిపించడం లేదు. కాబట్టి 4 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '6' అవుతుంది. కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

5. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'N' అనే అక్షరానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) M బి) L సి) Q డి) P

సమాధానం: (బి)

వివరణ: ఇచ్చిన డయాగ్రమ్స్‌లో గల అక్షరాలు L, M, N, O, P, Q. ఇచ్చిన పాచిక వివిధ స్థితులను పరిశీలిస్తే నాలుగో డయాగ్రమ్‌లో మాత్రమే 'N' అనే అంకె ఉంది.

Nకు పక్కగా M, O అక్షరాలు ఉన్నాయి. అనగా Nకు ఎదురుగా గల ముఖభాగంలో P, L, Qలలో ఏ అక్షరం ఉంటుందో తెలియదు. ఇటువంటి సందర్భాల్లో అడిగిన అక్షరం గల డయాగ్రమ్ వదిలివేసి మిగిలిన డయాడ్రమ్ కామన్ లెటర్ పరిశీలిస్తే 'L' అని తెలుస్తున్నది
మొదటి డయాగ్రమ్‌లో Lకు పక్కగా గల అక్షరాలు M, O
రెండో డయాగ్రమ్‌లో Lకు పక్కగా గల అక్షరాలు M, Q
మూడో డయాగ్రమ్‌లో Lకు పక్కగా గల అక్షరాలు P, O
ఇక్కడ Lకు పక్కగా M, O, P, Q అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. Lకు పక్కగా N అక్షరం కనిపించడం లేదు. అనగా Lకు ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం N. (L అండ్ N లు అపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (బి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

ఇంగ్లండ్ చేతిలో స్కాట్లాండ్ చిత్తు

షార్జా: మహిళల వరల్డ్‌కప్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఇంగ్లండ్ పది వికెట్లతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. తొలుత స్కాట్లాండ్ 20ఓవర్లలో 109/6 స్కోరు చేసింది. స్వల్ప ఛేదనను కేవలం 10ఓవర్లలో 113/0తో ఇంగ్లండ్ ముగించింది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ గ్రూప్-బిలో టాపర్‌గా నిలిచింది.

సుతీర్థ జోడీ కంచు మోత



ఆసియా టీటీ

అస్తానా (కజకిస్థాన్): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. తాజాగా మహిళల డబుల్స్‌లో భారత జోడీ సుతీర్థ ముఖర్జీ, అయిహిక ముఖర్జీ కంచు మోత మోగించింది. ఆదివారం జరిగిన డబుల్స్ సెమీస్‌లో అయిహిక ముఖర్జీ-సుతీర్థ జోడీ 4-11, 9-11, 8-11తో జపాన్ జంట మివా హరిమోటో-మియు చేతిలో ఓడి కాంస్యం దక్కించుకొంది. దీంతో ఈ ఈవెంట్‌లో పతకం నెగ్గిన తొలి భారత జోడీగా అయిహిక-సుతీర్థ రికార్డులకెక్కారు. రెండ్రోజుల క్రితం మహిళల టీమ్ ఈవెంట్‌లో మనికా, అయిహిక, సుతీర్థ త్రయం, పురుషుల టీమ్ సెమీస్‌లో శరత్ కమల్, మానవ్, హర్మీత్ త్రయం కాంస్యాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

హర్మన్‌ప్రీత్ @ రూ. 78 లక్షలు



హెచ్ఐఎల్ వేలంలో అత్యధిక ధర

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) వేలంలో భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ టాప్ లేపాడు. ఆదివారం జరిగిన తొలిరోజు వేలంలో సూర్మ హాకీ క్లబ్ రూ. 78 లక్షల భారీ మొత్తానికి డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ను ఖరీదు చేసింది. మొత్తంగా లీగ్‌లోని 8 ఫ్రాంచైజీలు భారత జాతీయ జట్టు ఆటగాళ్ల కోసం ఎక్కువగానే వెచ్చించాయి. అత్యధిక ధర పలికిన రెండో ఆటగాడిగా నిలిచిన అభిషేక్‌ను బెంగాల్ టైగర్స్ రూ. 72 లక్షలకు కొనుగోలు చేయగా.. హార్దిక్ సింగ్‌ను యూపీ రుద్రాస్ రూ. 70 లక్షలకు దక్కించుకొంది. అమిత్ రోహిదాస్ (తమిళనాడు డ్రాగన్స్), జుగ్‌రాజ్ సింగ్ (బెంగాల్ టైగర్స్) చెరో రూ. 48 లక్షలు పలికారు. సుమీత్‌ను హైదరాబాద్ తుఫాన్స్ రూ. 46 లక్షలకు సొంతం చేసుకొంది. విదేశీ ఆటగాళ్లలో గోంజాలో పిల్లెట్ (జర్మనీ)ను రూ. 68 లక్షలు, జిప్ జన్సన్(నెదర్లాండ్స్)ను రూ. 54 లక్షలకు డ్రాగన్స్ కొనుగోలు చేసింది. మొత్తంగా మొదటి రోజు 18 ఓవర్‌సీస్ ప్లేయర్లు సహా 54 మంది అమ్ముడయ్యారు.

భారత్-ఎ కెప్టెన్ తిలక్



ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌నకు భారత జట్టు

న్యూఢిల్లీ: ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత్-ఎ జట్టు సారథిగా తెలుగు ఆటగాడు తిలక్ వర్మ వ్యవహరించనున్నాడు. ఈ నెల 18 నుంచి ఒమన్‌లో టోర్నీ జరగనుంది. తొలిసారి టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే ఈ కప్‌లో తిలక్‌తోపాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం ఉన్న అభిషేక్ శర్మ, రాహుల్ చాహర్‌కు చోటుదక్కగా.. మిగతా వారిలో ఎక్కువ మంది ఐపీఎల్ ఆటగాళ్లు. గ్రూప్-ఎలో అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, హాంకాంగ్.. గ్రూప్-బిలో భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ జట్లు ఉన్నాయి. ఈనెల 19న తమ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ పాక్‌తో భారత్ తలపడనుంది. .

భారత్-ఎ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), అభిషేక్ శర్మ, బదోని, నిషాంత్ సింధు, అనూజ్ రావత్, ప్రభ్‌సిమ్రన్, నేహల్ వధేరా, అన్షుల్, హృతిక్ షోకీన్, ఆకిబ్ ఖాన్, వైభవ్ అరోరా, రసిక్ సలాం, సాయి కిషోర్, రాహుల్ చాహర్.



హర్మన్‌ప్రీత్ (54 నాటౌట్)

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు
న్యూజిలాండ్ X పాకిస్థాన్
రా. 7.30

కీలక మ్యాచ్‌లో భారత అమ్మాయిల ఓటమి
సెమీస్ ఆశలు సంక్లిష్టం
9 పరుగులతో ఆసీస్ విజయం

ఒత్తిడికి చిత్తయ్యారు

షార్జా: గత టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్, 2020 ప్రపంచ కప్ ఫైనల్లో కంగారూల చేతిలో ఓడిన భారత్‌కు మరోసారీ అదే ఫలితం ఎదురైంది. నాకౌట్ దశకు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఒత్తిడిలో పడి చిత్తయ్యింది. దాంతో ఆదివారం జరిగిన టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ' కీలక మ్యాచ్‌లో 9 పరుగులతో భారత్ ఓడింది. ఫలితంగా మనోళ్ల సెమీస్ ఆశలూ సంక్లిష్టమయ్యాయి. సోమవారం న్యూజిలాండ్-పాకిస్థాన్ మధ్య జరిగే గ్రూపు ఆఖరి లీగ్ మ్యాచ్‌పై భారత్ నాకౌట్ చాన్స్ ఆధారపడి ఉంది. ఆ మ్యాచ్‌లో పాక్ గెలిస్తే భారత్ సెమీస్ చేరుతుంది. కివీస్ గెలిస్తే మన జట్టు ఇంటిబాట పట్టక తప్పదు. ఇక..ఈ మ్యాచ్‌లో తొలుత ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 151/8 స్కోరు చేసింది. హ్యారిస్ (40), పెర్రీ (32), మెక్‌గ్రాత్ (32) సత్తాచాటారు. రేణుక, దీప్తి రెండేసి వికెట్లు తీశారు. ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 142/9 స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (54 నాటౌట్) హాఫ్ సెంచరీతో పోరాడగా, దీప్తిశర్మ (29), షఫాలీ (20) మోస్తరుగా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోలినెక్స్, సదర్లాండ్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ గెలుపుతో ఆసీస్ వరుసగా 9వసారి టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్‌కు చేరింది.

వికెట్లు వరుసగా: షఫాలీ దూకుడుతో ఛేదనను భారత్ ధాటిగానే ప్రారంభించింది. కానీ 4వ ఓవర్లో షఫాలీ అవుట్ కాగా..ఆపై మంధాన, జెమీమాను పెవిలియన్ చేర్చి ఆసీస్ గట్టి దెబ్బకొట్టింది. ఈ దశలో హర్మన్, దీప్తి నాలుగో వికెట్‌కు 63 రన్స్ జోడించినా రన్‌రేట్ పెరిగిపోయింది. దీప్తి తర్వాత వచ్చిన బ్యాటర్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. ఆఖరి ఓవర్లోనే నలుగురు భారత బ్యాటర్లు నిష్క్రమించడం గమనార్హం. మరోవైపు అర్ధసెంచరీతో హర్మన్ జట్టును గెలిపించేందుకు శాయశక్తులా ప్రయత్నించినా.. దీప్తి మినహా మరెవరూ సహకారం అందించలేకపోయారు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 151/8 (హ్యారిస్ 40, పెర్రీ 32, మెక్‌గ్రాత్ 32, రేణుక 2/24, దీప్తిశర్మ 2/28).

భారత్: 20 ఓవర్లలో 142/9 (హర్మన్ 54 నాటౌట్, దీప్తి 29, షఫాలీ 20, సదర్లాండ్ 2/22, మోలినెక్స్ 2/32).

ఎదురులేని భారత్



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత్ ఎక్కువగా యువ ఆటగాళ్లతోనే ఆడింది. కానీ బరిలోకి దిగాక వీరంతా సీనియర్లు లేని లోటును తెలియకుండా విరుచుకుపడ్డారు. ప్రతీ మ్యాచ్‌లోనూ దూకుడైన ఆటతీరుతో బంగ్లాను బెంబేలెత్తిస్తూ ముందుకుసాగారు. ఈ క్రమంలో భారత్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయగలిగింది. అయితే ఈ 3 మ్యాచుల్లో జట్టుకు లభించిన సానుకూల అంశాలను పరిశీలిస్తే..

ఆల్‌రౌండర్ల హవా: నాణ్యమైన ఆల్‌రౌండర్ల కొరత భారత జట్టును చాలాకాలంగా వేధిస్తోంది. కానీ ఇకపై ఆ ఇబ్బంది ఉండకపోవచ్చు. బంగ్లాదేశ్‌తో ఆడిన భారత జట్టును పరిశీలిస్తే చాలామంది ఆల్‌రౌండర్లను చూడవచ్చు. ప్రతీ మ్యాచ్‌లో కెప్టెన్‌కు కనీసం ఏడుగురు బౌలర్లు అందుబాటులో ఉండడం విశేషం. హార్దిక్‌కు జతగా నితీశ్ ఎదిగాడు. అలాగే రియాన్ పరాగ్, సుందర్ కూడా లభించిన అవకాశాన్ని వినియోగించుకున్నారు.



శాంసన్ (111)

ఆటగాళ్ల ఎదురుదాడి: సిరీస్ ఆరంభానికి ముందు కెప్టెన్ సూర్యకుమార్ మాట్లాడుతూ, తమ ఆటగాళ్లు స్థాయికి తగ్గట్టుగా ఆడితే చూడాలనుకుంటున్నట్టు చెప్పాడు. కెప్టెన్ కోరుకున్నట్టుగానే ప్రతీ ప్లేయర్ చెలరేగాడు. తొలి టీ20లో 128 పరుగుల స్వల్ప ఛేదనే అయినా ఓపెనర్ సంజూ శాంసన్ ఇన్నింగ్స్‌ను వేగంగా ఆరంభించాడు. రెండో మ్యాచ్‌లో జట్టు 41/3 స్కోరుతో ఇబ్బందిపడినా.. నితీశ్ ధనాధన్ ఆటతో స్కోరు 221కి వెళ్లగలిగింది. ఇక ఆఖరి మ్యాచ్‌లో అందరూ దాడికి దిగడంతో ఈ ఫార్మాట్‌లో రెండో అతి భారీ స్కోరు నమోదైంది.

మెరిసిన శాంసన్: శ్రీలంక టూర్‌లో శాంసన్ వరుసగా రెండు సార్లు డకౌట్లు కావడంతో అతడి పని అయిపోయినట్టేనని అంతా భావించారు. కానీ కోచ్, మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన నమ్మకాన్ని బంగ్లాతో సిరీస్‌లో నిలబెట్టుకున్నాడు. తొలి మ్యాచ్‌లో 19 బంతుల్లోనే 29 రన్స్ చేసిన సంజూ.. ఉప్పల్ మ్యాచ్‌లో కసితీరా బాదేసి సెంచరీ అందుకున్నాడు. ఇప్పటికీ అతను తొలి ప్రాధాన్య వికెట్ కీపర్ కాకపోయినా.. రానున్న సఫారీ టూర్‌లో తన ప్లేస్‌పై బెంగపెట్టుకోనవసరం లేదు. అలాగే అరంగేట్ర పేసర్ మయాంక్ యాదవ్, పునరాగమన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సెలెక్టర్లను నిరాశపర్చలేదు.

హైదరాబాద్: విజయదశమి రోజున భారత టీ20 జట్టు అభిమానులకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో ఉప్పల్ స్టేడియం రికార్డుల మోతతో ఊగిపోయింది. సంజూ శాంసన్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో 111) శతకంతో పాటు సూర్యకుమార్ (35 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 75) మెరుపు ఇన్నింగ్స్‌తో అకట్టుకున్నాడు. ఆ తర్వాత బౌలర్లు సత్తా చూపడంతో భారత్ ఏకంగా 133 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోరు సాధించింది. హార్దిక్ (18 బంతుల్లో 4 ఫోర్లు, 4

మోతెక్కించారు

సిక్సర్లతో 47), రియాన్ పరాగ్ (13 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 34) కూడా చెలరేగారు. తన్‌జీమ్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లా 20 ఓవర్లలో 164/7 స్కోరుకే పరిమితమైంది. తౌహీద్ హ్రిదయ్ (63 నాటౌట్), లిట్టన్ దాస్ (42) రాణించారు. రవి బిష్ణోయ్‌కు 3, మయాంక్ యాదవ్‌కు2 వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా టీ20 ఫార్మాట్‌లో నేపాల్ (314) తర్వాత రెండో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. అలాగే అత్యధిక బౌండరీల (47) రికార్డును నెలకొల్పింది.

7.1 ఓవర్లలోనే 100: అటు శాంసన్.. ఇటు సూర్య ధాటికి బంగ్లా బౌలర్లకు శనివారం కాళరాత్రిగా మిగిలింది. ఓపెనర్ అభిషేక్ (4) విఫలమైనా శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండో ఓవర్‌లో శాంసన్ వరుసగా 4 ఫోర్లు బాదగా.. ఆరో ఓవర్‌లో సూర్య 4,4,4,6తో పవర్‌ప్లేలో జట్టు 82 రన్స్ రాబట్టింది. తర్వాత ఓవర్ తొలి 3 బంతులను శాంసన్ 4,4,6కు పంపి 22 బాల్స్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు జట్టు స్కోరు 7.1 ఓవర్లలోనే వందకు చేరింది. ఇక పదో ఓవర్‌లో అతడు 0,6,6,6,6,6తో ఏకంగా 30 రన్స్ పిండుకున్నాడు. ఇదే జోరుతో సంజూ 40 బంతుల్లోనే కెరీర్‌లో తొలి శతకం సాధించాడు. తర్వాత వరుస ఓవర్లలో శాంసన్, సూర్య వెనుదిరిగినా.. హార్దిక్, పరాగ్ దూకుడు కొనసాగించారు. 16వ ఓవర్‌లో హార్దిక్ 4,6,6,4తో, తర్వాతి ఓవర్‌లో పరాగ్ 6,4,6తో సత్తా చాటారు. అయితే పరాగ్ 19వ ఓవర్‌లో.. ఆఖరి ఓవర్‌లో హార్దిక్, నితీశ్ (0) వరుస బంతుల్లో అవుటవడంతో స్కోరు 300లోపే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 297/6 (సంజూ శాంసన్ 111, సూర్యకుమార్ 75, హార్దిక్ 47, రియాన్ 34; తన్‌జీమ్ హసన్ 3/66).

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 164/7 (తౌహీద్ 63 నాటౌట్, లిట్టన్ 42; బిష్ణోయ్ 3/30, మయాంక్ 2/32).

హైదరాబాద్ లక్ష్యం 297

హైదరాబాద్: హైదరాబాద్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో గుజరాత్ 296 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో గుజరాత్ 343 పరుగులు చేయగా.. శనివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ 248 రన్స్‌కు ఆలౌటైంది. హిమతేజ (66), మిలింద్ (60), కెప్టెన్ రాహుల్ సింగ్ (56) ఆదుకున్నారు. అర్జాన్‌కు 3, చింతన్, రింకేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 95 పరుగుల ఆధిక్యంతో మూడో రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుజరాత్ 201 రన్స్‌కు ఆలౌటైంది. అనికేత్‌కు 5 వికెట్లు దక్కాయి. ఆటకు మరో రెండు రోజుల సమయం ఉండగా హైదరాబాద్ ముంగిట 297 పరుగుల లక్ష్యం ఉంది.

'త్రివేణి'కే గ్లోబల్ చెస్ టైటిల్

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ నిలబెట్టుకొంది. శనివారం ఉత్కంఠగా జరిగిన ఫైనల్స్‌లో టేబుల్ టాపర్ అలాస్కన్ నైట్స్‌కు త్రివేణి కింగ్స్ షాకిచ్చింది. తొలి మ్యాచ్‌లో కింగ్స్ 9-7తో నైట్స్‌ను ఓడించిన త్రివేణి జట్టు.. రెండో మ్యాచ్‌లో 13-7తో గెలిచి వరుసగా రెండోసారి టైటిల్‌ను అందుకొంది.

'ముంబై' చీఫ్ కోచ్‌గా మహేల



ముంబై: శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే రెండేళ్ల తర్వాత మళ్లీ ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. మార్క్ బౌచర్ స్థానంలో అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు. గతంలో 2017 నుంచి 2022 వరకు మహేల ముంబై కోచ్‌గా ఉన్నాడు.

బాబర్, అఫ్రీదిపై వేటు

కరాచీ: ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో చిత్తుగా ఓడడంతో పాకిస్థాన్ జట్టు రెండు, మూడో టెస్టులకు మార్పులు చేసింది. పేలవఫామ్‌లో ఉన్న బాబర్ ఆజమ్‌తో పాటు పేసర్ షహీన్ షా అఫ్రీది, నసీమ్ షా, సర్ఫరాజ్ అహ్మద్‌లపై వేటు వేసింది. వీళ్ల స్థానంలో అన్‌క్యాప్డ్ ప్లేయర్లు హసీబుల్లా, మెహ్రాన్, కమ్రాన్ గుహ్లామ్‌లను తీసుకుంది.

25,300 ఎగువన బుల్లిష్

(అక్టోబరు 14-18 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో

నిఫ్టీ గత వారం 26,234-24,494 పాయింట్ల మధ్యన కదలాడి 50 పాయింట్లు (0.2%) నష్టపోయి 24,964 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 25,300
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,550
నిరోధ స్థాయిలు: 25,175, 25,275, 25,375 (25,075 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,750, 24,650, 24,550

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	133
కర్నూలు	126	నెల్లూరు	133
విశాఖపట్నం	125	అనంతపురం	133
గోదావరి	135		

15 నిమిషాల్లో ఎంఎస్ఎంఈలకు రుణాలు

ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: ఎంఎస్ఎంఈ రుణాలపై మరింత దృష్టి పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భావిస్తోంది. ఇందుకోసం వారి రుణ దరఖాస్తుల ఆమోద ప్రక్రియను మరింత త్వరితం చేస్తోంది. ఎంఎస్ఎంఈల యజమానులు తమ ఎంఎస్ఎంఈల బ్రాంచీలకు వెళ్లి..వారి పాన్ నంబరు, జీఎస్‌టీ డేటా వివరాలు అందిస్తే 15 నుంచి 45 నిమిషాల్లో వారి రుణ దరఖాస్తులు పరిశీలించి ఆమోదిస్తామని ఎస్‌బీఐ చెర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు. దీనికి తోడు ప్రస్తుతం వీరికి ఉన్న రూ.5 కోట్ల రుణ పరిమితిని మరింత పెంచే విషయాన్నీ పరిశీలిస్తున్నట్టు శెట్టి తెలిపారు.

హెచ్ఏఎల్ ఇక 'మహారత్న' కంపెనీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు 'మహారత్న' హోదా లభించింది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ)ల్లో ఈ హోదా పొందిన సంస్థల్లో హెచ్ఏఎల్ 14వది. ఆరు నిర్దీత ప్రామాణికాలను పూర్తి చేసిన సీపీఎస్‌యూలకు కేంద్ర ప్రభుత్వం ఈ హోదా ఇస్తుంది. ఈ హోదాతో హెచ్ఏఎల్‌కు ఆర్థిక, వ్యూహాత్మక నిర్ణయాల్లో మరింత స్వేచ్ఛ లభించనుంది.

ఏడు నగరాల్లో రిటైల్ లోన్ ప్రాసెసింగ్ కేంద్రాలు: ఐఓబీ

చెన్నై: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) తన రిటైల్ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హైదరాబాద్, ముంబై, చెన్నైతో సహా ఏడు ప్రధాన నగరాల్లో రిటైల్ లోన్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రిటైల్ రుణాల దరఖాస్తులను డిజిటల్ టూల్స్ సాయంతో మదింపు చేసి వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేస్తారు.

విమాన ప్రయాణికులకు దీపావళి ధమాకా

25% తగ్గిన విమాన టికెట్ ధరలు



న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు ఈ సంవత్సరం ముందే దీపావళి పండగ వచ్చింది. ప్రధాన దేశీయ రూట్లలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విమాన టికెట్ల ధరలు సగటున 20 నుంచి 25 శాతం వరకు తగ్గాయి. ఈ నెల 28 నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు ప్రయాణించే ఉద్దేశంతో నెల రోజుల ముందే టికెట్లు బుక్ చేసుకున్న విమాన ప్రయాణికుల బుకింగ్స్ ఆధారంగా ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ 'ఇక్సిగో' ఈ విషయం తెలిపింది. అందుబాటులో ఉండే విమాన సీట్ల సంఖ్య పెరగడం, చమురు ధర తగ్గడంతో విమానయాన సంస్థలపై ఇంధన చార్జీలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ఆ సంస్థ పేర్కొంది. అయితే అహ్మదాబాద్-ఢిల్లీ, ముంబై-డెహ్రాడూన్, మార్గాల్లో మాత్రం విమాన చార్జీలు గత ఏడాది పండగల సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 33 నుంచి 34 శాతం పెరిగాయి.

38 శాతం వరకు తగ్గుదల: గత ఏడాది నవంబరు 10-16 మధ్య కాలంతో పోలిస్తే ఈ ఏడాది అక్టోబరు 28-నవంబరు 3వ తేదీ మధ్య కాలంలో ప్రధాన నగరాల మధ్య విమాన టికెట్ చార్జీలు సగటున 20 నుంచి 25 శాతం తగ్గాయి. బెంగళూరు-కోల్‌కతా మార్గంలో మాత్రం మిగతా ఏ మార్గంలో లేనంతగా రూ.10,195 నుంచి రూ.6,319కి (38 శాతం) తగ్గాయి. చెన్నై-కోల్‌కతా మార్గంలో 36 శాతం, ముంబై-ఢిల్లీ, ఢిల్లీ-ఉదయ్‌పూర్ మార్గాల్లో 34 శాతం చొప్పున, ఢిల్లీ-కోల్‌కతా, హైదరాబాద్-ఢిల్లీ, ఢిల్లీ-శ్రీనగర్ మార్గాల్లో 32 శాతం చొప్పున టికెట్ల ధరలు తగ్గినట్టు ఇక్సిగో తెలిపింది.

బంధన్ ఎంఎఫ్ నుంచి రెండు కొత్త ఫండ్స్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. రెండు కొత్త ఫండ్స్‌ను తీసుకువచ్చింది. బంధన్ నిఫ్టీ 500 వాల్యూ ఇండెక్స్ ఫండ్, బంధన్ నిఫ్టీ 500 మూమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్ పేరుతో వీటిని ప్రారంభించింది. ఈ రెండు ఫండ్స్ ఈ నెల 14న ప్రారంభమై 24న ముగియనున్నాయి. ఈ ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడు (సిప్)ల రూపంలో కనీసం రూ.100 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది.

మోతీలాల్ ఓస్వాల్ డిజిటల్ ఇండియా ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మ్యూచువల్ ఫండ్.. డిజిటల్ ఇండియా ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మంచి రిటర్నులు అందించే విధంగా డిజిటల్ విభాగం, టెక్నాలజీ, టెలికాం, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 25.

బిజినెస్

విప్రో బోనస్ ఇష్యూ!

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో.. వాటాదారులకు త్వరలో శుభవార్త చెప్పే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నెల 16-17 తేదీల్లో జరిగే భేటీలో డైరెక్టర్ల బోర్డు బోనస్ షేర్లు జారీ చేసే విషయాన్ని పరిశీలిస్తుందని కంపెనీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సెబీ నిబంధనలు, కంపెనీల చట్టం, 2013కు అనుగుణంగా ఈ నిర్ణయం ఉంటుందని పేర్కొంది. ఈ నెల 17న కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. దీంతో ఈ వారం విప్రో కంపెనీ షేర్లు చురుగ్గా ట్రేడవుతాయని భావిస్తున్నారు.

ఏపీలో మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు

ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: పైప్‌లైన్లతో అనుసంధానం లేని సహజ వాయువు క్షేత్రాల వద్ద మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం వద్ద రెండు మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కొద్ది మొత్తంలో మాత్రమే సహజ వాయువు ఉత్పత్తి చేస్తూ, పైప్‌లైన్లతో అనుసంధానత లేని చోట్ల ఓఎన్‌జీసీ ఈ మినీ ప్లాంట్లను తలపెట్టింది. ఈ ప్లాంట్లలో ఈ గ్యాస్‌ను ఎల్ఎన్‌జీగా మార్చి ట్యాంకర్లలో వినియోగ ప్రాంతాలకు లేదా గ్యాస్ పైప్‌లైన్లు ఉన్న ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

టెక్ వ్యూ: 25,000 ఎగువన నిలదొక్కుకుంటేనే..



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం కీలక స్థాయిలైన 25,000 దిగువకు పడిపోయి డౌన్‌ట్రెండ్‌ను సూచించింది. మంగళవారం ఈ స్థాయిలకు చేరుకున్నప్పటికీ నిలదొక్కుకోలేకపోయింది. అంతకుముందు వారంతో పోల్చితే మొత్తంగా గత వారం నిఫ్టీ 50 పాయింట్లు నష్టపోయి 24,964 స్థాయిల వద్ద క్లోజైంది. వారమంతా నష్టాల్లో సాగిన నిఫ్టీ చివరకు ఎలాంటి సానుకూల సంకేతాలను వెలువరించలేదు. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ మాత్రం వారం కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకుని చివరకు 740 పాయింట్ల లాభంతో 59,200 వద్ద క్లోజైంది. మరోవైపు స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా వీక్లీ ప్రాతిపదికన 250 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ గత వారం 24,800 స్థాయిల వద్ద మైనర్ మద్దతు కోసం ప్రయత్నించింది. కాగా సానుకూల సంకేతాల కోసం మరికొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ ఈ స్థాయిల వద్ద పటిష్ఠతను కనబరచాల్సి ఉంటుంది. పాజిటివ్ ట్రెండ్ కోసం 25,000 ఎగువన నిలదొక్కుకోవాలి.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయిలైన 25,200 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,250. గత కొద్ది రోజులుగా నిఫ్టీ 25,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటూ వస్తోంది. సానుకూల సంకేతాల కోసం వచ్చే కొద్ది రోజులు ఈ స్థాయిలకు ఎగువన తప్పనిసరిగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయిలైన 25,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకుని తీరాలి. ఒకవేళ నిలదొక్కుకోలేకపోతే మరింత అప్రమత్తతను సూచిస్తుంది. తదుపరి మద్దతు స్థాయి 24,800. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేని పక్షంలో తదుపరి మద్దతు స్థాయిలు 24,650, 24,450 దిగువన ఉంటాయి. ఇవి గతంలో ఏర్పడిన బాటమ్ స్థాయిలు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా తొలుత 50,200 స్థాయికి పడిపోయింది. చివరకు 290 పాయింట్ల నష్టంతో 51,170 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయి అయిన 51,600 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే 50,500 వద్ద మద్దతు స్థాయిలుంటాయి. తదుపరి మద్దతు స్థాయి 49,800.

పాటర్న్: వీక్లీ చార్టుల ప్రకారం 24,800 స్థాయిల వద్ద డబుల్ బాటమ్ ప్యాట్రన్ ఏర్పడింది. నిఫ్టీ ప్రస్తుతం 50 రోజుల చలన సగటు వద్ద పరీక్షను ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం కొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవాలి. 25,100 వద్ద సమాంతరంగా దిగువకు నిరోధ ట్రెండ్‌లైన్ ఏర్పడింది. సానుకూల సంకేతాల కోసం ఇక్కడ నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,100, 25,155
మద్దతు	25,000, 24,940

కార్పొరేట్ ఫలితాలు, ద్రవ్యోల్బణమే కీలకం!

పశ్చిమాసియాలో యుద్ధం, అమెరికా ఆర్థిక వ్యవస్థ గణాంకాలు, దేశీయ కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణ డేటా నేపథ్యంలో మదుపరులు ఈ వారం మరింత అప్రమత్తంగా ఉండటం మంచిది. గత వారం విశ్రమంగా కదలాడిన సూచీలు ఈ వారం క్రూడాయిల్ ధరలు, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఆటుపోట్లకు గురయ్యే అవకాశాలున్నాయి. నిఫ్టీకి ఈ వారం 25,000 వద్ద మద్దతు, 25.150 వద్ద నిరోధ స్థాయిలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

గ్రాన్యూల్స్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 20 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కీలక మద్దతు శ్రేణిలో కదలాడుతున్నాయి. మెరుగైన ఆర్థిక ఫలితాలు వెలువరించ వచ్చన్న అంచనాలతో కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 4.4 శాతం లాభంతో రూ.603 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.586 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందవేర్: ఏడాదిన్నర కాలంగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయిల వద్ద కదలాడుతోంది. సాధారణంగా ఈ స్థాయి నుంచి ట్రెండ్ రివర్సల్ జరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం 7.4 శాతం లాభంతో రూ.323 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.320 వద్ద పొజిషన్ తీసుకుని రూ.375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే అవకాశాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.300 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత కరెక్షన్‌కు గురయింది. ప్రస్తుతం కీలక మద్దతు శ్రేణిలో షేరు కదలాడుతోంది. ఈపీఎస్ పెరుగుతుండటం, రాబోయే త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉండటంతో చక్కని డెలివరీ వాల్యూమ్‌తో ఈ షేరు బలం పుంజుకుంది. గత శుక్రవారం 3.58 శాతం లాభంతో రూ.530 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.500 వద్ద పొజిషన్ తీసుకుని రూ.580 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.470 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏంజెల్‌వన్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. దాదాపు 47 శాతం మేరకు కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. ట్రెండ్ రివర్సల్ జరిగింది. రిస్క్ రివార్డ్ రేషియో బాగుంది. గత శుక్రవారం ఈ షేరు 3.7 శాతం లాభంతో రూ.2,703 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.2,650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,780/2,825 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నేషనల్ అల్యూమినియం (నాల్కో): ఈ మధ్యనే జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసిన ఈ షేరు మంచి బలంతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం కీలకమైన నిరోధ స్థాయి రూ.208 ఎగువన నిలదొక్కుకుంది. చైనాలో ఉద్దీపన పథకం ప్రకటించటంతో మెటల్ షేర్లకు గిరాకీ పెరిగింది. గత శుక్రవారం రూ.4.80 శాతం లాభంతో రూ.222 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.218/215 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.245/275 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఉన్నట్టేనా?

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాన్ని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసినా.. దీనిని నోటిఫై చేస్తూ ఇంతవరకు ప్రకటన ఇవ్వలేదు. దీంతో విచారణలు కూడా జరగకపోవడంతో 40కిపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ట్రైబ్యునల్ ఇచ్చే ఆదేశాల కోసం సంబంధిత ప్రాజెక్టుల నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. గతంలో వ్యాట్ ట్రైబ్యునల్ ద్వారా రెరా ప్రాంగణంలోనే కొన్ని కేసులు పరిష్కారమయ్యేవి. అప్పిలేట్ ట్రైబ్యునల్ ఏర్పాటయ్యాక వ్యాట్ ట్రైబ్యునల్ విచారణ ఆగిపోయింది. వ్యాట్ ట్రైబ్యునల్‌లో ఉన్న 28 కేసులు, అప్పిలేట్ ట్రైబ్యునల్ ఏర్పాటయ్యాక వచ్చిన 12 కేసులు కలిపి మొత్తం 40 వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

సిబ్బంది కొరత వల్లనే జాప్యం..

సిబ్బంది కేటాయింపులు లేకపోవడం వల్లే అప్పిలేట్ ట్రైబ్యునల్ విచారణలు ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. ట్రైబ్యునల్‌కు సంబంధించి 33 మంది సిబ్బంది కావాలని ప్రభుత్వానికి రెరా ప్రతిపాదించింది. రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, పరిపాలనా అధికారి(ఏవో), ఫైనాన్స్ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ టెక్నికల్, అసిస్టెంట్ అకౌంట్ అధికారి, ఐటీ మేనేజర్, సూపరింటెండెంట్, లైబ్రేరియన్, సీనియర్ స్టెనోగ్రాఫర్, లీగల్ ఎగ్జిక్యూటివ్, లా క్లర్క్, జ్యుడీషియల్ సభ్యుడికి పీఎస్, జూనియర్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి పోస్టులను భర్తీ చేయాలని రెరా కోరింది. దీనిపై ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడకపోవడం, అధికారికంగా సిబ్బంది కేటాయింపులు లేకపోవడం వల్ల అప్పిలేట్ ట్రైబ్యునల్ తన విచారణలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. సిబ్బంది కేటాయింపులు జరిగిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి విచారణలు ప్రారంభించే అవకాశం ఉంది. అయితే ఇందు కోసం ఎంత సమయం పడుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొనడంతో అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు వెళ్లిన వారికి సుదీర్ఘ నిరీక్షణ తప్పడం లేదు.

కొత్త అల్లుడికి 66 వంటకాలతో భోజనం!



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వంశీకి వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మారావుపేటకు చెందిన శ్వేతతో ఆగస్టు 28న పెళ్లి జరిగింది. ఆచార సంప్రదాయాల ప్రకారం వివాహమయ్యాక వచ్చే తొలి దసరా, ఉగాది పండగలను చేదు పండుగలుగా భావించి, అత్తింటివారు కొత్త అల్లుడిని ఇంటికి తీసుకరారు. మహబూబాబాద్ జిలా బయ్యారంలో ఉంటు న్న శ్వేత పిన్ని, బాబాయి గరిపెల్లి లావణ్య-వేణు కుటుంబం కొత్త దంపతులను దసరాకు ఆహ్వానించారు. ఏకంగా 66 రకాల వంటకాలతో విందు భోజ నం ఏర్పాటు చేశారు. వేణు కుటుంబం స్వరాష్ట్రంలో ఇలా నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టి కొత్త అల్లుడికి విందు భోజనం ఏర్పాటు చేసిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

- బయ్యారం (మహబూబాబాద్ జిల్లా)

తెలంగాణలో కులగణన
కాంగ్రెస్ నిబద్ధతకు నిదర్శనం: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులగణన ప్రక్రియ అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఆ పార్టీ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరిపించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన విషయాన్ని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన గుర్తు చేశారు. దేశంలోని ప్రతిఒక్కరికీ సమానంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దక్కాలంటే కులగణన అవసరమని, ఇది కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేయగలిగినప్పుడు కేంద్రంలో ప్రధాని మోదీ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

సమీకృత గురుకులాల స్థాపన చరిత్రాత్మకం

» రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

హైదరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణాలను చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం మాట తప్పిందని, గత పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఆరోపించారు. విద్యాశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో 21,292 కోట్లు కేటాయించిందన్నారు.

పదేళ్లు పాశవిక పాలన: నూతి శ్రీకాంత్ గౌడ్

రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్ పాశవిక పాలన కొనసాగించిందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతిశ్రీకాంత్ గౌడ్ అన్నారు. పదేళ్లలో ఆగిపోయిన అభివృద్ధి, నిర్లక్ష్య ధోరణికి సీఎం రేవంత్‌రెడ్డి చరమగీతం పాడారని చెప్పారు.

రేవంత్ నిశ్శబ్ద విప్లవ నాయకుడు:మల్లు రవి

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నిశ్శబ్ద విప్లవ నాయకుడని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. తమిళనాడులో కరుణానిధిని, జయలలితను విప్లవ నాయకులు అని అంటారని ఆయన గుర్తు చేశారు. నెహ్రూ శాస్త్రీయ ఆలోచనలను దెబ్బకొట్టాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ప్రక్షాళన, ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ చేయడం సాధ్యంకాదని తమకు తెలుసన్నారు. హైడ్రా, మూసీ వల్ల ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులు ఉన్నా.. లక్షలాది మందికి లాభం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను అభివృద్ధి చేయడం కోసం రేయింబవళ్లు కష్టపడుతున్నారని, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలబెట్టాలని కంకణం కట్టుకున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, పదేళ్లలో 5 వేల పాఠశాలలు మూతపడ్డాయన్నారు. రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

ఆ సిమెంట్ పరిశ్రమ అనుమతి రద్దు చేయాలి

» భువనగిరి ఎంపీకి వినతి పత్రం

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలుష్య సమస్యలు సృష్టించే అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ స్థానిక ప్రజలు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రామన్నపేట మండలంలో అదానీ అంబుజా సిమెంటు కంపెనీ ఏర్పాటును రద్దు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు వినతిపత్రంలో కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రం కొమ్మాయిగూడెంలో రెండు సంవత్సరాల క్రితం లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేస్తామని రైతులను నమ్మించి సుమారు 350 ఎకరాలకు పైగా భూములను కొనుగోలు చేశారని, తాజాగా అదానీ అంబుజా సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు వారు పేర్కొన్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైన పక్షంలో పలు గ్రామాల ప్రజలు కాలుష్య సమస్యలకు గురి కావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి కాలుష్య కారక పరిశ్రమకు అనుమతులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీకి సమర్పించిన వినతి పత్రంలో కోరారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమ, మంగళవారాలు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

అలయ్ బలయ్‌తోనే రాజకీయ జేఏసీ

తెలంగాణ సాధనకు ఈ కార్యక్రమమే స్ఫూర్తి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- » దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మికి అభినందనలు
- » సనాతన ధర్మంలో నేను ఉండదు.. మనం ఉంటుంది: వెంకయ్య
- » తెలుగు రాష్ట్రాల సీఎంలు కలిసి పనిచేయాలి: దత్తాత్రేయ
- » రాజకీయాలంటే అసహ్యించుకునేలా విమర్శలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- » సీఎం సెక్యూరిటీ సిబ్బంది హత్యా యత్నం చేశారు: మాడభూషి శ్రీధర్



అలయ్‌బలయ్‌లో డప్పు కొడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్/సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధన ఆలస్యమవుతోందని భావించిన తరుణంలో రాజకీయ జేఏసీ ఆవిర్భవించిందని.. దాని ఏర్పాటుకు స్ఫూర్తి అలయ్ బలయ్ కార్యక్రమమేనని చెప్పారు. ఆ జేఏసీ ఫలితంగా ఆరెస్సెస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ వరకు.. అన్ని వర్గాలు కార్యోన్ముఖులయ్యాయని వివరించారు. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండగ అయిన దసరా అనగానే పాలపిట్ట, జమ్మిచెట్టు గుర్తుకు వచ్చినట్లుగానే అలయ్ బలయ్ అనగానే బండారు దత్తాత్రేయ గుర్తుకొస్తారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. అందుకే ప్రభుత్వం తరఫున, కాంగ్రెస్ తరఫున తాను, మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారని రేవంత్ అన్నారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి రేవంత్ హాజరయ్యారు. అలయ్ బలయ్ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి అధ్యక్షతన కొనసాగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్, రాజస్థాన్, మేఘాలయ గవర్నర్లు, వివిధ పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఉద్యమం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ పార్టీలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకోగా.. దత్తాత్రేయ అలయ్ బలయ్‌తోనే జెండాలకు, అజెండాలకు అతీతంగా రాజకీయ జేఏసీ ఏర్పడిందని చెప్పారు. దత్తాత్రేయ వారసురాలిగా అలయ్ బలయ్‌ని నిర్వహిస్తున్న విజయలక్ష్మిని రేవంత్ అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి ఎంతో ఉన్నతమైందని కొనియాడారు. సమాజంలో సమైక్యతా వారధుల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించి, ఆ దిశగా కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పండగలకు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ప్రాముఖ్యత కూడా ఉందన్నారు. సనాతన ధర్మంలో నేను, నాది అన్నది లేదని.. మనది, మనందరిది అని ఉంటుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు కలిసి మెలిసి పనిచేయాలని, రెండు రాష్ట్రాలను దేశంలో నంబర్ వన్‌గా నిలపాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆకాంక్షించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం అని ప్రశంసించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అలయ్ బలయ్ గొప్ప కార్యక్రమం అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు విమర్శలు చేసుకోవచ్చు కానీ, ఎన్నికల తర్వాత పేదల సంక్షేమం, అభివృద్ధిపైనే దృష్టిపెట్టాలని చెప్పారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో అది లోపించిందని, నోటితో చెప్పలేని విధంగా పార్టీలు విమర్శలు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలంటే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దత్తాత్రేయ పేరు వినగానే హోళీ, అలయ్ బలయ్ గుర్తుకొస్తాయని.. దత్తాత్రేయ హోళీ ఆడితే 3 నెలలపాటు రంగు పోదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మి

సీఎం వచ్చిన సందర్భంలో తోపులాట

సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన సమయంలో తోపులాట జరిగింది. సీఎంను వేదిక వద్దకు తీసుకెళ్లేందుకు సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేకంగా రోప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సీఎంను కలిసేందుకు అభిమానులు ముందుకు రావడంతో పోలీసులు, వెంట ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అడ్డు వచ్చిన వారిని తోసేశారు. కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్‌ను గొంతు పట్టేసి నెట్టేశారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిని బూటు కాళ్లతో తొక్కడంతో గాయమైంది. సెక్యూరిటీ సిబ్బంది వల్ల తీవ్రంగా ఇబ్బంది పడ్డ శ్రీధర్, యాదగిరి.. 'సెక్యూరిటీ అంటే చంపడమా?' అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన గొంతును నొక్కేశారని శ్రీధర్ వాపోతే, తన కాలును తొక్కేశారని, మందులు వాడాల్సిన పరిస్థితి ఎదురైందని యాదగిరి వెల్లడించారు. బండారు దత్తాత్రేయ స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించడం వల్ల తాము ఈ కార్యక్రమానికి వెళ్లామని, ఇది సీఎం సెక్యూరిటీ సిబ్బంది చేసిన హత్యాప్రయత్నమేనని ఆరోపించారు. 'సీఎం చుట్టూ ఉన్నవారు చంపేయడానికి సిద్ధమై ఉంటే, మా గతి ఏమిటి? ఉరి తీసినట్లయింది. ఒక దశలో చనిపోతాననే భయం వేసింది' అని శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. మమ్మల్ని పక్కకు వెళ్లమని చెప్పి, వారు ముఖ్యమంత్రికి కాపలాగా ఉండొచ్చని, ఆ ఇంగితం లేకపోతే వారు రక్షకులా, రజాకార్లా, కిరాయి గూండాలా? అని దుయ్యబట్టారు. 'నా ప్రాణం పోతే ముఖ్యమంత్రిగారు బాధ్యత తీసుకుంటారా? ఒకవేళ చస్తే మీరు ఏం చేస్తారు? సంతాపం తెలియజేస్తారా? నా కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇస్తే చాలా?' అని మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి గారూ మీరు వేదికపైకి వచ్చే ముందు జనాన్ని చంపేయకండి' అని విన్నవించారు. దత్తాత్రేయకు సైతం పలు సూచనలు చేశారు. 'అలయ్ బలయ్ పేరుతో అందరినీ ఇబ్బంది పెట్టే బదులు తిండి లేని వారికి అన్నదానం చేయండి. ఇంకేం వద్దు. చిన్న తప్పుగా తీసి పడేయకండి' అని సూచించారు.

నోరూరించిన వంటలు

అలయ్ బలయ్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వంటలు అతిథులకు నోరూరించాయి. ప్రత్యేకంగా తెలంగాణ వంటకాలతో పాటు ఉత్తరాది వంటకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చిన ముఖ్యఅతిథులకు విజయలక్ష్మి స్వయంగా వడ్డించారు.

కలుషిత నీరు తాగి 50 మందికి అస్వస్థత

» ఆస్పత్రిలో ఇద్దరి మృతిపై భిన్నవాదనలు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 13: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషితనీరు తాగి శనివారం సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు ఆస్పత్రిలో మృతి చెందగా కలుషిత నీటి వల్లే వారు చనిపోయారని గ్రామస్థులు అంటున్నారు. వైద్యాధికారులు మాత్రం వారి మృతికి కలుషిత నీరు కారణం కాదంటున్నారు. సంజీవన్‌రావుపేటలో తాగునీటి సరఫరాకు మూడు ట్యాంకులుండగా రెండింటికి మిషన్ భగీరథ కనెక్షన్ ఉంది. పాత ట్యాంక్‌కు బావి నుంచి కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేస్తారు. ఈ ట్యాంకు నుంచి రెండు బీసీ కాలనీలకు నీరు సరఫరా అవుతోంది. అయితే ఈ కాలనీల వారు శనివారం ఒక్కసారిగా అస్వస్థత గురయ్యారు. వారు నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రితోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీవో అశోక్ చక్రవర్తి గ్రామానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. బావిని ఖాళీ చేయించి క్లోరినేషన్ తర్వాత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మరోవైపు వైద్యాధికారులు గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోసంధ్యారాణి ఖేడ్ ఆస్పత్రిలో, గ్రామంలోని వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఆదివారం కూడా వైద్య శిబిరం కొనసాగింది. వైద్య శిబిరంలో 70 మందికి వైద్యం అందించారు. శనివారం సంగారెడ్డి ఆస్పత్రికి ఐదుగురిని, ఆదివారం నలుగురిని ఖేడ్ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. పలువురు గ్రామస్థులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా సంజీవన్‌రావుపేటకు చెందిన బోడి మహేష్(23) శుక్రవారం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురి కాగా సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అక్కడ అతను మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాయికాడి సాయమ్మ(86) కూడా వాంతులు, విరేచనాలతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. వీరి మృతికి కలుషిత నీరే కారణమని గ్రామస్థులు అంటున్నారు. అయితే మహేష్ చికిత్స పొంది కోలుకున్న అనంతరం కడుపునొప్పితో, సాయమ్మ వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు డీఎంహెచ్‌వో గాయత్రీదేవి తెలిపారు.

ప్రైవేటులో ఆయుష్మాన్ భారత్ అందని ద్రాక్షే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు నో చెప్పారు. దీంతో, ఆసక్తి ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తమ వద్ద అమలు చేయలేకపోయాయి. కాగా.. హైదరాబాద్ నగరంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, వలస వచ్చిన వారు పెద్దసంఖ్యలో ఉన్నారు. వారికి ఇక్కడ ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఆయుష్మాన్ భారత్ ఒక వరంలా మారింది. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో తప్ప ప్రైవేటులో ఈ కార్డు కింద చికిత్స అందటం లేదన్న విషయాన్ని కొందరు లబ్ధిదారులు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. కేంద్రం ఆదేశాల మేరకు.. హైదరాబాద్‌లో ఆయుష్మాన్ భారత్‌లో నమోదైన ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇతర రాష్ట్రాల వారికి చికిత్సలు అందించే వెసులుబాటును నాటి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర ప్రజలకు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు.

85 లక్షల కుటుంబాలకు ఆరోగ్య సేవలు

ప్రస్తుతం రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి అమలు చేస్తున్నారు. మొత్తం 85 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. అందులో కేంద్రం మార్గదర్శకాల మేరకు ఆయుష్మాన్ భారత్ కింద 26 లక్షల కుటుంబాలను గుర్తించారు. ఆరోగ్యశ్రీ కింద ఒక కుటుంబానికి ఏడాదికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలందిస్తుండగా, ఆయుష్మాన్ కింద రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారు. 1042 ప్రభుత్వ, 368 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాలు అమలవుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద ఉన్నాయి. రెండింట్లోనూ అత్యధికం ఒకే రకమైనవి. ఆరోగ్యశ్రీలో లేని కొన్ని చికిత్సలు ఆయుష్మాన్ భారత్‌లో ఉన్నాయి. కానీ, ఆయుష్మాన్ భారత్ ప్రైవేటు ఆస్పత్రుల్లో అందుబాటులో లేకపోవటంతో.. దానిని ఉపయోగించుకునే వీలు రాష్ట్ర ప్రజలకు లేకుండా పోతోంది.

70 దాటిన వారి పరిస్థితి ఏమిటో?..

70 ఏళ్లు దాటిన వయో వృద్ధులందరికీ ఆదాయంతో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకానికి రాష్ట్రంలో 10 లక్షల మంది అర్హత కలిగి ఉంటారని అంచనా. అయితే, వారు సదరు బీమా పథకానికి అర్హులైనా.. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే (ఆయుష్మాన్ భారత్ అమలు కాని కారణంగా..) చికిత్స చేయించుకునే పరిస్థితి ప్రస్తుతం లేదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతుంటాయి. కాబట్టి, ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ తెలంగాణ వాసులకు వర్తింపజేస్తూ అమలు చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయుష్మాన్‌కార్డు గుర్తింపు కార్డు కోసం లబ్ధిదారులు ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై వెబ్‌సైట్‌లో ఆధార్ లేదా రేషన్ కార్డును వెరిఫై చేసుకోవాలి. కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరచాలి. అనంతరం ఏబీ-పీఎంజేఏవై ఐడీ ఈ-కార్డ్‌ను ప్రింటవుట్ తీసుకోవచ్చని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

రవాణాశాఖలో కార్డుల్లేవ్!

(మొదటి పేజీ తరువాయి)

పడుతున్నారు. ఏటా స్మార్ట్ కార్డుల సరఫరా బాధ్యతలను టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీలకు అప్పగిస్తారు. గత కాంట్రాక్ట్ గడువు ఆగస్టుతో ముగిసినట్లు అధికారులు చెబుతున్నారు. అయినా ఇప్పటికీ కొత్త ఏజెన్సీని ఎంపిక చేయలేదు. టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష కార్డులు..

రవాణా శాఖలో రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల తీరును బట్టి ఎన్ని కార్డులు కావాలన్నది కాంట్రాక్టు ఏజెన్సీకి తెలియజేస్తారు. అవసరాన్ని బట్టి అదనపు కార్డులూ సరఫరా చేయాలని కోరతారు. ఒక్కో కార్డుకు ఏజెన్సీకి రూ.27 చెల్లిస్తుంటారు. రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, రెన్యువల్ కోసం ఏటా 25 లక్షల కార్డులు రవాణా శాఖకు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఇందులో లక్ష నుంచి 12 లక్షల కార్డులు జీహెచ్ఎంసీ పరిధిలో వినియోగిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు ఒక్కో వినియోగదారుడి నుంచి రూ.1035 తీసుకుంటున్నారు. ఇందులో స్మార్ట్ కార్డు రూ.200, పోస్టల్ చార్జీ రూ.35, దరఖాస్తుకు రూ.200, టెస్ట్ ఫీ పేరిట రూ.300, సర్వీస్ చార్జీ రూ.300 వసూలు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి సర్వీస్ చార్జీ వసూలు చేస్తున్న రవాణా శాఖ.. ఆ మేరకు సేవలు అందించడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతోంది.



వాహనదారుల ఇబ్బందులు..

రిజిస్ట్రేషన్ అయిన 24 గంటల్లో యాప్ నుంచి కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సాంకేతిక వినియోగంపై అవగాహన లేని వాహనదారులకు మాత్రం ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అవస్థలు తప్పడం లేదు. రశీదు చూపించినప్పటికీ ఇన్ని రోజులైనా కార్డు ఎందుకు తీసుకోలేదు? ఒరిజినల్ ఆర్సీ చూపించాల్సిందే.. అని వాహనదారులతో పోలీసులు వాగ్వాదానికి దిగుతున్నారు. గ్రేటర్‌లోని ఆర్టీఏ కార్యాలయాల్లో రోజూ సగటున 2 వేలకు పైగా వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఈ లెక్కన గత రెండు, మూడు వారాలుగా దాదాపు లక్ష వరకు కార్డులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అధునాతన సాంకేతికతతో స్మార్ట్ కార్డుల విధానం అందుబాటులోకి తీసుకొచ్చినా.. రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పౌర సేవలు పారదర్శకంగా అందడం లేదు. పలు కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల జారీలోనూ జాప్యం జరుగుతోంది. రవాణా శాఖ రోజూ 3000-3500 వరకు డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేస్తోంది. కార్డుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఇంకా సరఫరా కాలేదని ఓ అధికారి తెలిపారు. టెండర్ ప్రక్రియ జరుగుతోందని.. త్వరలో 3 లక్షల కార్డులు అందుబాటులోకి వస్తాయని రవాణా శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

> కార్డులు లేవు.. వాహనాల ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడానికి మరో రెండు, మూడు వారాలు పడుతుంది. అంతకంటే ఎక్కువ కూడా పట్టొచ్చు
>
> - ఇదీ వాహనదారులకు రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది సమాధానం



కొండారెడ్డిపల్లిలో జమ్మి చెట్టుకు మనవడు రేయాన్ష్‌తో కలిసి పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొండారెడ్డిపల్లిలో సీఎం దసరా సంబరాలు

కుటుంబసభ్యులతో కలిసి జమ్మిచెట్టుకు పూజలు

నాగర్‌కర్నూల్/వంగూరు/కొడంగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో దసరా సంబరాలు జరుపుకొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన.. పండగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం 12:44 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎంకు గ్రామస్థులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో హాజరైన మహిళలు బతుకమ్మలతో సాదరంగా ఆహ్వానించారు. కోలాటం, యక్షగానాలు, పూర్ణకుంభంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘనమైన స్వాగతం లభించింది. హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో నూతన గ్రామపంచాయతీ భవన ప్రాంగణానికి చేరుకున్న ఆయన సోలార్ పైలట్ ప్రాజెక్టు, గ్రంథాలయం, బీసీ కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తన ఇంటికి చేరుకున్నారు. కుమార్తె నైమిషారెడ్డి ఆయనకు హారతి పట్టారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో సతీమణి గీత, కుటుంబ సభ్యులతో కలిసి జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఇంటికి చేరుకుని అక్కడున్న అభిమానులు, గ్రామస్థులను పలకరించిన తర్వాత 8:30 గంటల సమయంలో రోడ్డు మార్గంలో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు బయల్దేరి వెళ్లారు. సీఎం వెంట ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి ఉన్నారు. కొడంగల్‌లో శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్‌లు సుధీర్, లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ సిక్తాపట్నాయక్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పూలమొక్కలు అందించి సీఎం రేవంత్‌కు స్వాగతం పలికారు.



తన నివాసంలో ఆయుధపూజ చేస్తున్న సీఎం రేవంత్

వక్కసాగుకు తెలంగాణ అనువైన ప్రాంతం

- నిపుణులతో చర్చించి సాగుపై నిర్ణయం:మంత్రి తుమ్మల
- ఏలూరు జిల్లా కామవరపుకోటలో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు 13 : వక్క పంట సాగుకు తెలంగాణ అనువైన ప్రాంతమని, నిపుణులతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పంట రైతన్నలకు సిరులు కురిపిస్తుందని, తెలంగాణలో సైతం సాగును ప్రోత్సహిస్తామన్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా కామవరపు కోటలో ఆదివారం వాణిజ్య పంట అయిన వక్క సాగును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పంట సాగు చేస్తున్న రైతులతో సాగు పద్ధతులు, ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో దీని విస్తరణ అవకాశాలపై నిపుణులతో చర్చించారు. వక్క సాగుకు అనుకూల నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి వినియోగం తదితర అంశాలపై నిపుణులతో చర్చించి సాగును ప్రోత్సహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

అందరికీ న్యాయం జరిగేందుకే కుల గణన:పొన్నం

హుస్నాబాద్, అక్టోబరు 13: రాష్ట్రంలోని ప్రతి పౌరునికి న్యాయం జరిగేందుకే కుల గణన నిర్వహిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పార. శనివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించి సర్వే చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే జీఓ 18 విడుదల చేసిందన్నారు. బీసీ కుల గణన పూర్తి అయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టులో వచ్చే వర్షాకాలంలోపు నీటిని నింపుతామని చెప్పారు.

దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ పోర్టల్:సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఈ ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. దీన్ని సోమవారంనాడు సచివాలయంలో మంత్రి సీతక్క ఆవిష్కరించనున్నారు. యూత్ ఫర్ జాబ్స్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రభుత్వం ఈ పోర్టల్‌ను నిర్వహించనుంది. సాధారణ లేదా ఉన్నత విద్య పూర్తిచేసిన దివ్యాంగుల వివరాలను ఇందులో నమోదు చేస్తారు. అదేవిధంగా పలు ప్రైవేటు కంపెనీలు, మల్టీ నేషనల్ కంపెనీలను కూడా పోర్టల్‌లో పొందుపర్చుతారు. దాంతో దివ్యాంగులు వారి అర్హతనుబట్టి నేరుగా పోర్టల్‌లో ఉన్న కంపెనీలో దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగుల రిజర్వేషన్ ప్రకారం వారికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. వివరాలు నమోదు చేసే వెబ్‌సైట్ ఇదే: :https://vikalan-gulajobportal.telan-gana.gov.in

వికలాంగుల కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తాం

- హరీశ్ అండతోనే మాజీ ఛైర్మన్ నిధుల దుర్వినియోగం
- విజిలెన్స్, ఏసీబీతో దర్యాప్తు చేయిస్తాం: ఛైర్మన్ వీరయ్య

హైదరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తామని ఛైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్‌తో దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వాసుదేవరెడ్డి తన కార్యాలయం కోసం వికలాంగుల పరికరాల కోసం వచ్చిన నిధుల్లో నుంచి రూ.28 లక్షలను ఖర్చు చేశారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ ప్రోద్బలంతో మాజీ ఛైర్మన్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఇటీవలే తాను ఆధారాలతో సహా బయటపెట్టానని చెప్పారు. కార్పొరేషన్‌లో 95% నిధులను దివ్యాంగులకు అవసరమైన పరికరాల కొనుగోలుకు, వికలాంగ నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయిస్తారని.. ఏ ఆడిట్ రిపోర్టులోను ఈ అంశాల కనీస ప్రస్తావన లేదని విమర్శించారు.

17 మంది క్షతగాత్రులను పట్టుకొని చంపేశారు!

- అబూజ్‌మడ్‌లో భద్రతా బలగాల ఊచకోత
- ఎన్‌కౌంటర్‌లో మరణించింది 35 మంది
- లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల, అక్టోబరు 13: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా బలగాలు ఎల్-ఫార్మేషన్‌లో దిగ్బంధిస్తూ తమ సహచరులను ఊచకోత కోశాయని మావోయిస్టులు ఆరోపించారు. ఈ నెల 4న జరిగిన ఎన్‌కౌంటర్ గురించి సంచలన విషయాలు వెల్లడించారు. నాటి ఎన్‌కౌంటర్‌లో 31 మంది మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ఎన్‌కౌంటర్‌లో 35 మంది చనిపోయారని లేఖలో పేర్కొన్నారు. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో ఆదివారం లేఖ విడుదలైంది. నారాయణపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దు తుల్తులి గ్రామ సమీపంలోని అడవుల్లో కాల్పులు జరిగినట్లు మావోయిస్టులు లేఖలో తెలిపారు. ఎల్-ఫార్మేషన్‌లో దిగ్బంధిస్తూ ఈ నెల 4న ఉదయం 11:30 నుంచి రాత్రి 9 గంటల వరకు మొత్తం 11 సార్లు భద్రతా బలగాలు తమపై కాల్పులు జరిపాయని వెల్లడించారు. ఈ కాల్పుల్లో మొత్తం 14 మంది మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారని, మరో 17 మంది గాయపడ్డారని తెలిపారు. ఆ 17 మంది క్షతగాత్రులను పట్టుకున్న భద్రతా బలగాలు మరుసటి రోజు(5వ తేదీ) ఉదయం 8 గంటలకు ఊచకోత కోశాయని సంచలన ఆరోపణలు చేశారు. పోలీసులు, డీఆర్‌జీ బలగాల ఊచకోతలో మొత్తం 35 మంది సహచరులు అమరులయ్యారని, ఈ ఘటనను అందరూ వ్యతిరేకించాలని లేఖలో పేర్కొన్నారు. చనిపోయిన 35 మంది మావోయిస్టుల పేర్లు, చిరునామాలను వివరించారు. ఘటన జరిగిన ప్రాంతాలను మేధావులు, మీడియా పరిశీలించాలని లేఖలో కోరారు. ఘటనపై న్యాయ విచారణ జరిగేలా, వాస్తవాలు బయటి ప్రపంచానికి తెలియజేసేలా పోరాటం చేయాలని సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధులను కోరారు.

పంజాబీ డ్రస్ వేసుకుందని భార్యను చంపిన భర్త

- కూరగాయల కత్తితో అతి కిరాతకంగా హత్య

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్య తన మాట వినకుండా పంజాబీ డ్రస్ వేసుకుందన్న ఆగ్రహంతో ఓ భర్త ఆమెను కిరాతకంగా హతమార్చాడు. కూరగాయలు కోసే కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన భార్యభర్తలు గుంజి వెంకటేశ్ (42), సోను (32) కొంతకాలంగా సరూర్‌నగర్‌లోని సరస్వతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పని చేస్తుండగా, సోను ఇళ్లలో పనిచేస్తోంది. వెంకటేశ్‌కు తన భార్య పంజాబీ డ్రస్ వేసుకోవడం ఇష్టం లేదు. ఈ విషయం గురించి పలుమార్లు భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సోను పంజాబీ డ్రస్ ధరించింది. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర కోపోద్రిక్తుడైన వెంకటేశ్ కూరగాయలు కోసే కత్తితో భార్యపై దాడి చేశాడు. వీపుపై, పొట్టలో బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో సోను అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని సోను మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పెనుగులాటలో గాయపడిన వెంకటేశ్‌కు చికిత్స అందించి అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ రహదారిపై వాహనాల వరద

టోల్ ప్లాజాల వద్ద భారీగా బారులు.. పంతంగి, కేతేపల్లి వద్ద కిక్కిరిసిన వాహనాలు

- హైదరాబాద్‌కు జనం తిరుగుపయనం
- దసరా పండుగ ముగియడంతో నగరానికి
- రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా దసరా పండుగ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

దసరా పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. శనివారం ఊరూరా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శమీ పూజలతోపాటు బొడ్రాయి, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి జమ్మిచెట్టును దర్శించుకున్నారు. జమ్మి ఆకును సేకరించి ఒకరికొకరు పంచుకొని అలయ్ బలయ్ తీసుకున్నారు. పాలపిట్టను తిలకించి పరవశించిపోయారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. కాగా, దసరా పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి ఏపీ రాష్ట్రంతోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి తిరిగి పయనమైన వాహనాలతో ఆదివారం రహదారులు కిక్కిరిసిపోయాయి. వివిధ టోల్ ప్లాజాల వద్ద వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. పలుటోల్ల అదనపు కౌంటర్ల ద్వారా పంపించినా.. వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉదయం నుంచే వాహనాల రాకపోకలు పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో, నల్లగొండ జిల్లా కేతేపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకుగాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహనాలను పంపించారు. సాధారణ రోజుల్లో 30 నుంచి 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండంగా దసరా పండుగ నేపథ్యంలో 50వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు.



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

గూడూరు వద్ద కిలోమీటరుపైగా..

బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద కిలోమీటరు పైగా వాహనాలు బారులు తీరాయి. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద వాహనాల సంఖ్యకు అనుగుణంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు అర కిలోమీటర్ మేర నాలుగు లేన్లతో బారులు తీరాయి. ఆదివారం 35 వేల నుంచి 40 వేల వాహనాలు రాకపోకలు సాగించాయని సిబ్బంది తెలిపారు. నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రాహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఆదివారం కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వాహనాలు నిలిచిపోయాయి.

ఖాళీగా హైదరాబాద్ రోడ్లు..

హైదరాబాద్ నగరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకప్రాయంగా ఉండే రోడ్లన్నీ గత రెండు రోజులుగా వెలవెలబోయాయి. పట్నం, పల్లెకు వెళ్లడంతో హ్యాంగవుట్ స్పాట్స్ సహా అన్నీ కళతప్పాయి. శనివారమంతా పండుగ సంబరంతో అలిసిన నగర జనం, ఆదివారం ఆ అలసట తీర్చుకోవడానికి ఎక్కువగా ఇళ్లకే పరిమితమయ్యారు. వరుస సెలవులతో ఏపీ, తెలంగాణకు పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలివెళ్లడంతో వారాంతంలో కూడా హోటళ్లు, రెస్టారెంట్లలో ఆక్యుపెన్సీ కూడా తగ్గింది. ఈ మధ్యకాలంలో నగరంలో ఇంత తక్కువ ట్రాఫిక్ రద్దీని తాము చూడలేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అయితే, తెలంగాణ జిల్లాల నుంచి సాయంత్రం బయలుదేరిన నగరవాసులు అర్ధరాత్రి తరువాత ఇంటికి చేరుకోవడం కనిపించింది.

దేవరకొండ ఆర్టీసీ డిపోకు రూ.35.86లక్షల ఆదాయం

దేవరకొండ: దసరా పండుగ సందర్భంగా దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు ఈ నెల 11న ఒక్క రోజే 51,750 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. ఆ రోజు మొత్తం 46,755 కిలోమీటర్ల దూరం ప్రయాణించాయి. తద్వారా ఈ డిపో 118.90 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. సాధారణ రోజుల్లో రోజుకు రూ.10లక్షల ఆదాయం సమకూరగా, ఈ నెల 11న డిపో ఆదాయం రూ.35.86 లక్షలు సమకూరిందని డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు.

వైభవంగా దసరా పండుగ

దసరా పండుగ సందర్భంగా వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట, రంగలీలా మైదానంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి హాజరై.. రిమోట్‌తో రావణ దహనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. హనుమకొండ పట్టణంలోని సిద్ధేశ్వర, పద్మాక్షి దేవాలయాల ప్రాంగణంలో రావణ వధ, విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ములుగులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క తన భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సహాయకులతో కలిసి వాహన, ఆయుధ పూజ, శమీ పూజ నిర్వహించారు. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం హిందూ ముస్లింలు సమష్టిగా దసరా వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తన స్వగ్రామమైన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శమీపూజ వైభవంగా నిర్వహించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో తుంగభద్ర పుష్కర్‌ఘాట్ వద్ద నదీ తీరంలో తెప్పోత్సవం నిర్వహించారు.

లక్ష్మీనృసింహుడికి లక్ష పుష్పార్చన..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రాలతో వివిధ రకాల పుష్పాలతో పాంచరాత్రాగమనరీతిలో లక్ష పుష్పార్చన చేపట్టారు. కాగా, దసరా సందర్భంగా వచ్చిన వారాంతపు సెలవు నేపథ్యంలో యాదగిరిగుట్ట కొండపై భక్తుల సందడి నెలకొంది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.29,30,290ల ఆదాయం సమకూరిందని ఈవో భాస్కరరావు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నా భార్య నిర్మల పోటీ

లేదంటే నా అనుచరుడు ఆంజనేయులు పోటీలో ఉంటారేమో

- సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో మాట్లాడుతా
- జిల్లా మంత్రి దామోదర సహకారంతో కిషన్ సేట్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తా
- సంగారెడ్డి దసరా సంబరాల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి నా భార్య నిర్మల లేదంటే నా అనుచరుడు చేర్యాల ఆంజనేయులులో ఒకరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉంటారేమో' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తోనూ మాట్లాడతానని చెప్పారు. శనివారం తన సొంత ఖర్చులతో సంగారెడ్డిలో దసరా సంబరాలను జగ్గారెడ్డి ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో మరో అనుచరుడు సీనియర్ నేత తోపాజి కిషన్ సేట్‌కు ఉమ్మడి మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానని ప్రకటించారు.

ఎస్పీ కారును నా కారుతో గుద్దిన..

ఏం లేనప్పుడే పోలీసులను ఎదుర్కొన్న. 1995లో మునిసిపల్ ఎన్నికల్లో అవతలి పార్టీ వాళ్లు రిగ్గింగ్ చేస్తుంటే అడ్డుకున్న నా కార్యకర్తలను అప్పటి ఎస్పీ చితకబాది దౌర్జన్యం చేశాడు. ఎస్పీ ఎక్కడున్నాడో తెలుసుకుని, నా కారుతో ఎస్పీ కారును గుద్దిన. 4 వేల మందితో సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన. ఎక్కడికక్కడ నిర్బంధించి రిగ్గింగ్ చేయించిన. నా ధైర్యం చూసి ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు బెదిరిపోయారు. మొన్నటి ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్ఎస్ వాళ్లు డబ్బులు పంచుతున్నారని నా కార్యకర్తలు డీఎస్పీ, సీఐలను కలిస్తే.. మీరూ కూడా పంచుకోండని హేళన చేశారు. 30 ఏళ్ల కిందటనే పోలీసులను అదరగొట్టినోడిని. మొన్న ఎన్నికల్లో బెదిరించడం, రిగ్గింగ్ చేయడం నాకు లెక్కనా అంటూ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంగారెడ్డిలో విచ్చలవిడిగా డబ్బులు పంచుతుంటే మా వాళ్లు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేయగా కొందరు ఓటర్లు మా పొట్టకొట్టవద్దని బతిమాలాడారు. నాకు తెలియగానే మా వాళ్లను వెనక్కి రప్పించిన. పైసలన్నీ పండుగలకు ఖర్చు చేస్తాగానీ ఎలక్షన్లల్లో పంచిపెట్టి గెలవబోనని నా అనుచరులతో చెప్పా. ఎంత తోపులమైనా ఏదో ఒకరోజు కాటికి పోవాల్సిందే. ప్రాణానికి చావుంది కానీ పైసాకు చావు లేదు. జగ్గారెడ్డి బలహీనుడు కాదు.. నాకు బాధ్యతలు, పనులు ఉన్నాయి. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ఇప్పుడు మంచి పొజిషన్‌లో ఉన్నా అని ఆయన పేర్కొన్నారు.



సంగారెడ్డిలో దసరా సంబరాల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి చిత్రంలో నిర్మలజగ్గారెడ్డి, ఆంజనేయులు, తోపాజి కిషన్‌సేట్

జగిత్యాల కేంద్రంగా

రూ.288 కోట్ల ఐటీసీ కుంభకోణం!

తొమ్మిది నెలల విచారణలో వెలుగులోకి.. తాజాగా రూ.11 కోట్ల రికవరీ!

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కేంద్రంగా వస్తు సేవల పన్ను ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) అక్రమాల వ్యవహారంపై ఆ శాఖ ఉన్నతాధికారులు ముమ్మర విచారణ జరుపుతున్నారు. ఐటీసీ అవకతవకలపై సుమారు 9 నెలల క్రితం జగిత్యాలలో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేసి ఓ జీఎస్టీ ప్రాక్టిషనర్‌ను అదుపులోకి తీసుకున్న ఉన్నతాధికారులు..ఐటీసీ రికవరీపై దృష్టిపెట్టారు. సదరు ప్రాక్టిషనర్ బదలాయించిన ఐటీసీని పొందిన కంపెనీల నుంచి తాజాగా సుమారు రూ.11 కోట్లు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. జగిత్యాల కేంద్రంగా సుమారు రూ.288 కోట్ల ఇన్‌పుట్ టాక్స్ కుంభకోణం జరిపినట్లుగా తాజాగా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై గతేడాది డిసెంబరు రెండోవారంలో అధికారులు జగిత్యాలలో సోదాలు నిర్వహించారు. జగిత్యాలలో జీఎస్టీ ప్రాక్టిషనర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిపై అధికారులు కేసు నమోదు చేశారు. దాదాపు 32 బోగస్ కంపెనీలను అతను సృష్టించి అక్రమాలకు పాల్పడ్డట్లుగా అధికారులు గుర్తించారు. కొత్త వ్యాపార సంస్థల ఏర్పాటుకు, వ్యాపార సంస్థల మూసివేతకు పలువురు వ్యాపారులు సదరు ప్రాక్టిషనర్‌ను కలిసేవారు. అలా వచ్చిన వారి నుంచి పాన్ కార్డు, ఆధార్ కార్డులు సేకరించేవాడని అధికారులు గుర్తించారు. మూసివేయమన్న సంస్థల నిర్వాహకులకు చెందిన పాన్ కార్డు, ఆధార్ కార్డుల ద్వారా ఫోన్ నంబర్లు మార్చి జీఎస్టీ చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకొని సదరు కంపెనీలను ఆన్‌లైన్‌లో కొనసాగించినట్లుగా అధికారులు విచారణలో గుర్తించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించకుండానే, పేపర్ పైనే లావాదేవీలు జరిపి బురిడీ కొట్టించాడని అధికారులు అనుమానించారు. జీఎస్టీ వెబ్‌సైట్‌లో తప్పుడు పత్రాలు అప్‌లోడ్ చేయడంతోపాటు 32 బోగస్ సంస్థలను తెరిచి వాటి ద్వారా సిమెంట్, ఐరన్ వ్యాపారం చేసినట్లు చూపించాడు. తన బోగస్ సంస్థల ఖాతాల్లో జమైన ఇన్‌పుట్ ట్యాక్స్ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సుమారు 302 మంది వ్యాపారులకు బదిలీ చేసినట్లుగా అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఇందులో రూ.120 కోట్ల ఐటీసీ ఓ బోగస్ కంపెనీకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. మిగతా మొత్తాన్ని హైదరాబాద్‌లోని పంజాగుట్ట, చార్మినార్, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ కంపెనీలకు బదలాయింపులు జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో దాదాపు 150 కంపెనీల ఐటీసీని జీఎస్టీ అధికారులు బ్లాక్ చేశారు. ఆయా సంస్థలు ఉపయోగించిన ఐడీలను తమకు ఇవ్వాలని జగిత్యాల జీఎస్టీ అధికారి ఆనంద్‌రావు... డీజీపీ జితేందర్‌కు గత నెలలో లేఖను రాసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఐటీసీ లబ్ధిపొందిన కంపెనీల నుంచి సుమారు రూ.11 కోట్లు రికవరీ చేసినట్లుగా జీఎస్టీ అధికార వర్గాలు చెబుతున్నాయి. మరింత లోతుగా విచారణ జరిపి ఐటీసీని రికవరీ చేయడంపై అధికారులు దృష్టిసారించారు. ఈ విషయమై జగిత్యాల జిల్లా జీఎస్టీ అధికారి ఆనంద్‌రావును సంప్రదించగా ఐటీసీ అక్రమాల వ్యవహారంపై హైదరాబాద్ కేంద్రంగా విచారణ జరుగుతోందని తెలిపారు.

కొండా 7 రేవూరి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తి గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి కొట్టారని ఆరోపిస్తూ కొండా వర్గీయులు ఆదివారం ధర్మారం వద్ద రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేఖ పెద్దసంఖ్యలో అనుచరులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు ఆటోలో వచ్చారు. నేరుగా తమవారి వద్దకు వెళ్లి మాట్లాడారు. పోలీసులు తమను కొట్టారని వారు మంత్రికి చెప్పటంతో డీసీపీపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ నుంచే వరంగల్ నగర పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాకు ఫోన్ చేసి ఎస్ఐ, సీఐ, డీసీపీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికి స్టేషన్‌కు చేరుకున్న సీపీ.. మంత్రి వర్గీయులతో ఆమె ముందే మాట్లాడారు. దీంతో శాంతించిన మంత్రి స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపోయారు. అయితే పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మంత్రి కొండా సురేఖ.. సీఐ కుర్చీలో కూర్చోవడం కొత్త వివాదానికి దారితీసింది. ప్రొటోకాల్ నిబంధనల్ని మంత్రి ఉల్లంఘించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గీసుగొండ పోలీసు స్టేషన్‌వద్దకు చేరుకున్న ఇరువర్గాల జనం

స్కిల్ వర్సిటీ..

కొలువు గ్యారెంటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచాలన్న లక్ష్యంగా స్కిల్ యూనివర్సిటీ ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సలెన్స్ (ఫైన్) పేరుతో 3 నెలల సర్టిఫికేషన్ కోర్సు ప్రకటించింది. స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఈ కోర్సును అమలు చేయనున్నారు. కోర్సు పూర్తిచేసిన తర్వాత అడ్వాన్స్ నర్స్ ప్రాక్టీషనర్, స్టాఫ్ నర్స్, నర్స్ ఎడ్యుకేటర్, క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్‌గా అవకాశాలు ఉంటాయి. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తి చేసినవారు, చివరి సంవత్సరం చదువుతున్న వారు ఈ కోర్సులో ప్రవేశాలకు అర్హులు. గరిష్ఠ వయస్సు 35. మూడు నెలల సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కోర్సుకు అపోలో ఆస్పత్రుల గ్రూప్ 'అపోలో మెడ్ స్కిల్స్ ఇండస్ట్రీ' భాగస్వామ్యం అందించనుంది.

6 నెలల 'ఫార్మా అసోసియేట్' ప్రోగ్రాం..

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న మొత్తం వ్యాక్సిన్లలో మూడో వంతు హైదరాబాద్ నుంచే ఉండడం విశేషం. ఈ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంగా 6 నెలల ఫార్మా అసోసియేట్ కోర్సును ప్రకటించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు క్యాంపస్‌లో 7 రోజుల తరగతుల అనంతరం 6 నెలల అప్రెంటిస్‌షిప్‌ను డాక్టర్ రెడ్డీస్ అందించనుంది. శిక్షణ కాలంలో రూ.17,500, కోర్సు పూర్తయ్యాక రూ.22 వేల చొప్పున వేతనం అందిస్తారు. రూ.5 వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 2023-24లో బీఎస్సీ (కెమిస్ట్రీ) పూర్తిచేసినవారు ప్రవేశాలకు అర్హులు.

వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం..

ఆన్‌లైన్ షాపింగ్ గణనీయంగా వృద్ధి చెందుతుండడంతో హైదరాబాద్ కేంద్రంగా అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి దిగ్గజ కంపెనీలు ఇప్పటికే భారీ గోదాములు నిర్వహిస్తున్నాయి. అపార అవకాశాలున్న ఈ రంగంలో ఉద్యోగాలకు మూడున్నర నెలల వ్యవధితో వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సును అందించనున్నారు. 26 ఏళ్లలోపు, ఇంటర్ కనీస అర్హతతో ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వేర్‌హౌస్ డేటా మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ క్వాలిటీ చెక్, వెహికిల్ ప్లానింగ్, ట్రెండ్ అనాలిసిస్ విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ సూపర్‌వైజర్‌గా నియమిస్తారు. వివిధ దేశాల్లో ఐటీ, లాజిస్టిక్ కంపెనీలకు ఐటీ, ఇతర సేవలు అందించే రెడింగ్టన్ గ్రూప్‌తో పాటు లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్ ఈ కోర్సును నిర్వహించనున్నాయి. తాత్కాలిక క్యాంపస్‌లో రెడింగ్టన్ గ్రూప్ రూ.7 కోట్లతో లాజిస్టిక్స్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేయనుంది. కోర్సు అనంతరం ఈ గ్రూప్‌లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. అలాగే వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం అర్హతలతోనే నాలుగు నెలల కీ కంసైనర్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం కూడా ఈ కంపెనీలు అందించనున్నాయి. ఈ కోర్సు పూర్తయ్యాక కీ అకౌంట్ ఎగ్జిక్యూటివ్/మేనేజర్, చానల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సర్వీస్ ఏజెంట్‌గా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.

గంజాయి కేసులో ఇరికించారని మనస్తాపం

దసరా రోజే కానిస్టేబుల్ ఆత్మహత్య

- గంజాయి చోరీ కేసులో సస్పెండైన సాగర్
- ఇద్దరు ఎస్ఐలు, మరో వ్యక్తి కలిసి తనను బలి పశువును చేశారంటూ సెల్ఫీ వీడియో

బూర్గంపాడు/ఏన్కూరు, అక్టోబరు 13: గంజాయి చోరీ కేసులో తనను బలిపశువు చేశారని ఆరోపిస్తూ ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరులో దసరా రోజే జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. 2013 కానిస్టేబుల్ బ్యాచ్, ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ (33) భద్రాద్రి జిల్లా బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన సమయంలో ఈ ఏడాది జనవరిలో ఆ స్టేషన్‌లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి మయామైంది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు కానిస్టేబుల్ సాగర్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. మళ్లీ ఈనెల 10న ఏడూళ్లబయ్యారం పోలీసుస్టేషన్‌కు పోస్టింగ్ ఇవ్వగా సస్పెండైన సమయంలో బూర్గంపాడు పోలీస్టేషన్‌లో ఉన్న ఎస్సై రాజ్‌కుమార్ ఆ పోలీస్టేషన్‌లో ఉండటంతో మనస్థాపం చెందిన సాగర్ ఈనెల 12న ఏన్కూరు సాగర్ కాలువ సమీపంలో పురుగులమందు తాగాడు. అంతకంటే ముందే కానిస్టేబుల్ సాగర్ ఓ సెల్ఫీ వీడియో రికార్డు చేసి కుటుంబసభ్యులకు పంపాడు. అందులో అతడు మాట్లాడుతూ గంజాయి చోరీ కేసులో తనను బలి పశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఎస్సైలు సంతోష్, రాజ్‌కుమార్ బూర్గంపాడుకు చెందిన గొనెల నానితో కలిసి గంజాయిని అమ్ముకున్నారని పేర్కొన్నాడు. గంజాయి మాయమైన వ్యవహారంలో ఈ ఇద్దరు ఎస్ఐల పాత్ర ఉందని, వారిని వదిలేసి తనపై చర్యలు తీసుకోవడంతో మనస్తాపానికి గురయ్యానని తెలిపాడు. పురుగులమందు తాగిన సాగర్‌ను కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం 5గంటలకు మృతిచెందాడు. కానిస్టేబుల్ సాగర్‌కు భార్య తేజస్విని, ఏడేళ్ల కుమార్తె వేద సహస్ర, ఐదేళ్ల కుమారుడు మన్విత్ సాయి ఉన్నారు. సాగర్ తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు ఇద్దరు ఎస్సైలు, బూర్గంపాడు సీఐ సత్యనారాయణ, మరో వ్యక్తి గోనెల నానిపై కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాగర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు తనను తీవ్రంగా వేధించారని ఆరోపించాడు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ దళితులు, గిరిజనులను చిన్న చూపు చూసే వారని ఆరోపించాడు. బాధ్యులపై చర్యలు తీసుకుని తన కుటుంబానికి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నాడు.



భార్య పిల్లలతో కానిస్టేబుల్ సాగర్(ఫైల్)

అనారోగ్యంతో ఎవరికీ భారం కాకూడదని..

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఘటన

ఎర్రుపాలెం, అక్టోబరు 13: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులు ఎవరికీ భారం కాకూడదని భావించి గడ్డి మందు తాగి తనువులు చాలించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లకు చెందిన మండల కాంగ్రెస్ సీనియర్ నేత ధనేకుల సాంబశివరావు (72), భార్య సరోజిని (65) కొన్నేళ్ల క్రితం ఎర్రుపాలేనికి వచ్చి స్థిరపడ్డారు. కుమారుడు లండన్‌లో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తెకు వివాహమైంది. సాంబశివరావు భార్య అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. కొద్దికాలం క్రితం సాంబశివరావు ఆసుపత్రిలో చేరగా.. బైపాస్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. కుమారుడు, కుమార్తె దూరంగా ఉండడం, తమ ఆలనాపాలనా చూసే వారు లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురైన సాంబశివరావు, సరోజిని శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేస్తాం

ఐదేళ్లలో తయారయ్యేలా ప్రణాళికలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- పామాయిల్‌కు ఉజ్వల భవిత: తుమ్మల
- సాగుకు సర్కారు పెద్ద పీట: పొంగులేటి

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 13: రానున్న ఐదారేళ్లలో రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు పంటతో పాటు అదనపు ఆదాయం వచ్చేలా మోటార్లకు సోలార్ పంపు సెట్లను అమర్చి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రూ.36 కోట్లతో నిర్మించిన బయో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను శనివారం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడారు. ప్రకృతి వనరులతో లభించే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కొత్త ఎనర్జీ పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పామాయిల్ పంటకు ఉజ్వల భవిష్యత్ ఉందని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తమ ప్రభుత్వం పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. టన్ను పామాయిల్ గెల ధర రూ.20వేల వరకు పెరిగే అవకాశం ఉందనాట్నరు. కేంద్రంతో మాట్లాడి దిగుమతి సుంకాన్ని పెంచేలా కృషి చేశామని, భవిష్యత్‌లో కనీస మద్దతు ధర కోసం ఏపీ, కర్ణాటక రైతులతో కలిసి కేంద్రంతో మాట్లాడతామని తెలిపారు. హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లోనూ పామాయిల్ వేయడానికి అనుమతులున్నాయని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బడ్జెట్‌లోనూ అధికంగా నిధులు కేటాయించి అన్నదాతల అభివృద్ధికి పాటు పడుతోందని తెలిపారు.



అశ్వారావుపేటలో పవర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఇందిరా డెయిరీని ఆదర్శంగా నిలుపుతాం: భట్టి

ఎర్రుపాలెం: పాల ఉత్పత్తిలో ఇందిరా మహిళా డెయిరీని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కో-ఆపరేటివ్ సొసైటీని రూపొందించి.. పాడి రంగంలో మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో ఇందిరా మహిళా డెయిరీని ఆదివారం భట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పరిశ్రమ ద్వారా వచ్చే ప్రతి పైసా మహిళా సభ్యులకే చెందేలా ప్రాజెక్టును రూపకల్పన చేశామని వెల్లడించారు. పాలఉత్పత్తి కోసం మధిర నియోజకవర్గంలో ఉన్న స్వయంసహాయక సంఘాల మహిళా సభ్యులకు ప్రభుత్వం గేదెలు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో నిరుద్యోగులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. పచ్చిగడ్డి, దాణాను సరఫరా చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని మహిళా స్వయంసహాయక సంఘాల సభ్యులకు ఏటా రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి ప్రకటించారు.

కన్నకూతురిపై తండ్రి అఘాయిత్యం

- కుమారుడు స్థానికులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం
- నిందితుడి అరెస్టు.. పోక్సో కేసు నమోదు
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

షాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కన్నకూతురిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే కీచకుడిలా మారి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ అమానవీయ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. భార్య లేకపోవడంతో మైనర్ అయిన కూతురిని భయపెట్టి కొన్ని రోజులుగా అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. శనివారం రాత్రి మద్యం సేవించి కూతురి నోట్లో దుస్తులు కుక్కి ఆమెపై లైంగిక దాడి చేస్తుండగా కుమారుడు చూసి స్థానికులకు చెప్పాడు. వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి.. అతనిపై పోక్సో కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఐఐటీ-జేఈఈ, నీట్ 2025 మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ 2025 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'కోటా' డిజిటల్ మెటీరియల్ సిద్ధమైంది. ఈ మేరకు గురువారం ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మెటీరియల్‌లో 2024-25 సంబంధించిన డిజిటల్ స్టడీ మెటీరియల్ (కాన్సెప్ట్స్, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు), 2024-25 కోటా గ్రాండ్ టెస్టులు, సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్ టెస్టులు, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొంది. వాట్సాప్ ద్వారా పొందాలనుకునే వారు NEET25 అని, జేఈఈ వారు JEE25 అని టైప్ చేసి 9849016661కు వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

ఇద్దరు పిల్లలతో తండ్రి ఆత్మహత్య

- కుమారులను బావిలోకి తోసిన నాన్న
- ఆ తర్వాత తానూ దూకి బలవన్మరణం
- కుటుంబ కలహాలతో దసరా రోజు దారుణం
- కామారెడ్డి జిల్లా నందివాడలో విషాదం



విఘ్నేశ్, అనిరుధ్, శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

తాడ్వాయి, అక్టోబరు 13: కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఆ ఇంటి పెద్ద.. తన ఇద్దరు పిల్లలతో కలిసి చనిపోవాలకున్నాడు. దసరా రోజు కుమారులిద్దరినీ వ్యవసాయ బావిలోకి తోసేశాడు. ఆపై అతడు కూడా దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పండుగ రోజున జరిగిన ఈ ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో విషాదం నింపింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయగావ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(36) 12 ఏళ్ల క్రితం నందివాడకు చెందిన చిట్టెపు గుండారెడ్డి-సుగుణవ్వల కుమార్తె అపర్ణను వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. భార్యతో పాటు అత్తా మామలతో కలిసి నందివాడలోనే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా శ్రీనివాస్‌రెడ్డికి భార్య, అత్తమామలతో విభేదాలు వచ్చాయి. 'నువ్వు ఇల్లరికం వచ్చావ్' అంటూ అత్త మామ, భార్య పెత్తనం పెరగడం ఆయనను మరింత మనస్తాపానికి గురి చేసింది. దీంతో 6 నెలల నుంచి శ్రీనివాస్‌రెడ్డి వేరుగా ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్, జూదానికి అలవాటు పడిన శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష వరకు అప్పు చేసినట్లు తెలిసింది. ఇలా కుటుంబకలహాలు, అప్పులు పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శనివారం రాత్రి దసరా సందర్భంగా బంధువులకు జమ్మి పెడతానని కుమారులు విఘ్నేశ్‌రెడ్డి(4), అనిరుధ్ రెడ్డి(6)లను తీసుకెళ్లాడు. వ్యవసాయ భూమి పక్కన ఉన్న బావిలో ఇద్దరు పిల్లలను తోసి, ఆపై తాను కూడా దూకాడు. ఆదివారం తెల్లవారుజామున ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.